www.manatelangana.news
Mana Telangana

# మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 215 | గురువారం | 25 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00





ఎడిటర్

## తెలంగాణ అక్షరంపై కక్ష దేనికి?

ప్రజాక్షర ప్రవాహంగా జనాస్త్ర తూణీరంగా అనతి కాలంలోనే అనితర సాధ్యమైన చరిత్ర సృష్టించుకున్న '**మన తెలంగాణ**' దిన పత్రిక నాలుగో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వీరోచిత విజయానంద సందర్భమిది.

పుట్టి మూడేళ్లయిందంటే బుడిబుడి నడకల ప్రాయమని చెప్పనక్కరలేదు. '**మన తెలంగాణ**' కు మాత్రం ఈ మూడేళ్లే మూడు వరుస యుద్ధ క్షేత్రాలు. నలువైపుల నుండీ దూసుకొస్తున్న సమస్యలతో నిరంతరం పోరాడుతూ వేసిన రక్తసిక్త పాదాలు.

డబ్బుకి విలువ దారుణంగా పడిపోయి, అన్ని పరికరాలూ ప్రియమైపోయి, పోటీ పెరిగిపోయిన రంగంలో ఎటువంటి వాణిజ్య ప్రయోజనాలు ఆశించకుండా సకల జనాభ్యుదయ సమాజ నిర్మాణం కోసం సామాజిక న్యాయ సాధన కోసం అక్షరాల ఇటుకలెత్తి సవ్యంగా పేర్చడం, ఒక్క క్షణం ఆలస్యం జరగకుండా పాఠకులకు చేర్చడం మాటలు కాదు, మూటలతో పని.

మిగతా రాష్ట్రాలన్నింటి ఏర్పాటు ఒక రీతి, తెలంగాణ అవతరణది విశిష్టమైన విలక్షణమైన ప్రత్యేకమైన తీరు. అసాధారణ పోరు బాటలో ఆవిష్కరించుకున్న రాష్ట్రం తెలంగాణ. యువత ప్రాణాలు ఒడ్డి నెత్తురోడ్చి పలు రకాల కర్కశ నిర్బంధాలను ఎదిరించి ఛేదించి, సకల జనులూ నేల ఈనినట్టు వీధుల్లోకి వచ్చి సమరం చేసి సాకారం గావించుకున్నది. నాడు నిజాం నిరంకుశ పాలనను అంత



'మన తెలంగాణ'ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు (ఫైల్)

మొందించిన చందంగానే పాటొక్క ఈటెగా పదంపదం కలిపి పలు రూపాల ప్రతిఘటన పద్ధతుల ద్వారా ఉమ్మడి పాలనకు తెర దింపి సఫలీకృతమైన మహోద్యమానికి పుట్టిన బిడ్డ తెలంగాణ. నిండు నిజంగా అత్యధిక శాతం అణగారిన ప్రజలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలున్న తెలంగాణ ఆకలీ అవమానాలను, దోపిడీ దొరహంకారాలను మోసిమోసి దేశీయ వలస పాలకుల దయాదాక్షిణ్యాల బరువు కింద కుంగికుంగి ఒక్కసారిగా నిటారుగా నిలిచి పోరాడి తెచ్చుకున్న విలక్షణ రాష్ట్రం తెలంగాణ.

స్వరాష్ట్రంలో ముందుగా, చిరకాలంగా దగాపడ్డ ప్రజాబాహుళ్యానికి మేలు చేసే అపూర్వ అనితర సాధ్యమైన అభ్యుదయ పాలన నెలకొనాలని, అందులో వారికి పరిపూర్ణ భాగస్వామ్యం ఉండాలని ఆశించి అటువైపుగా దిశా నిర్దేశం చేస్తూ నిర్మాణాత్మక పాత్ర పోషించాలనే దృఢ సంకల్పంతో ఇద్దరు సీనియర్ జర్నలిస్టులు మరి కొందరు ఔత్సాహికులను కూడగట్టుకొని నెలకొల్పిన పత్రిక ఇది.

ఆవిర్భావ వేళ '**మన తెలంగాణ**' ను ఆశీర్వదించడానికి విచ్చేసిన మాన్య ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారు ఇచ్చిన ధైర్యం, ఊదిన నిబ్బరం ఎప్పటికీ మరువలేనివి. మన సొంత పత్రిక ఇది. దీనిని కంటికి రెప్పలా కాపాడుకుంటాం, తెలంగాణ మీడియాకు అండదండగా ఉంటామంటూ ఆయన చాచిన అభయ హస్తం కొండంత బలాన్నిచ్చింది. కానీ, ఆచరణలో అందుకు పూర్తి విరుద్ధంగా ఈ మూడేళ్లలో ఈ పసిబిడ్డను ఎదగనీయకుండా నిరోధించాలనే ధోరణే ప్రభుత్వ యంత్రాంగంలో ప్రస్ఫుటమైంది.

నాణ్యమైన వార్తలను, వ్యాఖ్యలను నిజాయితీగా అందిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిరూపించుకుంటూ కాళ్లూనుకోవడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో '**మన తెలంగాణ**' ను గొంతు నులిమి ఉనికిలో లేకుండా చేయడానికి అధికార వ్యవస్థ అన్ని సందర్భాల్లోనూ కుట్రపూరితంగానే వ్యవహరించింది. అదే సమయంలో తెలంగాణ ఉద్యమాన్ని అపహాస్యం చేసిన పత్రికలకే కాదు, బొత్తిగా ఉనికిలో లేని, గట్టిగా చెప్పుకోవడానికి లేని పత్రికల పట్ల అకారణ ప్రేమ చూపించి అంతింతనరాని విధంగా కోట్లాది రూపాయల ప్రకటనల వర్షం కురిపిస్తున్నది.

స్వయంగా ముఖ్యమంత్రి తన చేతుల మీదుగా ఆవిష్కరించిన నాటి నుంచే పదమూడు మాసాల పాటు ప్రభుత్వ ప్రకటనల రేటు నిర్ణయించలేదు. ప్రచురించిన అడ్వర్‌టైజ్‌మెంట్‌లకు డబ్బు చెల్లించలేదు. ఆనాటి నుంచి నేటి వరకు రేటు రివిజన్ కూడా చేయలేదు. వారి ఔదార్యం అంతటితో ఆగలేదు. 2017 జూలై నుంచి '**మన తెలంగాణ**' కు ప్రభుత్వ ప్రకటనల విడుదలపై పూర్తి నిషేధాన్ని విధించారు. స్వరాష్ట్రం ఏర్పడిన తరువాత వెలువడిన తొలి తెలంగాణ పత్రికపై ఎందుకింత కక్ష? ఇదంతా సమాచార, పౌర సంబంధాల శాఖ సాగిస్తున్న వికృత చర్యగానే భావించాలా? పసి వయస్సులోని ప్రజావాణిని అణగదొక్కడంలో ఔచిత్యమేమిటి?

పౌర స్వేచ్ఛ పరిరక్షణ, జీవన పరిస్థితుల మెరుగుదల, సామాజిక న్యాయం కొరకు సాగే పోరాటాలలో ప్రజల పక్షపాతిగా ఉంటుందని, వృత్తి ప్రమాణాలు కొరవడుతున్న నేటి మీడియా ప్రపంచంలో విలువలతో కూడిన పత్రికా రచనకు కరదీపికగా ఉంటుందని, '**మన తెలంగాణ**' తొలినాడు చేసిన బాసకు ఎన్ని కష్టాలు ఎదురైనా ఎదురొడ్డి నిలుస్తుందని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేస్తుంది. సమర్థన కోసం సమర్థన, విమర్శ కోసం విమర్శ కాకుండా నిర్మాణాత్మక పాత్రను పోషించే బాధ్యతను '**మన తెలంగాణ**' కొనసాగిస్తుంది. మంచికి అధికార పక్షంగా, చెడుకు ప్రతిపక్షంగా వ్యవహరిస్తుంది. జనహితం, సమాజహితం కోణం నుంచి వాస్తవాలను వెలికి తీస్తుంది. విశ్లేషిస్తుంది. అన్యాయాన్ని, అణచివేతను ఎదురిస్తుంది. అవినీతిని ఎండగడుతుంది.

భావ ప్రకటనా స్వేచ్ఛను అణగదొక్కడానికి చేసే ప్రయత్నాలన్నీ మట్టికలవక తప్పదన్నది చరిత్ర నిరూపించిన సత్యం. '**మన తెలంగాణ**' దానిని మరోసారి రుజువు చేసి తీరుతుంది.

పత్రిక నిర్వహణభారం రోజురోజుకీ పెరిగిపోతున్నా పాఠకుల ఆదరణ, ప్రకటనకర్తల ప్రోత్సాహం, సిబ్బంది కార్యదీక్షతో అప్రతిహతమైన ముందడుగు వేస్తుంది. ప్రభుత్వ యంత్రాంగం కనబరుస్తున్న వివక్షను విజ్ఞులైన ప్రజల ముందుంచుతుంది.

ఏది ఏమైనా ప్రజాదరణే ఇంధనంగా ఎత్తిన ఈ అక్షర కాగడా ఆరదు, ఆగదు.




# ఉప నిధులు ఉఫ్

- ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధికి కేటాయించింది రూ.14,375.13 కోట్లు కాగా, విడుదలైంది రూ.5 వేల కోట్లే
- ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలలే గడువు
- సబ్సిడీ రుణాలు అందక లబ్ధిదారులు విలవిల
- పూర్వపు ఉపప్రణాళికల దారిలోనే ఎస్‌సి నిధుల వ్యవహారం

**మన తెలంగాణ/ హైదరాబాద్ :** మరో రెండు నెలల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియబోతున్నా ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఖర్చు కాకుండానే మిగిలిపోతున్నాయి. మరోవైపు సబ్సిడీ రుణాల కోసం ఎస్‌సి లబ్ధిదారులు జిల్లా ఎస్‌సి కార్యనిర్వహణాధికారి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్‌సిల కోసం బడ్జెట్‌లో ప్రత్యేక అభివృద్ధి నిధిని ఏర్పాటు చేసినా స్పష్టమైన విధి విధానాలు రూపొందించక పోవడంతో కేటాయింపులు ఆ మేరకు జరగలేదు. ఈ నిధులు ఇతర పథకాలకు మళ్లాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎస్‌సిలకు ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగానే నిధులను కేటాయించినా వినియోగంమాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధికి తెలంగాణ ప్రభుత్వం విధి విధానాలను ఇటీవల రూపొందించింది. అయితే బడ్జెట్ కేటాయింపులకు నిధుల విడుదలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.14,375.13 కోట్లు కేటాయిస్తే అందులో దాదాపు 5 వేల కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. నిధులు విడుదలలో జాప్యం కారణంగా ఎస్‌సి లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు సకాలంలో మంజూరు కావడంలేదు. ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ఇది ప్రభావం చూపుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో తరువాయి 6లో

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ఉక్కుపాదం

ఉక్కు, సిమెంట్ ధరలు పెరగడంతో నిర్మాణాలు ఆగిపోయే ప్రమాదం

ఫిబ్రవరి 5లోగా పెరిగిన ధరలను వెనక్కి తీసుకోకపోతే అన్ని చోట్లా పనులు ఆపివేస్తామని బిల్డర్స్ అల్టిమేటం



**మన తెలంగాణ / హైదరాబాద్ :** ఇనుము, ఉక్కు ధరల పెంపును ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని, లేనిపక్షంలో నిర్మాణంలోని అన్ని ప్రాజెక్టులనూ ఆపివేస్తామని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఇనుము, ఉక్కు ధరల పెంపును వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వానికి ఫిబ్రవరి 5ను డెడ్‌లైన్‌గా విధిస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. సంస్థ జాతీయ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎన్.రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బి. సుగుణాకర్ రావుల అధ్యక్షతన నగరంలోని బిఎఐ కార్యాలయంలో బుధవారం అత్యవసర సమావేశం జరిగింది. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టులు, భారీ నిర్మాణాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, సాగు నీటిపారుదల ప్రాజెక్టులు, డబుల్ బెడ్ రూం ఇళ్ళు, కలెక్టరేట్ భవనాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం తదితర ప్రాజెక్టుల్లో ఇనుము, ఉక్కు వినియోగం గణనీయంగా పెరిగిందని, అయితే కొద్ది రోజులుగా వీటి ధరలు అమాంతంగా 60% పెరగడంతో అన్ని నిర్మాణరంగ, ప్రాజెక్టులపై భారీగా ఆర్థిక భారం పడుతోందని అభిప్రాయపడింది. సివిల్ తరువాయి 6లో



దాణా మూడో కేసులో

## లాలూకు ఐదేళ్లు జైలు

మరో మాజీ సిఎం జగన్నాథ్ మిశ్రాకు కూడా ఇదే శిక్ష

**న్యూఢిల్లీ:** దాణా కుంభకోణానికి సంబంధించిన మూడో కేసులో రాంచీలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం ఐదేళ్ల జైలు శిక్షను విధించింది. ఇప్పటికే దాణా కుంభకోణం కేసులో శిక్ష అనుభవిస్తున్న లాలూకు ఇది మరో దెబ్బ. ఆయనతో పాటు దోషిగా తేలిన మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ మిశ్రాకు కూడా న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. లాలూ, జగన్నాథ్ మిశ్రాలకు చెరో రూ. 5 లక్షల తరువాయి 6లో



## గజల్ శ్రీనివాస్‌కు షరతుల బెయిల్

**మన తెలంగాణ/ హైదరాబాద్:** లైంగిక వేధింపుల కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల నగదు, ఇద్దరు వ్యక్తుల పూచీకత్తు సమర్పించడంతో పాటు వారంలో రెండు సార్లు పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలని కోర్టు పేర్కొంది. దీంతో చంచల్‌గూడ జైలులో ఉన్న గజల్ శ్రీనివాస్ బుధవారం విడుదలయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉందన్నారు. అయితే ఈ కేసు నుంచి నిర్దోషిగా బయటికి వస్తాననే నమ్మకం ఉందని చెప్పారు. ఇక అభిమానుల ఆశీర్వాదం కూడా నాపై ఉందన్నారు. ఇదే కేసులో రెండో ముద్దాయిగా ఉన్న పార్వతికి ముందస్తు బెయిల్ లభించింది. దీంతో తరువాయి 6లో

మేజర్ పంచాయతీలకు

## మున్సిపల్ హోదా

- 20 వేల జనాభాగల పంచాయతీల జాబితా పంపాలని అధికారులకు ఆదేశాలు
- తండాలను పంచాయతీలుగా చేయాలని కోరుతూ 5040 ప్రతిపాదనలు

**మన తెలంగాణ / హైదరాబాద్ :** రాష్ట్రంలోని కొన్ని మేజర్ గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలుగా మారనున్నాయి. కొత్తగా మున్సిపాలిటీలు, నగరపంచాయతీలు, గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఆ దిశగా కసరత్తు మొదలుపెట్టింది. మున్సిపాలిటీలుగా మార్చడానికి జనాభా ప్రాతిపదికన అర్హత ఉన్న మేజర్ గ్రామ పంచాయతీ జాబితాను సిద్ధం చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. పంచాయత్ రాజ్ అధికారులు ఈ మేరకు జిల్లా అధికారులను ఆదేశించారు. 20,000 జనాభా ఉన్న మేజర్ గ్రామ తరువాయి 6లో

6 21 మంది రాష్ట్ర పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు
- అదనపు డిజి జితేందర్‌కు రాష్ట్రపతి మెడల్

ప్రభుత్వరంగ బ్యాంకులకు రూ.88,139 కోట్ల మూలధనం 9
- ప్రణాళికను ప్రకటించిన కేంద్రం

# పోలీసులపై విచారణకు ఒప్లయింట్ అథారిటీ : హైకోర్టు

**మన తెలంగాణ**/ హైదరాబాద్: పోలీసులపై ఆరోపణలు వచ్చినప్పుడు విచారణకు రాష్ట్రస్థాయి భద్రత కమిషన్, పోలీసులు చేసే ఫిర్యాదుల్ని పరిష్కరించేందుకు పోలీస్ కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటు చేయాల్సిందేనని తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే గతంలో తాము ఉత్తర్వులు ఇచ్చామని పేర్కొంది. ఏపీలో వాటిని ఏర్పాటు చేసేందుకు హైకోర్టు నాలుగు మాసాల గడువు ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీటిని తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పాటు చేయాల్సిందేనని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ తేల్చి చెప్పింది. కమిషన్/అథారిటీలకు కమిటీల ఏర్పాటుకు సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఏపీ హోం శాఖ సవాల్ చేసిన వ్యాజ్యాన్ని బెంచ్ బుధవారం విచారించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా సింగిల్ జడ్జి ఆదేశాలున్నాయనే వాదనతో బెంచ్ ఏకీభవించింది. కమిషన్/అథారిటీల్లో ఎవరెవరు ఉండాలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్ని బెంచ్ సవరించింది.



## గోండు, లంబాడీల సమస్యను పరిష్కరించండి

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : గోండు, లంబాడీల సమస్యను పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మాజీ ఎంపి రవీంద్ర నాయక్ అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గోండు తెగను లంబాడీ తెగ పై ఉసిగొల్పుతున్నారన్నారు. రాజ్యాంగబద్ధంగానే లంబాడీలను ఎస్‌టి జాబితాలో చేర్చారన్నారు.

# పవన్‌కు ఎవ్వరూ ఓటేయరు

**వస్తున్న వారు అభిమానులే కాని ఓటర్లు కాదు**

**సికింద్రాబాద్ కోర్టు వద్ద మందకృష్ణ మాదిగ**



**మన తెలంగాణ**/హైదరాబాద్ : సినీనటుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌ను చూసేందుకే అభిమానులు వస్తున్నారే తప్ప ఆయనకు ఓటేసేందుకు ఎవ్వరూ రారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు.తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కోదండ రామ్ లాంటి వాళ్ళు పర్యటన చేసేందుకు, ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన తనకు దీక్ష చేసే స్వేచ్ఛ లేదని, పవన్ కల్యాణ్‌కు మాత్రం తిరిగేందుకు అనుమతిచ్చారని ఎద్దేవా చేశారు. బెయిల్‌పై విడుదలైన మందకృష్ణ బుధవారం వేరే కేసుకు సంబంధించి సికింద్రాబాద్ సివిల్ కోర్టుకు హాజరైన సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణాలో కెసిఆర్ పునాధులు కదులుతున్నాయని, వాటిని కాపాడేందుకే పవన్ కల్యాణ్ ను తిప్పుతుతున్నారని ఆరోపించారు. ఇక్కడ కెసిఆర్ పాలన, ఎపిలో సిఎం చంద్రబాబు పాలన బాగుందని పవన్ కితాబిచ్చారని, అలాంటప్పుడు ఇక్కడెందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. చాలామంది పిచ్చోళ్ళను చూశాను కాని పవన్ కల్యాణ్ లాంటి పిచ్చోన్ని చూడలేదని మందకృష్ణ అన్నారు. ఉద్యమ సమయంలో సిఎం కెసిఆర్, మంత్రులు హరీశ్ రావు, కెటిఆర్ ల పై గతంలో నాన్ బెయిలబుల్ కేసులు నమోదు అయ్యాయని, వాటిని తిరగదోడి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్ నరసింహన్ ను కలుస్తానని చెప్పారు. గవర్నర్ చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చూడాలన్నారు. తనపై నాన్ బెయిలబుల్ కేసు లేకున్నా జైల్లో ఎందుకు పెట్టారని అన్నారు. కెసిఆర్ గతంలో పది రోజులు దీక్ష చేసినప్పుడు ఎందుకు పట్టించుకోలేదని, తాను 48 గంటలు దీక్ష అని చెప్పి 48 సెకన్లు కూడా చేయకుండానే ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. ప్రజా ఉద్యమం అణచివేయలని సిఎం చూస్తున్నారని ఆరోపించారు.

**27 తరువాత భవిష్యత్తు కార్యాచరణ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణ పై బిల్లును ప్రవేశపెట్టాలని, ఈ అంశంపై సిఎం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్న హామీ అమలుకు వత్తిడి తెస్తామని మందకృష్ణ తెలిపారు. ఈ నెల 27 వరకు వేచి చూసి అఖిలపక్షం ఏర్పాటు చేసి రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## కెసిఆర్ స్క్రిప్టనే చదువుతున్న పవన్ : విహెచ్



సిఎం కెసిఆర్ రాసిచ్చిన స్క్రిప్టనే పవన్ కల్యాణ్ చదువుతున్నారని కాంగ్రెస్ నేత వి.హనుమంత రావు అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సంస్కృతిపై గొప్పలు చెబుతున్న పవన్ కల్యాణ్ ఎన్ని పెళ్లిళ్లు చేసుకోవాలో చెబితే బాగుండేదన్నారు. అవినీతి పై పోరాడుతానంటున్న పవన్‌కు కెసిఆర్ చేస్తున్న అవినీతి కనబడటం లేదా ? అని ప్రశ్నించారు. నిన్నటి వరకు చంద్రబాబు భజన చేసిన పవన్ ఇప్పుడు కెఇసార్ భజన చేస్తున్నాడని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన కోదండరామ్, మందకృష్ణల అరెస్టులు ఆయనకు కనపడడం లేదా అని అన్నారు.

## కాంగ్రెస్‌లోకి 'నాగం' వద్దు

**హస్తినకు పలువురు నేతలు**

**మన తెలంగాణ**/ హైదరాబాద్: మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి ని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఆ పార్టీకి చెందిన మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ నేతలు కొందరు బుధవారం ఢిల్లీకి వెళ్ళారు. బిజెపిపై అసంతృప్తితో ఉన్న నాగం ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతారని, తన స్వంత నియోజకవర్గమైన నాగర్‌కర్నూల్ నుండి పోటీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చిందని వార్తలు వస్తున్నాయి. దీనిపై గతంలో పలుమార్లు కాంగ్రెస్ తరుపున నాగర్ కర్నూలు నుండి పోటీ చేసిన ఎంఎల్‌సి దామోదర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నేరుగా అధిష్టానాన్ని కలిసి అభ్యంతరాన్ని తెలియజేసేందుకు ఆయన, మరికొందరు నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. ఇప్పటికే నాగర్‌కర్నూలు ఎంపి నంది ఎల్లయ్యను కలిసి తమ బాధను తెలియజేశారు. నాగర్‌కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో దశాబ్దాలుగా కాంగ్రెస్ కార్యకర్తలను కష్టనష్టాల్లో కాపాడుకుంటూ వస్తున్నామని, అక్కడ తమకు మొదటి నుండి నాగం జనార్ధన్‌రెడ్డినే పోటీగా ఉన్నారని, అనేక మంది కార్యకర్తలపై కేసులు పెట్టి, జైళ్ళో వేయించారని చెప్పారు. అలాంటి నాగంను పార్టీలో చేర్చుకోవద్దని కోరుతున్నారు. రెండు రోజుల పాటు ఢిల్లీలోనే ఇతర ఎఐసిసి కాంగ్రెస్ పెద్దలను, వీలైతే అధ్యక్షుడు రాహుల్ గాంధీని కూడా కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే సమయంలో ఢిల్లీలో ఉన్న మాజీ మంత్రి డి.కె.అరుణను కూడా కలిశారు. ఈ విషయంపై ఆమెను 'మన తెలంగాణ' సంప్రదించగా పార్టీలోకి ఎవరు వచ్చినా అభ్యంతరం లేదని, కాంగ్రెస్ పటిష్టమవ్వాలనే తాము కోరుకుంటామని చెప్పారు. అయితే, ఎవరినైనా చేర్చుకునే ముందు స్థానిక నాయకులతో పార్టీ పెద్దలు మాట్లాడితే మంచిదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను వ్యక్తిగత పని మీద ఢిల్లీకి వచ్చానని, ఇటీవల అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీని వీలైతే జిల్లా నాయకులందరితో వెళ్ళి కలుస్తామని చెప్పారు.

# వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్!

- **బడ్జెట్ ప్రతిపాదనలపై శాఖలవారీగా ఆర్థికశాఖ సమావేశాలు**
- **29న అన్ని శాఖలతో సిఎస్ సమావేశం**

**మన తెలంగాణ**/హైదరాబాద్: రాష్ట్ర బడ్జెట్ తయారీకి అనుగుణంగా వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు అందాయి. ఆ ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు బుధవారం సమావేశాలను ప్రారంభించారు. తొలి రోజున వ్యవసాయం, పశు సంవర్ధకం, ఉద్యానవన విభాగాలకు చెందిన అధికారులతో ఉదయం మొదలు సాయంత్రం వరకు సమీక్ష జరిపారు. ప్రతిపాదనల్లో ఏయే అవసరాలకు ఆ శాఖ ఎంత కోరుతుందో పరిశీలించిన ఆర్థిక కార్యదర్శి రానున్న బడ్జెట్‌లో ఏ మేరకు కేటాయించడం సాధ్యమవుతుందో సూచనప్రాయంగా వివరించినట్లు తెలిసింది. నిర్ణయం తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి అయినప్పటికీ సాధ్యాసాధ్యాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. అన్ని శాఖల అధికారులతో ఈ తరహా సమీక్షా సమావేశాలను ఈ నెల 28వ తేదీకల్లా ముగించాలని ఆర్థిక కార్యదర్శి భావిస్తున్నారు. ఈ సమావేశాల అనంతరం రూపొందించే నివేదికపై ప్రధాన కార్యదర్శి ఎస్పి సింగ్ ఈ నెల 29వ తేదీన సచివాలయంలో సమావేశాన్ని నిర్వహించ నున్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు హాజరుకావాల్సిందిగా ఇప్పటికే సమాచారం వెళ్ళింది. ఆయా శాఖల నుంచి అందిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఏ మేరకు కేటాయింపులు చేయడం వీలవుతుందో ఆ శాఖ కార్యదర్శులకు ప్రతిరోజూ జరిగే సమావేశాల్లో ఆర్థికశాఖ కార్యదర్శి వివరించనున్నారు. పన్నుల ఆదాయంలో ఇప్పటికే దాదాపు 19% వృద్ధి రేటు నమోదు కావడంతో రానున్న బడ్జెట్ సైతం కనీసంగా 15% పెరుగుతుందని ఆర్థికశాఖ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. సుమారు రూ. 1.80 లక్షల కోట్ల మేరకు ఈసారి బడ్జెట్ ఉండే అవకాశం ఉందని, వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ఉంటుందని ఇప్పటికే సూచనప్రాయంగా తెలిపాయి. చాలా శాఖల నుంచి ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాల్సిందిగా ప్రతిపాదనల ద్వారా విజ్ఞప్తులు వచ్చాయని,ఆ ప్రతిపాదనల ప్రకారం బడ్జెట్ అంచనాలను పెంచడం కష్టసాధ్యమని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి. అందువల్లనే అవి పంపిన ప్రతిపాదనల్లో ఏ మేరకు ఎక్కడెక్కడ తగ్గించవచ్చో కూడా సవరించాలని ఆర్థిక కార్యదర్శి సూచిస్తున్నట్లు తెలిసింది. బుధవారం నుంచి ప్రారంభమైన శాఖలవారీ సమీక్షా సమావేశాలు ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఆ తర్వాత ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఒక స్పష్టత వస్తుంది. దానికనుగుణంగా పంపే నివేదికపై ముఖ్యమంత్రి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం

**లౌకిక ప్రజాస్వామ్యవామపక్ష వేదిక ద్వారా సాగించాలని సిపిఐ నిర్ణయం**



**మన తెలంగాణ**/హైదరాబాద్: దేశంలో మతపర విభజనకు, మత విద్వేషాలకు, తిరోగమనవాద సిద్ధాంతాలకు, ఫాసిస్టు పోకడలకు ప్రతీకగా నిలిచిన పాలక బిజెపికి, రాష్ట్రంలో ఆర్థిక అరాచకత్వం, రాచరిక పాలన సాగిస్తున్న టిఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ''లౌకిక ప్రజాస్వామ్య వామపక్ష'' విశాల వేదిక ద్వారా ప్రజా సమస్యలపై మరింత ఉధృత పోరాటం సాగించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఈ విషయాన్ని మఖ్దుంభవన్‌లో బుధవారం పత్రికా విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి వెల్లడించారు.మంగళవారం మఖ్దూం భవన్‌లో బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశం తాజా రాజకీయ పరిణామాలను సమీక్షించింది. సమావేశానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. రాజకీయ పరిణామాలను, 2018 పార్టీ సభ్యత్వం మహాసభల సన్నాహాలపై రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి నివేదికనిచ్చారు. పంచాయితీరాజ్ చట్టానికి ప్రభు త్వం సవరణలు, ఎన్నికలు, లోక్‌సభ శాసనసభ ముందస్తు ఎన్నికలు, శాసనసభ నియోజకవర్గాల పెంపు తదితర అంశాలపై కార్యవర్గం చర్చించింది. లౌకిక వ్యవస్థపై బిజెపి, సంఘ్‌పరివార్ మునుపెన్నడూ లేని విధంగా ముప్పేట సాగిస్తున్న దాడిని అరికట్టడానికి లౌకిక ప్రజాస్వామ్య వామపక్షాల విస్తృత ప్రజావేదిక తక్షణావసరంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గం భావిస్తున్నదని చాడ చెప్పారు. అందుకు కలిసి వచ్చే లౌకిక ప్రజాస్వామ్య పార్టీలు, శక్తులన్నింటిని కలుపుకొని వామపక్షాలు ముందుకు పోవాలని పార్టీ కార్యవర్గం తీర్మానించిందని ఆయన తెలిపారు. అన్ని రంగాలలో ఘోరంగా విఫలమైన మోడీ ప్రభు త్వం స్వీయ రక్షణలో పడిపోయిన ప్రతి సందర్భంలో దేశంలో కుల మత ఉద్రిక్తతను రెచ్చగొట్టడం ద్వారా ప్రజల దృష్టిని మళ్ళించడానికి సంఘ్‌పరివార్ పూనుకుంటున్నదని ఆయన చెప్పారు. భారత జనాభాలో ఒక శాతం అత్యంత ధనవంతులు గత ఏడాది ఉత్పత్తి అయిన దేశ సంపదలో 73 శాతాన్ని స్వంతం చేసుకోవడం నరేంద్రమోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తున్నారనడానికి ప్రబల తార్కాణమన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఉత్సవిగ్రహాలుగా మారిపోయారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి రాచరిక పాలనను గుర్తు చేస్తున్నదని కార్యవర్గం అభిప్రాయపడినట్లు చాడ చెప్పారు. చట్టానికి బద్ధులు కావాల్సిన కార్యనిర్వాహకవర్గం ప్రేక్షకపాత్ర వహిస్తున్నదని, మిగులు రాష్ట్రాన్ని అప్పులతో ముంచెత్తుతున్నారని కార్యవర్గం భావించిందని ఆయన తెలిపారు. ఈ దుస్థితుల నుండి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడటానికి లౌకిక ప్రజాస్వామ్య వామపక్షాలు ఐక్య కార్యాచరణకు మరింతగా పూనుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని ఆయన చెప్పారు.

మన తెలంగాణ
3
హైదరాబాద్
గురువారం
25, జనవరి 2018
www.manatelangana.news



## కొత్త పంచాయతీల గడువు పొడిగింపు?

**మన తెలంగాణ** / హైదరాబాద్ : తాండాలతో పాటు కొన్ని గ్రామాలను పంచాయతీలుగా గుర్తించడానికి వివరాలు పంపడానికి ప్రభుత్వం గతంలో విధించిన గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిసింది. పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేసేందుకు బిల్లును రూపొందిస్తున్న ప్రభుత్వం తొలుత ఈ నెల 25వ తేదీకల్లా కొత్త పంచాయతీలకు సంబంధించిన వివరాలను పంచాయతరాజ్ ముఖ్య కార్యదర్శికి పంపాల్సిందిగా అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. చట్ట సవరణకు సంబంధించి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రగతిభవన్‌లో బుధవారం సాయంత్రం పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్‌తో పాటు పలువురు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పంచాయతీల ప్రతిపాదనల గురించి చర్చ జరిగింది. గురువారంకల్లా ఇవి అందుతాయని ఆశించినా, కొన్ని సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 31వ తేదీకల్లా తెప్పించాలని అధికారులకు సిఎం సూచించినట్లు తెలిసింది. అన్ని జిల్లాల్లో గణతంత్ర వేడుకలతో పాటు ఇతర అభివృద్ధి పనుల కారణంగా కొత్త పంచాయతీల వివరాలు పూర్తి స్థాయిలో అందలేదని తెలిసింది. సమగ్ర వివరాలను ఈ నెల 31వ తేదీకల్లా తెప్పించాలని సిఎం స్పష్టం చేసినట్లు తెలిసింది. మరోసారి గడువును పొడిగించే అవకాశం ఉండదని కూడా వారికి స్పష్టం చేసినట్లు తెలిసింది.

## గణతంత్ర వేడుకల్లో గవర్నర్ పావుగంట ప్రసంగం



**మన తెలంగాణ** / హైదరాబాద్ : సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే గణతంత్ర వేడుకల్లో గవర్నర్ పావుగంట సేపు ప్రసంగం చేయనున్నారు. రాష్ట్ర ప్రగతికి సంబంధించిన అనేక విషయాలను శాఖల వారీగా తన ప్రసంగంలో ప్రస్తావించనున్నారు. ఉదయం 8.25 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలు 10.05 గంటలకు ముగుస్తాయి. తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియాకు సంబంధించిన త్రివిధ దళాల అధికారులు ఈ వేడుకలకు హాజరవుతున్నారు. తొమ్మిది గంటలకు ముఖ్యమంత్రి కెసిఆర్ అక్కడకు చేరుకుని 'వీరుల సైనిక్ స్మారక్' స్థూపానికి పుష్పాంజలి ఘటించనున్నారు. సందర్శకుల పుస్తకంలో తన అభిప్రాయాలను లిఖించనున్నారు. ఆ తర్వాత ఆర్మీ పెరేడ్ గ్రౌండ్ దగ్గరకు సిఎంను కమాండెంట్ సహా పలువురు అధికారులు తీసుకునివెళ్తారు. ఉదయం 9.15 గంటలకు అక్కడకు చేరుకున్న గవర్నర్‌కు సిఎం కెసిఆర్ స్వాగతం పలుకుతారు. ఎయిర్ వార్‌ఫేర్ కళాశాలకు చెందిన సైనిక విద్యార్థులతోపాటు త్రివిధ దళాల సైనికుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. జాతీయ గీతాలాపన తర్వాత సైనిక కవాతులను గవర్నర్, సిఎం కెసిఆర్‌లు తిలకిస్తారు. ప్రధాన వేదిక మీద నుంచి గవర్నర్ నరసింహన్ 9.45 గంటలకు తన ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. పావుగంట సేపు ప్రసంగం ఉండేలా కార్యక్రమం తయారైంది. అవార్డు గ్రహీతలకు బహుమతులను ప్రదానం చేస్తారు.

## పిఆర్ ఎఇఇ శ్రీదేవి ఆత్మహత్యపై విచారణ కమిటీ

**మన తెలంగాణ**/హైదరాబాద్: ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీదేవి శ్రీకాంత్ ఆత్మహత్యపై నిజానిజాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం విచారణ కమిటీని నియమించింది. ఈమేరకు ముగ్గురు అధికారులతో కూడిన కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పంచాయతిరాజ్, పిఎంజిఎస్‌వై చీఫ్ ఇంజనీర్ జాన్‌మిల్టన్, వి అండ్ క్యూసి చీఫ్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి, పంచాయతీ రాజ్ ఆదిలాబాద్ ఎస్ఇ ఐ.రమేష్‌లు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. విచారణ అనంతరం ఈ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా బాధ్యులపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుంది.

## 26న హైదరాబాద్‌కు రండి

- **టిఆర్ఎస్ ఎంఎల్ఎలకు ఆదేశాలు**

**మన తెలంగాణ**/ హైదరాబాద్ : గణతంత్రదినోత్సవం సందర్భంగా ఈ నెల 26న పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు తప్పక హైదరాబాద్‌కు రావాలని టిఆర్ఎస్ శాసనసభ్యులకు ఆదేశాలు జారీ అయ్యాయి. తమ జిల్లాల్లో అధికారిక కార్యక్రమాలు ఉన్నా కూడా రాజధానికి రావాల్సిందేనని ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సమాచారం వెళ్ళినట్లు తెలిసింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకల్లో గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించి సందేశం ఇవ్వడం ఆనవాయితీ. ఇటీవల గవర్నర్‌పై విపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఎంఎల్ఏలు హైదరాబాద్‌కు రావాలనే పిలుపునకుప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఈ వేడుకలతో పాటు, గవర్నర్ ఇచ్చే 'ఎట్ హోం' విందుకు హాజరుకావొద్దని భావిస్తుండడం, అదే బాటను మరికొన్ని పార్టీలు కూడా అనుసరించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కార్యక్రమం సజావుగా జరగడంతో పాటు, గవర్నర్ హోదాకు ఏ మాత్రం భంగం కలగలేదనే సంకేతాలు ఇచ్చే ఉద్దేశంతోనే అధికార పార్టీ ఎంఎల్ఏలంతా హైదరాబాద్‌లో జరిగే గణతంత్ర వేడుకలకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అంతే కాకుండా తనపై బహిరంగంగా వస్తున్న విమర్శలపై గవర్నర్ సందేశంలో చూచాయిగా ప్రస్తావన వచ్చే అవకాశం లేకపోలేదని పరిశీలకులు భావిస్తున్నారు.

## యాసంగి 24.71 లక్షల ఎకరాలు



**మన తెలంగాణ**/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా యాసంగిలో 24. 71 లక్షల ఎకరాల్లో 79 శాతం పంటలు సాగయ్యాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. యాసం గి సాధారణ సాగు అంచనా 31.55 లక్షల ఎకరాలుగా ఉంది. ఈ సీజన్‌లో సాధారణంగా వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను రైతు లు అధికంగా సాగు చేస్తారు. పప్పు పంటల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా 30.64 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. వరినాట్లు 15. 91 లక్షల ఎకరాలకు గాను 13.14 లక్షల ఎకరాల్లో వేసారు. ఈసారి అంచనాలను మించి 107 శాతం శనగ పంట 2.52 లక్షల ఎకరాల్లో సాగైంది. 13 జిల్లాల్లో 75 శాతం సాగు మించకపోవడం గమనార్హం. అత్యల్పంగా సిరిసిల్ల జిల్లాలో 31 శాతం మాత్రమే సాగు నమోదైంది.

## తప్పుడు ఎంబి రికార్డుల నమోదులో నిధులు విత్‌డ్రా

**ఇఇ మరో నలుగురిపై క్రమశిక్షణ చర్యలు**

**మనతెలంగాణ** / హైదరాబాద్ : తప్పుడు ఎంబి రికార్డులు తయారు చేసి నిధులు విత్‌డ్రా చేసిన వ్యవహారంలో పూర్వపు ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలకు చెందిన ఐదుగురు పంచాయతి రాజ్ అధికారుల పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మంచిర్యాల పంచాయతిరాజ్ డివిజన్ కార్యాలయం ఒక భవన నిర్మాణానికి సంబంధించి తప్పుడు ఎంబి రికార్డులు నమోదు చేసి 6,36,246 రూపాయలను బ్యాంకు ఖాతా నుంచి విత్ డ్రా చేసుకున్నారు. ఈ అవకతవకలకు అధికారులే కారణమని తేలడంతో అప్పటి మంచిర్యాల పంచాయతి రాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇంచార్జి) ఎండి అమీనొద్దీన్, డిప్యూటి ఇఇ శ్రీనివాసరావు, ఏఇ ఎస్.స్లీవ్‌రాజ్, ఆసిఫాబాద్ డివిజన్ సూపరింటెండెంట్ కె.భాస్కర్, హెచ్‌డి ఎన్.మల్లేషంపై ఆరోపణలు రుజువు కావడంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

### సవరణ

'సీట్ల సంఖ్య పెంపు ఖాయం' శీర్షికతో బుధవారం సంచికలో ప్రచురితమైన వార్తలో 'కొత్తగా వచ్చే అసెంబ్లీ సీట్లతో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఐదు శాసనసభ స్థానాలే ఉంటాయి' అనే వాక్యానికి బదులుగా 'తొమ్మిది శాసనసభ స్థానాలు ఉంటాయి' అని గమనించగలరు.

# వైమానిక రంగానికి కొత్త రెక్కలు




- **రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి**
- **పెట్టుబడులకు తెలంగాణ అనుకూల వాతావరణం : కెటిఆర్**

**మన తెలంగాణ** /హైదరాబాద్ : దేశంలో రానున్న రోజుల్లో విమానయాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కెటి రామారావు అన్నారు. దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొంటున్న మంత్రి బుధవారం రెండో రోజు పలు ప్రముఖ కంపెనీలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశాల్లో ఆయా కంపెనీలను తెలంగాణ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని వివరించారు. ఏయిర్ ఏసియా గ్రూప్ సిఇఓ అంతోనీ ఫెర్నాండెజ్, ఉప కార్యనిర్వహణాధికారి ఏయిరిస్ ఒమర్‌తో సమావేశమై హైదరాబాద్(శంషాబాద్)లోని విమానాశ్రయం అంతర్జాతీయ స్థాయిలో గెల్చుకున్న అవార్డులను, ప్రపంచ గుర్తింపు గురించి వివరించారు. నోవార్టిస్ కంపెనీ పబ్లిక్ పాలసీ హెడ్ పెట్రా లక్స్‌తో సమావేశమై తెలంగాణ 'ఫార్మాసిటీ' గురించి వివరించి ఆ సంస్థ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా కోరారు.

నోవార్టిస్‌కు ఇప్పటికే హైదరాబాద్‌లో ఆర్ అండ్ డి కేంద్రం, డాటా సపోర్ట్, అనాలిటిక్స్ కేంద్రాలు ఉన్నాయని, మరిన్ని కార్యకలాపాల అభివృద్ధికి సిద్ధంగా ఉన్నామని లక్స్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 50 వేల చదరపు అడుగుల ల్యాబొరేటరీని విస్తరింపజేస్తామని, కొత్తగా 150 మంది పరిశోధన సిబ్బందిని నియమించుకోనున్నట్లు తెలిపారు. మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కెన్ కవా యి బృందంతో సమావేశమై పారిశ్రామిక వాడల అభివృద్ధి, వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులు తదితరాలపై వివరించి చిన్న మధ్య తరహా పారిశ్రామిక పార్కును తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. జైకా వంటి ఆర్థిక సంస్థలు నిధులు అందించేందుకు సూత్రప్రాయంగా ఒప్పుకున్నాయని వారికి గుర్తుచేశారు. కువైట్‌కు చెందిన ఫవద్ అల్గానిమ్ కంపెనీ సిఈవో మహ్మద్ అల్గానిమ్‌తో సమావేశమై సౌర విద్యుదుత్పాదనలో సాధిస్తున్న ప్రగతిని వివరించి పెట్టుబడుల అవకాశాలకు విజ్ఞప్తి చేశారు. ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ దుబాయ్ సిఈవో మహమ్మద్ అల్ షయిభానీతో సమావేశమై తెలంగాణలో టెక్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. హ్యూలెట్ ప్యాకర్డ్(హెచ్‌పి ) సంస్థ ఉపాధ్యక్షులు అనా పిన్సుజుక్‌తో సమావేశమై హెచ్‌పి, టి – హబ్‌ల భాగస్వామ్యానికి ఉన్న అవకాశాల ను పరిశీలించాలని, హెచ్‌పి కార్యకలాపాలను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. టి హబ్ సంస్థకు ప్రపంచ గుర్తింపు దక్కడం పట్ల కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు.

## ఆర్‌టిసి ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- **రోడ్డుభద్రత వారోత్సవంలో మహేందర్‌రెడ్డి**




**మన తెలంగాణ**/ హైదరాబాద్: దేశంలో ప్రమాదాలు తగ్గించిన ప్రజా రవాణ వ్యవస్థలకు టిఎస్ఆర్‌టిసి కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలుస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పి.మహేందర్ రెడ్డి అన్నారు. ఇక నుంచి ఆర్‌టిసిలో ప్రయాణం భద్రతకు మారుపేరులా నిలపాలన్నారు. ఆర్‌టిసి కళాభవన్‌లో బుధవారం జరిగిన టిఎస్ఆర్‌టిసి 29వ రోడ్డు భద్రతా వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ ఆర్‌టిసిని ప్రభుత్వం సామాజిక కోణంలో ఆదుకుంటుందని, రాష్ట్రంలోని 97 డిపోలలో 21 డిపోలు నష్టాలను తగ్గిస్తుండడం మంచి పరిణామమన్నారు. ఆర్‌టిసిలో 20 వేల మంది డ్రైవర్ ఉండగా నాలుగోవంతు ప్రమాదాలను నివారించడం అభినందనీయమన్నారు. టిఎస్ఆర్‌టిసి చైర్మన్ సోమారపు సత్యనారాయణ ప్రసంగిస్తూ ఆర్‌టిసిని దేశంలోనే గొప్ప సంస్థగా తీర్చిదిద్దుదామని, కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.రమణారావు మాట్లాడుతూ భద్రతకు, క్రమశిక్షణకు కార్మికులు పునరంకితం కావాలన్నారు. రవాణ శాఖ జెటిసి జి.పాండురంగ నాయక్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ఆర్‌టిసి ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు. ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వహించిన డ్రైవర్లను మహేందర్‌రెడ్డితో పాటు చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఘనంగా సన్మానించారు.

## ప్రాణం మీదికి తెచ్చిన సెల్ఫీ మోజు




**మనతెలంగాణ**/హైదరాబాద్ సిటీబ్యూరో : సెల్ఫీ ఓ యువకుడి ప్రాణాపాయానికి గురిచేసింది. అత్యుత్సాహంతో వెళ్తున్న ఎంఎంటిఎస్ రైలు ముందు నిలిచి సెల్ఫీ తీసు కునేందుకు ప్రయత్నించడం అతనిని ఆసుపత్రిపాల్జేసింది. భరత్‌నగర్ రైల్వేట్రాక్ వద్ద నిలుచుని సెల్ఫీ తీసుకుంటుండగా రైలు వెనుక నుండి వచ్చి ఢీకొట్టిన సంఘటన ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. గత మూడు రోజుల క్రితం జరిగిన ఈ ప్రమాదం సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై స్పందించిన రైల్వే ఎస్‌పి అశోక్ స్పందించారు. సెల్ఫీ ట్రైన్ ఘటన మూడురోజుల క్రితం భరత్‌నగర్ రైల్వేట్రాక్‌పై జరిగిందని, బాధితుడు శివ తలకు, చేతికి బలంగా గాయాలైనట్లు తెలిపారు. ప్రస్తుతం క్షతగాత్రుడు లింగంపల్లి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నట్టు ఎస్‌పీ వివరించారు.

# మూడు ప్రెస్‌లలో పాస్‌బుక్‌ల ముద్రణ!

- **నెలరోజుల్లో 72లక్షల పాస్ పుస్తకాలు ప్రింటింగ్**




**మన తెలంగాణ**/హైదరాబాద్ : రైతులందరికీ పట్టాదారు పాస్‌బుక్‌లను మార్చి11వతేదీనే పంపిణీ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం మూడు ముద్రణా సంస్థల కు టెండర్ ఇవ్వడంపై ఆలోచిస్తోంది. టెండర్ పరిశీలనా కమిటీ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. వారం రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. ఒకే సంస్థకు కాంట్రాక్టు ఇచ్చినట్లయితే నెల రోజుల్లో 72 లక్షల పాస్‌బుక్‌లను ముద్రించలేకపోతే ఆశించిన లక్ష్యం నెరవేరదన్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తోంది. కాంట్రాక్టు కోసం టెండర్ దాఖ లు చేసిన సంస్థల్లో తొలి మూడు సంస్థలకూ ప్రింటింగ్ బాధ్యతలు అప్పజెప్పే విధంగా టెండర్ డాక్యుమెంట్‌లోనే స్పష్టత ఇవ్వాలని భావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ ఆ డాక్యుమెంట్‌ను తయారుచేస్తోంది. తొలి సంస్థకు 60%, ఆ తర్వాతి రెండు సంస్థలకు 20% చొప్పున ముద్రణా బాధ్యతలు ఇవ్వాలనుకుంటోంది. తొలి సంస్థ పేర్కొన్న ధరకే మిగిలిన రెండు సంస్థలూ ముద్రించాలన్న షరతును కూడా ఆ డాక్యుమెంట్‌లో స్పష్టం చేయనుంది. ప్రభుత్వం కోరుకుంటున్న భద్రతా ఫీచర్లను ముద్రించే సామర్థ్యం టెండర్ దాఖలు చేసిన ప్రింటింగ్ ప్రెస్‌లకు ఏ మేరకు ఉందో హైదరాబాద్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లలోని భద్రతా ఫీచర్ల పర్యవేక్షణకు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఉన్నతాధికారిని ప్రభుత్వం 'సాంకేతిక సలహాదారు'గా వినియోగించుకోనుంది. ఒకవేళ తక్కువ ధరతో అర్హత పొందిన సంస్థే మొత్తం 72 లక్షల పాస్‌బుక్‌లనూ నిర్దిష్ట సమయానికల్లా ముద్రించే సామర్థ్యం ఉన్నట్లయితే దానికి తగిన విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. టెండర్ ఖరారు కావడానికి ముందే తక్కువ ధర పేర్కొన్న సంస్థ ఎంత సంఖ్యలో పాస్‌బుక్‌లను ముద్రించే సామర్థ్యం ఉందో తెలియదు కాబట్టే తర్వాతి స్థానాల్లో ఉన్న రెండు సంస్థలకు కూడా అవకాశం ఉండే విధంగా డాక్యుమెంట్‌లో స్పష్టత ఇవ్వాల్సి వస్తోందని రెవిన్యూ శాఖలోని ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. టెండర్ పోటీలో పాల్గొన్న సంస్థలకు ఉన్న యంత్ర పరిజ్ఞానం, సామర్థ్యం, మానవ వనరులు, అధునాతన సౌకర్యాలు.. ఇలా అన్ని కోణాల నుంచి ఆలోచించిన తర్వాతనే స్పష్టమైన నిర్ణయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెలాఖరుకల్లా టెండర్ ఖరారవుతుందని, ఫిబ్రవరి చివరికల్లా మొత్తం పాస్‌బుక్‌ల ముద్రణ ముగుస్తుందని, మార్చి తొలి వారంకల్లా నేరుగా ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచే అన్ని జిల్లా కేంద్రాలకు పాస్‌బుక్‌లు చేరుతాయని, ఆ తర్వాత మండలం మొదలు గ్రామం వరకు చేరుకుంటాయని వివరించారు. పాస్‌బుక్ కవర్ పేజీకి కోసం రెండు డిజైన్లను టిఎస్‌టిఎస్ విభాగం ఖరారు చేసింది. లేత పింక్ కలర్ లేదా మెరూన్ రంగు కవర్ పేజీపై బంగారంరంగులో ఉండే అక్షరాలను ముద్రించాలని భావిస్తోంది. ఈ నెలాఖరుకు దీనిపై స్పష్టత వస్తుంది.

### 'ధరణి' వెబ్‌సైట్‌కు 600 మంది నిపుణులు

భూ రికార్డుల ప్రక్షాళన ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం ఇకపైన భూ లావాదేవీలన్నింటినీ డిజిటల్‌లో నిక్షిప్తం చేయడానికి 'ధరణి' పేరుతో ఒక వెబ్‌సైట్‌ను రూపొందించనున్నట్లు స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ వెబ్‌సైట్ రూపకల్పనపై టిఎస్‌టిఎస్ ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఎప్పటికప్పుడు జరిగే భూములకు సంబంధించిన మార్పులు చేర్పులను ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించేందుకు ఈ వెబ్‌సైట్ నిర్వహణ కోసం ప్రభుత్వం 600 మంది ఐటి (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) నిపుణులను, వెబ్‌సైట్ నిర్వాహకుల సేవలను వినియోగించుకోవాలనుకుంటోంది. ఎప్పటికీ వీరి సేవలు కొనసాగుతాయని, తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలతో ఈ వెబ్‌సైట్ అనుసంధానించబడుతుందని అధికారుల సమాచారం.

## రైతు చెక్కులపై పాస్‌బుక్ యూనిక్ నెంబర్!

**మన తెలంగాణ** / హైదరాబాద్ : 'పెట్టుబడి పథకం' కింద రైతులకు పంపిణీ చేసే చెక్కులపై సదరు రైతు పేరుతో పాటు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌పై ఉండే 13 అంకెల 'యూనిక్ కోడ్' నెంబర్‌ను కూడా ముద్రించాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాసంగి పంటకు రాష్ట్రంలోని సుమారు 72 లక్షల మంది రైతులకు ఈ చెక్కులను పంపిణీ చేస్తున్నందువల్ల సుమారు రూ. 5800 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నందువల్ల ఈ నిధులు దుర్వినియోగం కాకుండా నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం కలిగేందుకు ప్రభుత్వం పకడ్బందీ విధానాలను రూపొందిస్తోంది. తొలుత చెక్కుపై రైతుల ఆధార్ నెంబర్‌ను ముద్రించాలని భావించినా కొత్త పట్టాదారు పాస్‌బుక్ అనేక భద్రతా ప్రమాణాలతో రూపొందుతున్నందువల్ల దానిపైఉండే 13 అంకెల యూనిక్ కోడ్ నెంబర్‌ను ముద్రించడమే శ్రేయస్కరమని ప్రభుత్వం భావించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ ఈ చెక్కులను ముద్రిస్తున్నందువల్ల లబ్ధిదారుని పేరుతో పాటు యూనిక్ కోడ్‌ను ముద్రించడం కోసం పూర్తి డాటాను రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రింటింగ్ ప్రెస్‌కు సమకూరుస్తుంది. ఇదే డాటాను అన్ని బ్యాంకులకు కూడా ఇస్తోంది. పాస్‌బుక్‌లన్నీ ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైనందువల్ల బ్యాంకుల్లో ఈ చెక్కులను డిపాజిట్ చేసిన తర్వాత నిజమైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోకే వెళ్తాయని ప్రభుత్వం అభిప్రాయపడింది.

### సృజన కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో

**మన తెలంగాణ**/ హైదరాబాద్:ఎల్.బి.స్టేడియంలో గత సెప్టెంబర్‌లో నిర్వహించిన మహా బతుకమ్మ కార్యక్రమానికి వచ్చి ప్రమాదవశాత్తు మరణించిన సూర్యాపేట జిల్లా నూతన్ కల్ కు చెందిన గుండ్లపల్లి సృజన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియాను, తెలంగాణ జాగృతి తరపున మరో రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. ఈ రూ.10 లక్షల మొత్తాన్ని సృజన కుమార్తె, కుమారుని పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తామని సాంస్క తిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జాగృతి ఉపాధ్యక్షులు రాజీవ్ సాగర్ లు తెలిపారు. ఎంపి కవిత, ప్రభుత్వానికి సృజన తండ్రి మరియు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# పెరిగిన జంతువుల సంఖ్య

**తెలంగాణలో మెరుగైన జంతువుల సంచారం**

**ఆటవీశాఖ అధికారుల సర్వేలో వెల్లడైన అంశాలు**







**మన తెలంగాణ** / హైదరాబాద్ : తెలంగాణలో అటవీ జంతువుల సంచారం మెరుగైనట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. వన్య మృగాలు, మాంసాహార జంతువులు అధికంగా నమోదైనట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే తెలంగాణలో వీటి సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు. జాతీయ జంతు గణనలో భాగంగా మూడు రోజులుగా రాష్ట్రంలో పులులు, ఇతర వన్యప్రాణుల గణన జరుగుతోంది. ఈ గణన అటవీశాఖలో ఆనందాన్ని నింపింది. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో జరిపిన సర్వేతో పోలిస్తే ప్రస్తుతం తెలంగాణలో జంతువుల సంచారం మెరుగైందన్నారు. మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు బీట్లలో పులి, చిరుత, ఎలుగుబంటి, నక్కలు, రేసు కుక్కలు తదితర వన్యప్రాణుల ఆనవాళ్లను పెద్ద సంఖ్యలో గుర్తించినట్లు చెప్పారు. శాస్త్రీయ పద్ధతిలో జంతువుల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని, జంతువుల కాలి గుర్తులు, విసర్జితాలు, కళేబరాలు, చెట్లపై కాలిగోర్ల గుర్తుల ఆధారంగా ఏఏ జంతువులు, ఏఏ ప్రాంతాల్లో సంచారిస్తున్నాయో వివరాలు లభ్యమైనట్లు చెప్పారు. పులుల సంరక్షణ ప్రాంతాలైన కవ్వాల్, అమ్రాబాద్‌లో జంతువుల ఆనవాళ్లు ఆశించిన స్థాయిలో ఉన్నట్లు అక్కడి ఫీల్డ్ డైరెక్టర్లు తెలిపారు. ఆయా అభయారణ్యాల్లో పులుల పాదాల గుర్తులతో పాటు వాటి అవాసంగా ఉన్న ప్రాంతాలను కూడా గుర్తించినట్లు చెప్పారు. కాగజ్‌నగర్ ఆటవీ ప్రాంతంలో బెజ్జూర్, పెంచికల్ పేట, పోతపల్లి, బొంబాయిగూడ బీట్లలో పులి గుర్తులను, సిర్పూర్‌రేంజ్‌లో చిరుత అడుగులను గుర్తించినట్లు చెప్పారు. ఇదే ప్రాంతంలోని ఏడు బీట్లలో ఎలుగుబంటి ఆనవాళ్లను కూడా గుర్తించారు. కదంబ ఆటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్ వెళ్తున్న మార్గంలో పులి కనిపించినట్లు చెప్పారు. భూపాలపల్లి అటవీ ప్రాంతంలో చిరుతపులి, అడవి దున్నల సంచారాన్ని గుర్తించారు. మొత్తం 14 బీట్లలో చిరుతల సంచారం ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. ఈ నెల 22న సర్వేను ప్రారంభించారు. ఆటవీశాఖ మంత్రి జోగు రామన్న స్వయంగా సర్వేలో పాల్గొన్నారని అధికారులు తెలిపారు. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోని కోలంగూడ రేంజ్‌లో సుమారు ఆరు కిలోమీటర్ల ఆటవీ ప్రాంతంలో పర్యటించి జంతుల ఆనవాళ్లను గుర్తించారు. సర్వేను తీరును ఆయా జిల్లాల్లో కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొందరు కలెక్టర్లు స్వయంగా సర్వేలో పాల్గొంటున్నారన్నారు. ఈ నెల 29 వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. మరో మూడు రోజుల పాటు జరిగే సర్వేలో ఆయా ఆటవీ ప్రాంతాల్లో ఉన్న వృక్ష, మొక్కల జాతుల గుర్తింపుతో పాటు అడవుల్లో మనుషులు, పెంపుడు జంతువుల సంచారాన్ని కూడా గుర్తించనున్నట్లు అధికారులు వివరించారు.



"ప్రజలు తిడుతున్నారా, పొగుడుతున్నారా అన్నది ముఖ్యం కాదు. నీ గురించి చర్చిస్తున్నారా లేదా అన్నదే ముఖ్యం.
– చర్చిల్"

# యుద్ధోన్మాద జాతీయతకు ధిక్కారం!


చూపు

జనవరి 14 నుంచి 19 దాకా ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ భారత్‌లో పర్యటించారు. ఇజ్రాయిల్‌తో మనం పూర్తిస్థాయి దౌత్య సంబంధాలు నెలకొల్పుకున్న సరిగ్గా 25 సంవత్సరాల తర్వాత నెతన్యాహూ మన దేశంలో పర్యటించారు. ఇజ్రాయిల్‌తో మనం దౌత్య సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఓ నేపథ్యం ఉంది. అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య సుదీర్ఘకాలం పాటు కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధంలో అమెరికా సోవియట్‌పై విజయం సాధించిన సందర్భంలోనే మనం ఇజ్రాయిల్‌తో స్నేహం కుదుర్చుకున్నాం. 2017 జులై నాలుగు నుంచి ఆరు దాకా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయిల్ సందర్శించారు. దీనికీ ఓ సందర్భం ఉంది. సరిగ్గా వంద సంవత్సరాల కిందట 1917లో బ్రిటిష్ వారు పాలస్తీనా ప్రాంతాన్ని ఆక్రమించి యూదులకు ఆవాసం కల్పిస్తామని హామీ ఇస్తూ బల్ఫోర్ ప్రకటన చేసి వందేళ్లు అయిన సందర్భంగా మోదీ ఇజ్రాయిల్‌లో పర్యటించారు. యూదు మతస్థుల జాతీయవాద పోరాటం జరుగుతున్నప్పుడు పాలస్తీనాలో యూదులకోసం ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేస్తామని వందేళ్ల కింద బ్రిటిష్ సామ్రాజ్యవాదులు హామీ ఇచ్చారు. యూదుల జాతీయోద్యమం దురభిమానంతో కూడుకున్నది. వారి జాతీయోద్యమ పోరాటాన్ని యూదుల దురభిమానంగా వ్యవహరిస్తారు. 1948 మే 14న యూదు యుద్ధోన్మాదులు తమకో స్వతంత్ర దేశం ఏర్పడిందని చెప్పి సరిగ్గా 70 ఏళ్లయింది. వలసవాదుల దుష్కృత్యాలకు సంబంధించిన చేదు జ్ఞాపకాలు అప్పుడు ఎక్కువగా ఉండేవి. భూగోళం మీద అస్తిత్వమే లేని ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేయడాన్నీ, పాలస్తీనా వారిమీద పాల్పడిన అఘాయిత్యాలను నెహ్రూ హయాంలో మన దేశం తీవ్రంగా ఖండించింది. పలస్తీనియన్లను వారి సొంత ప్రాంతం నుంచి పారదోలి అక్కడ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కృత్రిమంగా ఇజ్రాయిల్‌ను సృష్టించారు.

యూదుల దురభిమానాన్ని, యుద్ధోన్మాదాన్ని విస్మరించడానికి వీలులేదు. దానికి వలసవాదుల దన్ను ఉండేది. ఈ దురభిమానులకు, వారిని వెనకేసుకొచ్చిన వారికి జాత్యహంకారం మెండు. అరబ్బులైన పలస్తీనియన్ల మానవ హక్కులను సంపూర్ణంగా అణచివేసి యూదు యుద్ధోన్మాదులు, వలసవాదులు కలిసి పలస్తీనా ప్రజలను నిరాశ్రయులను చేశారు.

యూదుల యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించడం అంటే యూదు మతాన్ని, ఆ మతస్థులను వ్యతిరేకించడం కాదు. ప్రపంచంలోని యూదులందరి తరఫున పోరాడుతున్నామని చెప్పుకునే యూదుదురభిమాన నాయకత్వం నిజానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూదులందరికీ బద్ధ శత్రువు. యుద్ధోన్మాదులైన యూదు నాయకులు పలస్తీనాను ఆక్రమించారు. పలస్తీనా వారిని సమాన స్థాయిలో చూడడానికి యూదు దురభిమానులు ససేమిరా అంగీకరించరు. ఇజ్రాయిల్ విష కౌగిలి నుంచి విముక్తం కావడం కోసం పలస్తీనా ప్రజలు వీరోచిత పోరాటం చేశారు. అది సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భాగమే. సామ్రాజ్యవాదులతో అంటకాగుతున్న అరబ్ ప్రపంచంలోని ప్రభుత్వాలకు వ్యతిరేక పోరాటమే. ఆ తర్వాత అమెరికా ఇజ్రాయిల్‌కు వత్తాసు పలుకుతోంది. 1948, 1967, 1973లో జరిగిన మూడు యుద్ధాల ఆసరాగా ఇజ్రాయిల్ జోర్డాన్ నదికి పశ్చిమం వేపున ఉన్న పలస్తీనా భూభాగాన్నంతటినీ ఆక్రమించింది. పలస్తీనా వారు తమ ప్రాంతాల్లోకి వెళ్లకుండా ఇజ్రాయిల్ అడ్డగిస్తోంది. వారిని బానిసలుగా చూస్తోంది. కిరాతకంగా వ్యవహరిస్తోంది.

నెహ్రూ విధానాలను అటకెక్కించిన నాయకులు ఇప్పుడు తమ అసలు రంగు బయట పెడుతున్నారు. యూదుల దురభిమానం కూడా జాతి వివక్ష లాంటిదేనని మనం గతంలో భావించే వాళ్లం. కాని 1991లో అమెరికా ఐక్యరాజ్యసమితిలో మన వాదనకు భిన్నమైన తీర్మానం ప్రతిపాదిస్తే 1991లో మన నాయకులు సమర్థించారు. గత పాతిక సంవత్సరాలుగా ఇజ్రాయిల్‌తో మన సంబంధాలు ప్రధానంగా సైనిక సంబంధమైనవే. ఇజ్రాయిల్ నుంచి ఆయుధాలు దిగుమతి చేసుకుంటున్నాం.




మన దేశంలో ఆంతరంగిక భద్రతను పరిరక్షించడానికి కూడా ఇజ్రాయిల్ నుంచి సలహాలు తీసుకుంటున్నాం. తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికీ, గూఢచార కార్యకలాపాలలోనూ ఇజ్రాయిల్ సలహాలు పాటిస్తున్నాం. ఇప్పుడు ఇజ్రాయిల్ నుంచి భారీగా ఆయుధాలు, యుద్ధ సామాగ్రి దిగుమతి చేసుకుంటున్నాం. కశ్మీర్‌లో తీవ్రవాదులను ఎదుర్కోవడానికి ఇజ్రాయిల్ అనుసరిస్తున్న తీవ్రవాద వ్యతిరేక ఎత్తుగడలను, వ్యూహాలనే మనమూ అనుసరిస్తున్నాం. గూఢచార సమాచారం సేకరించడానికి కూడా పలస్తీనియన్ల విషయంలో ఇజ్రాయిల్ గూఢచార సంస్థ మొసాద్ బాటలోనే నడుస్తున్నాం.

ఇటీవల ఇజ్రాయిల్ ప్రధాని పర్యటన సందర్భంగా రక్షణ ఒప్పందాలు ఏమీ కుదరలేదు కాని ఆ దేశం నుంచి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడుల కోసం ప్రయత్నించాం. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా రక్షణ శాఖకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం బదిలీ చేయాలని అడిగాం. మన దేశంలో డి.ఆర్.డి.ఓ.లో తయారవుతున్న శతఘ్నులను ధ్వంసం చేసే క్షిపణులకోసం వేచి చూడకుండా ఇజ్రాయిల్ నుంచి స్త్రీక్ క్షిపణులు దిగుమతి చేసుకోవడానికి తాపత్రయపడుతున్నాం. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఒప్పందం తొందరలోనే కుదరవచ్చు. మధ్యతరహా, నేలమీంచి నేల మీదకు ప్రయోగించే క్షిపణులను అభివృద్ధి చేయడానికి ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న హిందుత్వవాద నాయకులు ప్రయత్నిస్తున్నారు. గత సంవత్సరం ఇజ్రాయిల్‌తో కలిసి వైమానిక విన్యాసాల్లో పాల్గొన్నాం. ఇప్పుడు హిందుత్వవాద నాయకులు తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో ఇజ్రాయిల్‌ను అనుసరిస్తున్నారు. హిందుత్వవాదులు ఇజ్రాయిల్ యుద్ధోన్మాద జాతీయవాదాన్ని చూసి మురిసిపోతుంటారు. అందుకే తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల్లో సమగ్ర సహకారం కోసం వెంపర్లాడుతున్నారు.

ఇజ్రాయిలీ యుద్ధోన్మాదులు పలస్తీనియన్ల విషయంలో ఎలా వ్యవహరించారో కశ్మీరీ తీవ్రవాదులకు సంబంధించి అలాగే ఉండాలనుకుంటున్నారా? యూదుమతానికి యుద్ధోన్మాద యూదుతత్వానికి తేడా ఉన్నట్టే హిందూమతానికి హిందూ మతోన్మాదానికి తేడా ఉంది. హిందూమతం మోక్షమార్గం కోసం అనుసరించే విశ్వాసాల సమాహారం. హిందుత్వం ఫాసిస్టు సిద్ధాంతం. అది నాజీయిజం లాంటిదే. యూదు యుద్ధోన్మాదం యూదుమతం కాదు. అది యూదు మతానికి విరుద్ధమైంది. అలాగే హిందుత్వ హిందూమతానికి విరుద్ధమైందే. యూదులు తమకు యుద్ధోన్మాద యూదులతో సంబంధం లేదని బహిరంగంగా ప్రకటించడం ఎంత అవసరమో హిందువులు కూడా తమకు హిందుత్వతో సంబంధం లేదని బాహాటంగా చెప్పవలసిన అగత్యం ఉంది. ఈ పోరాటంలో హిందువులు, యూదులు, ముస్లింలు అందరూ మానవతావాద దృష్టితో పలస్తీన ప్రజలకు, కశ్మీర్ ప్రజలకు బాసటగా నిలబడాలి. యూదుల వ్యతిరేకతను, ముస్లిం వ్యతిరేకతను విడనాడాలి.

*(ఇ.పి.డబ్ల్యు. సౌజన్యంతో)*

ఎడిటర్‌కు లేఖ

## దూరవిద్యలో అడ్డదారి పట్టాలకు చెల్లు చీటీ!

దూరవిద్య విధానం ద్వారా ఇంజినీరింగ్ వంటి సాంకేతిక కోర్సులు అందించరాదని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా తీర్పు ఇచ్చింది. దేశం లోని 4 విశ్వ విద్యాలయాలు దూరవిద్య ద్వారా అందించిన పట్టాలను కోర్టు రద్దు చేసింది. రాజస్థాన్‌లోని రాజస్థాన్ విద్యాపీఠ్, తమిళనాడు లోని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్ సంస్థలు 2001 నుంచి ఇచ్చిన పట్టాలు దీంతో విలువ లేని విగా మారిపోయాయి. వాటిని వెనక్కు తీసుకొని, సంబంధిత అభ్యర్థులకు ఇచ్చిన పదోన్న తులను ఉపసంహరించుకోవాలని సుప్రీం స్పష్టీకరించింది. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వేల మంది విద్యార్థులు ఆయా సంస్థల్లో ఇంజినీరింగు తో పాటు పలురకాల కోర్సులు చదివారు. వాటి ఆధారంగా వందల మందికి ఉద్యోగా లిచ్చారు, వేలమందికి పదోన్నతులు కల్పించారు. ఆయా సంస్థలను నిషేధిత జాబితాలో పెట్టాలని గతం లోనే టాండన్ కమిటీ నివేదించినా పట్టించు కోలేదు. కేంద్రప్రభుత్వం 1994లో వెలువరించిన ఉత్త ర్వులు ప్రస్తుత సమస్యకు కారణమయ్యాయి. సుప్రీంకోర్టు సరికొత్త తీర్పువల్ల అభ్యర్థులు మళ్ళీ పరీక్షకు నిలబడాల్సిన అసాధారణ పరిస్థితి తలెత్తింది. యుజిసి చట్టం సెక్షన్23 ప్రకారం ఇక పై ఆయా సంస్థలు పేరును వాడ కూడదు. ఈ పరిణామాల వల్ల కేంద్రప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వు 386తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు శాఖలు ఇచ్చిన జీఓలనూ రద్దు చేయాల్సి ఉంటుంది. రోజు వారీ తరగతు లకు హాజరు కాకుండా వివిధ కోర్సుల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి దూరవిద్య విధానం చక్కటి మార్గం.

ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం, డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వంటి సంస్థలు ఈ రంగంలో విశేష సేవలు అందిస్తున్నాయి. ఇతర విశ్వ విద్యాలయాలూ దూరవిద్య విభాగాలను ఏర్పాటు చేశాయి. కీలకమైన దూరవిద్య వంటి విభాగాలపై ప్రభుత్వ స్థాయిలో నియంత్రణ తక్కువగా ఉంది. వేల మందికి ఉన్నత విద్యను, ఉద్యోగాలు, పదోన్నతులను కల్పించే ఇలాంటి సంస్థల పనితీరుపై ప్రభుత్వ నిఘా పెరగాలి. పౌర సమాజమూ అక్రమాలపై ఓ కన్నేసి ఉంచాలి. అప్పుడే వివాదాలకు అతీతంగా దూర విద్య వన్నె లీనుతుంది.

–శ్రీనివాస్ చిరిపోతుల,
9603471199

# శీల పరీక్షల అంధయుగం



వాహెద్
7093788843

కంజరభట్ కులానికి చెందిన నలభైమంది మూకుమ్మడిగా చేసిన దాడిలో అదే కులానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ సంఘటన జనవరి 21వ తేదీన జరిగింది. ఎందుకు వారిపై దాడి చేశారంటే, ఆ ముగ్గురు కులాచారం ప్రకారం, వివాహ సందర్భంగా వధువు శీలపరీక్షలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందువల్ల. పూనాలోని పింప్రి ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ప్రశాంత్ ఇంద్రేకర్, సౌరభ్ మాఛ్లే, ప్రశాంత్ తమ్చీకర్ ఈ దాడిలో గాయపడ్డారు.

దాడికి గురైన ముగ్గురు యువకులు చేసిన తప్పేమిటి? సమాజంలో మహిళల గౌరవ మర్యాదలను కాపాడ్డానికి ప్రయత్నించడమే వారి తప్పయ్యింది. శీలపరీక్షల అనాగరిక, ఆటవిక ఆచారాలను వ్యతిరేకిస్తూ ఈ ముగ్గురు ఉద్యమిస్తున్నారు. వాట్సప్ గ్రూప్ ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. శీలపరీక్షలను వ్యతిరేకించే వారిపై దాడి జరగడం ఇదే మొదటిసారి కాదు, నవంబరులో కూడా ఈ వాట్సప్ గ్రూప్‌కు చెందిన సిద్ధాంత్ ఇంద్రేకర్ శీలపరీక్షను వ్యతిరేకిస్తూ అవసరమైన ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శీలపరీక్ష నిర్వహించిన పంచాయతీ పెద్దలు వివాహాన్ని ఆమోదించడానికి 10వేల రూపాయలు తీసుకున్న సంఘటన మొత్తం రికార్డు చేసి పోలీసులకు ఇచ్చాడు. కాని పోలీసులు ఎలాంటి చర్య తీసుకోలేదు.

కంజర్ భట్ సముదాయంలో వివాహ సమయంలో వధువు శీలపరీక్ష చేయడం ఆచారం. కొత్తగా పెళ్ళయిన దంపతులను ఒక హోటలు రూముకు తీసుకెళతారు. వరుడికి ఒక తెల్లని దుప్పటి ఇస్తారు. సంభోగసమయంలో ఆ దుప్పటి వాడాలని చెబుతారు. కులపంచాయతీ సభ్యులు ఆ హోటలు రూము బయటనే వేచి ఉంటారని కూడా తెలుస్తోంది. వరుడు రక్తపు మరకలున్న దుప్పటితో బయటకు వచ్చి వారికి చూపిస్తే వధువు పరీక్షలో పాసయినట్లే. రక్తపు మరకలు లేకపోతే ఆ అమ్మాయి జీవితం నరకమవుతుంది. అంతకు ముందే మరో పురుషుడితో సంబంధం పెట్టుకుందని తీర్మానించేస్తారు. భర్త, అత్తమామలు అందరూ కలిసి చావగొట్టడం జరగొచ్చు. కుటుంబం ఆమెను వదిలేయవచ్చు. ఎలాంటి శిక్షలు అనుభవించవలసి వస్తుందో చెప్పలేము.

గత సంవత్సరం జూన్‌లో మహారాష్ట్ర అహ్మద్ నగర్ కు చెందిన ఒక వధువు శీలపరీక్షలో విఫలమైన తర్వాత భర్త వదిలేశాడు. తల్లిదండ్రులు కూడా ఒక గదిలో ఒంటరిగా బతికే శిక్ష విధించారు. అత్తమామలు ఆమె బంగారు ఆభరణాలను కూడా లాక్కుని వెళ్ళిపోయారు. వధూవరులు కలిసి ఉండాలంటే, ఆ పెళ్ళిని కులపెద్దలు ఆమోదించాలంటే వారు విధించిన జరిమానా చెల్లించాలి.

అత్యంత అనాగరికమైన, ఈ ఆచారాలు ఇంకా దేశంలో కొనసాగడం సిగ్గుచేటు. వరుడికి తెల్ల దుప్పటి ఇచ్చి వధువు శీలాన్ని నిరూపించమని చెప్పడమే కాదు, పంచాయతీలో వరుడిని ఆ విషయమై ప్రశ్నించడం కూడా జరుగుతుంది. వధువు బాగుందా అని అడిగితే వరుడు మూడు సార్లు ''మాల్ ఖరా''(నాణ్యమైన సొత్తు)అని చెబితేనే ఆమెకు విముక్తి. శీలపరీక్షలో వధువు విఫలమైతే వధువుతో పాటు వరుడికి కూడా జరిమానా పడుతుంది. అలాంటి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నందుకు. జరిమాన చెల్లించకపోతే కులం నుంచి బహిష్కరిస్తారు. శీలపరీక్ష విషయంలో ఎవరైనా వ్యతిరేకిస్తే వారిని కూడా కులం నుంచి బహిష్కరిస్తారు. అలా బహిష్కరణకు గురైన కృష్ణ ఇంద్రేకర్, అరుణ ఇంద్రేకర్ కథ కూడా ఇలాంటిదే. అరుణ ఇంద్రేకర్ ను 1996లో పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు చదువుకున్నవారు. రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. శీలపరీక్షలో పాల్గొనేది లేదని ఖండితంగా చెప్పేశారు. అప్పటి నుంచి నేటి వరకు వారిని వెంటాడడం జరుగుతూనే ఉంది.

పెళ్ళయిన తర్వాత వారిద్దరు ఊరికి వెళ్ళి పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలనుకున్నారు. కాని కర్నాటక, గుజరాత్, మహారాష్ట్రలకు చెందిన కంజర భట్ కులపెద్దలు అక్కడికి వచ్చి శీలపరీక్షను నిరాకరించినందుకు రెండు కుటుంబాలకు యాభైవేల చొప్పున జరిమానా వేశారు. పెళ్ళి చేసుకున్న ఇద్దరిని కులం నుంచి బహిష్కరించారు. అప్పటి నుంచి ఇంద్రేకర్ దంపతులు ఈ శీలపరీక్షకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం మలచడానికి, చైతన్యం సృష్టించడానికి ప్రయత్నిస్తూ వస్తున్నారు. వారి ప్రయత్నాల వల్ల కొందరు యువకులు కూడా కలిశారు.

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విద్యార్థి వివేక్ తమైచేకర్ ఒక వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసాడు. ఈ పోరాటంలో భాగంగానే సిద్ధాంత్ ఇంద్రేకర్ గత నవంబరు నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సిద్ధాంత్ ఇంద్రేకర్ బంధువు పెళ్ళి సందర్భంగా శీలపరీక్షను గట్టిగా వ్యతిరేకించడమే కాదు, అలా చేస్తే ఫోనులో రికార్డు చేసి పోలీసులకు ఇస్తానన్నాడు. అతను చెప్పినట్లే అవసరమైన ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహారాష్ట్రలోని ప్రొటెక్షన్ ఆఫ్ పీపుల్ ఫ్రం సోషల్ బాయ్‌కాట్ చట్టం క్రింద కేసు నమోదు చేయవలసిన పోలీసులు ఆ తర్వాత సరయిన ఆధారాలు లేవని చెప్పారు.

మహారాష్ట్ర అంధ శ్రద్ధా నిర్మూలన సమితి అధ్యక్షుడు నందిని జాదవ్ తో కలిసి సిద్ధాంత్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీసును కలుసుకుని మాట్లాడారు. శీలపరీక్షలు ఆపాలని కోరుతున్న 33మంది సంతకాలు చేసిన మెమొరాండం కూడా ఇచ్చారు. ఆ తర్వాత కులపెద్దల సమావేశం జరిగింది. జరిమానాలు వేసి డబ్బు తీసుకుంటున్నట్లు, ఆ డబ్బును వివిధ పండగలకు వాడుతున్నట్లు ఒప్పుకున్నారు. విచిత్రమేమంటే, అనేకమంది ఆడవాళ్ళు స్వయంగా ఈ శీలపరీక్షలను సమర్థించడం. ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు.

కులపంచాయతులు మహిళలను ఎంత దారుణం గా అవమానిస్తున్నాయో అనేక సంఘటనల ద్వారా రుజువవుతోంది. నాసిక్ జిల్లాలో 2016లో కంజర్ భట్ కులపంచాయతి పెద్దలు ఒక మహిళను అర్థనగ్నంగా ఊరేగించారు. 29 సంవత్సరాల ఆ మహిళ భర్త చనిపోయాడు. ఆ తర్వాత ఆమె మరిది ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. గత సంవత్సర కాలంగా ఆమెను అత్తమామలు తీవ్ర శారీరక హింసకు గురిచేసినట్లు కూడా ఆమె తెలిపింది. ఆమె పోలీసుల వద్దకు వెళితే కులపంచాయతిలోనే తేల్చుకోమని చెప్పారట. ఆమెను పంచాయతి పెద్దలు అర్థనగ్నంగా చేసి, కర్రలతో కొడుతూ ఊరంతా తిప్పారని, తన శీలానికి పరీక్షగా తన 12 సంవత్సరాల కొడుకు చేతిలో మంటల్లో కాల్చిన గొడ్డలి పెట్టారని ఫిర్యాదు చేసింది. అంతేకాదు యాభైవేల రూపాయలు జరిమానా చెల్లించాలని కూడా ఈ పంచాయతీ పెద్దలు తీర్పు చెప్పారట. ఈ సంఘటన తర్వాత పోలీసులు కేసు నమోదు చేశామని చెప్పా రు.

ఇప్పుడు ముగ్గురు యువకులపై దాడి జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. దాడి చేసిన 40 మందిలో సన్నీ మలకె కూడా ఒకడు. ఇతడి సోదరి పెళ్ళి జరగవలసి ఉంది. ఆ పెళ్ళికి శీలపరీక్షలను వ్యతిరేకిస్తున్న ప్రశాంత్ ఇంద్రేకర్, సౌరభ్ మాఛ్లే, ప్రశాంత్ తమ్చీకర్‌లను కూడా పిలిచారు. పెళ్ళి తర్వాత కులపంచాయతి కూర్చుని శీలపరీక్ష గురించి మాట్లాడ్డం ప్రారంభించింది. ఆ సందర్భంగా శీలపరీక్షను వ్యతిరేకిస్తున్న ఈ ముగ్గురు యువకులపై కులపెద్దలు తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ నిందించడం ప్రారంభించారు. దాంతో రెచ్చిపోయిన అక్కడి జనం ఈ ముగ్గురిని చావబాదారు. దాడి చేసిన వారిలో ఒకడు తన స్వంత చెల్లెలి శీలపరీక్షకు కూడా ఒప్పుకుంటూ ఈ యువకులపై దాడి చేశాడంటే ఎంత అనాగరికమైన అజ్ఞానంలో బతుకుతున్నామో తెలుస్తోంది.

బేటీ బచావ్ బేటీ పఢావ్ నినాదాలిచ్చేవాళ్ళు ఈ అనాగరిక, ఆటవిక దురాచారాలను ఎందుకు వ్యతిరేకించడం లేదు. పద్మావత్ సినిమా విషయంలో మహిళలే ర్యాలీ తీసి జోహర్ చేసుకుంటామని, అంటే సామూహిక ఆత్మాహుతి చేసుకుంటామని బెదిరిస్తున్న నేపథ్యంలో, అలాంటి ర్యాలీలకు మద్దతిస్తున్నవాళ్ళు బేటీ బచావ్ విషయంలో నిజాయితీగా వ్యవహరిస్తారని ఆశించలేము.

# డార్విన్ సూత్రం తప్పా?

కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ ఇటీవల చెప్పినదాని ప్రకారం విద్యార్థులు 'చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం' గురించి తెలుసుకోకుండా దానిని దూరంగా ఉంచాలి. ఆ సిద్ధాంతం వట్టి తప్పుడుదని ఆయన వాదన. విద్య గురించి మంత్రి ఆలోచనలకు సైంటిస్టులు నిర్ఘాంతపోయి ఉండాలి. హేతుబద్ధంగా ఆలోచించే శక్తి ఆ మంత్రికి లేదనుకోవాలి. విద్య గిరి గీసుకొని తన చుట్టూ తాను తిరిగేదా? అలా ఎవరు కోరుకొంటారు.? అసలు విద్య అంటే మన దృష్టిలో ఏమిటి? విద్యా వ్యవస్థను సంస్కరించాలని మనం అనుకొన్న ప్రతిసారీ మన విద్యార్థులు మరింత గా మార్కెట్ నైపుణ్యాలను అలవర్చుకొని, పోటీలో నిలవాలన్నదే మన ఆకాంక్ష. విద్య ద్వారా విద్యార్థులు విలువలను నేర్చుకోవడాన్ని, వారు మంచి నడవడితో పెద్దలు చెప్పినది ఆచరిస్తూ , దేశీయులుగా తయారవడాన్నీ కోరుకొంటాం. వారిని పూర్తిస్థాయి మానవ మాత్రులుగా, మంచి పనివారుగా, బాధ్యతగల పౌరులుగా నిలబెట్టాలని కూడా ఆశిస్తాం.

కానీ మంత్రి సింగ్ ఈ సృష్టి దివ్య శక్తులు తయారు చేసినది గా భావిస్తూ, 'అది క్రమ వికాసం చెందింది' అన్న సూత్రానికి దానిని పోటీగా నిలబెడుతున్నారు. జీవన మార్మికతను మత పరంగా యోచించినవారు 'ఈ లోకం దివ్య శక్తుల సృష్టి' అని సిద్ధాంతీకరించారు. కానీ ఏరకంగా చూచినా, అలా చెప్పడం జీవితాన్ని సమగ్రంగా నిర్వచించడం కాదు. ఈ సృష్టి దివ్య శక్తులు తయారు చేసినది అన్న భావనకు సెక్యులర్, శాస్త్రీయ ప్రత్యామ్నాయంగా 'జీవ పరిణామ సిద్ధాంతం' రూపుదిద్దుకొంది. ఇది ఆధునిక భావజాలానికి అనువైనది కూడా. అయితే 'దివ్య సృష్టి' సిద్ధాంతంగాని, 'పరిణామ' సిద్ధాంతంగాని అవి ఏమి చెప్పదలచుకున్నాయో వాటిని సంపూర్ణ ంగా ప్రతిఫలించే వాదనలు కావు. జీవ పరిణామ సిద్ధాంత కర్తల వాదన వాస్తవాన్ని ఒప్పుకోనితనం నుంచి పుట్టిన వితండ వాదంగా మతవాదులు భావిస్తారు.

'దివ్య శక్తుల సృష్టే లోకం' అన్న తమ వాదన యథార్థమని మతవాదులు నమ్ముతారు. ఈ విషయంలో మతవాదుల అందోళన మతపరమైన మూఢత్వంమాటున దాగి ఉండే అభద్రతాభావనలకు నిదర్శనం. మన మతాలు ఒక తీవ్రమైన సమస్యతో బాధపడుతున్నాయి. మతాలను ఒప్పుకుంటే అవన్నీ తిరోగమన ధోరణులను రుద్దుతాయి. పురోగతికి విరుద్ధమైన ప్రభావాలను చూపుతాయి. వారు చెప్పే మూస సనాతన వాదంలో ఇమడని దేనినైనా వారు సహించలేరు. సనాతన వాదానికి మతవాదులు తప్పుడు అర్థం చెబుతున్నారు. మతాలు కూడా పరిణామ క్రమంలో ఏర్పడినవే అన్న సత్యాన్ని మతపరమైన సనాతన వాదం గాని, సాధికారిక మత విశ్వాసంగాని ఖండించవు. పరిణామ క్రమంలో కాకుండా ఏర్పడిన మతాలు కాలం గడిచిన కొద్దీ చెల్లుబడికాకుండా పోతాయి. అందువల్ల అవి నశిస్తాయి. పరిణామ క్రమంలో సజీవంగా ఉన్నవే నిలబడతాయి.

క్రమ పరిణామం చెందలేని జీవులు మరణానికి సంకేతాలు తప్ప జీవానికి కాదు. వ్యవస్థలయినా అంతే. మతవాదులు తమ ఆత్రం కొద్దీ తప్పుడు సూత్రాలను పోగేసి, విరుద్ధ సిద్ధాంతాలను రూపొందించారు. పశ్చిమ దేశాల చర్చి యథాతథ స్థితిని సృష్టికి ఆపాదించి, మతపరమైన అసహనానికి బీజాలు వేసింది. ఈ విరుద్ధ పరిస్థితి అనేక శతాబ్దాల పాటు కొనసాగింది. అయితే అటువంటి భావాలు శాంతి, పురోగతికి శత్రువులని, ప్రగతిశీలం కాదని క్రమేణా తిరస్కరణకు గురయ్యాయి. ప్రాణుల గురించి చెప్పేదే మతం కాబట్టి నిజమైన మతానికి అటువంటి తిరోగామి సిద్ధాంతాలు, వైఖరులు అవమానకరం. పై పూతలు పూసిన స్మృతులకు, ఊరబెట్టిన మౌఢ్యాలకు అసలు మతం సంకేతం కాదు. తిరోగమన క్రైస్తవ మత సిద్ధాంతాలకు పశ్చిమ దేశాల్లో వ్యతిరేకత పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయా దేశాల్లో ఆ విశ్వాసాలతోనే జీవించగలవారు కొంత మంది కూడా పైకి వ్యతిరేకత చూపారు.

### యూరప్‌లో డార్విన్ సిద్ధాంతం వ్యాప్తి

డార్విన్ సిద్ధాంతాలకు, శాస్త్రీయ దృక్పథానికి సానుకూలత యూరప్‌లో బలీయంగా చోటు చేసుకున్న ఉత్తేజ కర తరుణంలో 'జీవ పరిణామ సిద్ధాంతం' బలమైన ముద్రవేసింది. 19వ శతాబ్దం మధ్యనుంచి మతం స్థానాన్ని సైన్స్ భర్తీ చేస్తుందన్న నమ్మకం చాలా మంది మేధావులలో, ఆలోచనాపరులలో కలిగింది. అయితే అలా జరగలేదు. కానీ రాజ్యాన్ని మతం నుంచి వేరు చేయడానికి హేతుబద్ధతకు డార్వినిజం తోడ్పడింది. ఇది గమనించాల్సిన ముఖ్య అంశం. మతాన్ని పాలన నుంచి వేరు చేసినా, మతం చెబుతున్న ఉత్తమ విలువలను సమాజం నుంచిగాని, ప్రభుత్వంనుంచి గాని తరిమేయాలని ఎన్నడూ, ఎవరూ చెప్పలేదు. 'కోతి నుంచి మానవుడు పరిణామం చెందుతుండగా మన పూర్వీకులు ఎవరూ చూడలేదు లేదా కోతి మనిషిగా మారడం మరెవ్వరూ చూడలేదు కనుక డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పని మన అత్యుత్సాహ మంత్రిగారు అంటున్నారు. ఇది అంతగా చదువుకోని వారి ఆలోచన తీరును ప్రతిబింబిస్తోంది.

మంత్రికి డిగ్రీ చదువులు ఉండడం ముఖ్యంకాదు. అయితే విద్యా శాఖకు మంత్రి అయిన వ్యక్తికి హేతుబద్ధమయిన ఆలోచనలు ఉండాలనుకోవడం అత్యాశ కాదు. జీవ పరిణామ క్రమం అంటే కేవలం కోతులు మనుషులుగా రూపాంతరం చెందడం కాదని మంత్రికి తెలియ లేదంటే ఆయన మనుషుల్లో లెక్క కాదు. జీవ పరిణామ సిద్ధాంతం సారాంశం ఏమిటంటే 'సంఘర్షణే అస్తిత్వానికి మూలం' అన్నది. 'పరిసరాలకు, పరిస్థితులకు అలవాటు పడే క్రమంలో సరికొత్తది, ఇంతకు ముందు ఎరుగనిది ఏదో ఏర్పడుతుంది' అని కూడా ఆ సిద్ధాంతం చెబుతోంది. భారత దేశం తన శక్తిమేరకు సంపూర్ణ స్థాయిలో పరిణామం చెందకుండా తన తిరోగామి భావజాలంతో సత్యపాల్ సింగ్ అడ్డుకుంటారా?

### దేశ గమనాన్ని వెనక్కి తిప్పుతారా?

మంత్రిగారు ఎయిర్ ఇండియా విమానాల స్థానంలో పుష్పక విమానాలను ప్రవేశపెడతారా? స్థానికంగా వాడుకలోగల పురాతన శస్త్ర చికిత్సా విజ్ఞానంతో ఆపరేషన్ చేయించుకుంటారా లేక ఆధునిక ఆసుపత్రి వైద్యం చేయించుకుంటారా? అందుకు పశ్చిమ దేశాల్లో ఖరీదయిన ఆసుపత్రిని ఎంచుకోరా? సైన్యానికి ఆధునిక ట్యాంకుల బదులు రథాలు ఇస్తారా? యుద్ధ కళ 'దివ్య శక్తుల సృష్టి ఈ లోకం' అన్న కరుడుగట్టిన సిద్ధాంతాలతో అభివృద్ధి చెందినది కాదని, అది కాల క్రమేణా పరిణామం చెందుతూ వస్తున్నదని ఇక్కడ చెప్పాలి. నిజంగా విద్యపట్ల మనకు చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులకు ఆలోచనా శక్తిని అందించాలి. అది చేయకుండా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యంలా కనిపిస్తోంది.

కార్లివ్‌అనే మేధావి చెప్పినట్లు విద్యద్వారా మనం కేవలం శిష్యులను పుట్టిస్తున్నాం తప్ప ఆలోచనాపరులను కాదు. విద్యకు సంబంధించి మతం చెప్పేది ఏమిటంటే మేధస్సు పూర్వీకుల నుంచి వారసత్వంగా అబ్బుతుందని. స్త్రీపురుషులను పంజరం లేకుండానే బందీలుగా ఉంచడాన్ని అది కోరుకుంటోంది. వారికి తిరోగమన భావాలను మప్పుతుంది. కాబట్టి మతాన్ని విద్యకు దూరంగా ఉంచాలి. నేటి కాలంలో మతం ఆవశ్యకత కుంచించుకుపోతోందని అందరూ ఒప్పుకుంటారు. మత రక్షకులు అనే వారు కూడా మూఢ భావాలకు బందీలయి బలమైన ఓటు బ్యాంకులుగా రూపొందుతున్నారు. వారు ఓట్ల సమీకరణకు విరివిగా ఉపయోగపడుతున్నారు. మతం అన్నది ప్రచార హోరులో తప్ప జీవన విధానంలో లేదు. అటువంటప్పుడు విద్యార్థుల మెదళ్లను ఆధారంలేని మత సిద్ధాంతాలతో కలుషితం చేయడం తగునా?

✻ వాల్సన్ తంపు

Dwaraka

మన తెలంగాణ
5
హైదరాబాద్
గురువారం
25 జనవరి, 2018
www.manatelangana.news

# అఖిల



# షాపింగ్ విత్ డిగ్నిటీ

## అక్కడన్నీ ఉచితమే..!!



**అక్కడ షాపింగ్ చేస్తే డబ్బులు చెల్లించనక్కర్లేదు. ఎవరికి కావాల్సినవి వారు తీసుకోవచ్చు. బట్టలు, స్టేషనరీ ఐటెమ్స్, బొమ్మలు, చెప్పులు, షూ..వంటసామన్లు.. పుస్తకాలు, వాషింగ్‌మెషీన్లు ఇలా ఒకటేంటి దొరకనివంటూ ఉండవక్కడ. షాపింగ్ విత్ డిగ్నిటీ కాన్సెప్ట్‌గా నిరుపేదలకు పెన్నిధిగా నిలుస్తోంది మెహదీపట్నంలోని గుడ్‌విల్‌స్టోర్.స్టోర్ నిర్వాహకురాలు మంజులాకృష్ణన్‌తో అఖిల మాటామచ్చట...**

గుడ్‌విల్ స్టోర్ చూసేందుకు చిన్నగా ఉన్నా ఆ స్టోర్ నిర్వాహకులు మంజులా కృష్ణన్ మనసు చాలా పెద్దది. పేదలకు ఉచితంగా కనీస అవసరాలు తీర్చాలనే ఉద్దేశంతో మంజుల 2015 అక్టోబర్ 2న గుడ్‌విల్ స్టోర్‌ను ప్రారంభించింది. దాతల ద్వారా సేకరించిన వస్తువులను ఒకచోట చేర్చి, దేనికదే సర్దుబాటు చేసి పేదలకు షాపింగ్ చేసేందుకు వీలు కల్పిస్తోంది. స్టోర్ ఏర్పాటుచేయాలనే ఆలోచన ఎలా వచ్చిందని అడిగితే.. పేదలు, నిరుపేదలు, స్లమ్ ఏరియాల్లో ఉండేవారికి షాపింగ్ చేసుకునే అవకాశం కల్పించడానికే అంటుంది మంజుల. అందుకనే షాప్ విత్ డిగ్నిటీ అనే కాన్సెప్ట్‌తో ప్రారంభినట్లు తెలిపారు. అక్కడికి వెళ్లే వాళ్లకు ఇవి తీసుకోవాలి అని ఎవ్వరూ సలహాలివ్వరు. ఎలాంటి మొహమాటం లేకుండా షాపింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. వచ్చినవారే రాకుండా వారి వద్ద నుంచి ఆధార్ కార్డులాంటి ఏదైనా గుర్తింపు తీసుకుని వస్తువులను ఇస్తున్నారక్కడ. షాపింగ్ చేసేవారికి కావాల్సిన వస్తువులు లేనిపక్షంలో అవేంటో తెలుసుకుని, ఫేస్‌బుక్ ద్వారా ప్రచారం చేసి వారి అవసరాలు తెలిపి, వస్తువులను సేకరించి అందించే ప్రయత్నం చేస్తోంది మంజుల. వారంలో ప్రతి గురు శనివారాలు మాత్రమే ఈ స్టోర్ తెరిచి ఉంటుంది. ఒక్కొక్కరు తమకు నచ్చిన మూడు వస్తువులను మాత్రమే తీసుకెళ్లాలనే నిబంధన ఉంది. నెల తర్వాత వచ్చి మళ్లీ వస్తువులు తీసుకెళ్లొచ్చు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకు షాప్ తెరిచి ఉంటుంది.




**సమాజసేవపై ఆసక్తి...** చిత్తూరు జిల్లాకు చెందిన మంజుల పద్మావతీ యూనివర్సిటీలో పీజీ చేసింది. యూఎన్‌డిపి ప్రపంచబ్యాంకుకు చెందిన పేదరిక నిర్మూలన ప్రాజెక్టులో పనిచేసింది. అనంతరం గ్రామీణాభివృద్ధి శిక్షణాసంస్థలో సేవలందించింది. చిన్నతనం నుంచీ ఉమ్మడి కుటుంబంలో పెరగడంతో సమస్యలపై ఎలా పోరాడాలో తెలుసామెకు. పెద్దల నుంచి నేర్చుకున్న అనుభవాలు చాలా తన జీవితంలో ఉపయోగపడుతున్నాయని చెప్తోంది. చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో చాలా సార్లు వివక్షకు లోనైంది. ఆడపిల్లకు చదువెందుకని కొందరు.. అమ్మాయి నల్లగా ఉందంటూ మరికొందరు మంజులను మనోవేదనకు గురిచేశారు. వారి మాటల్ని లెక్కచేయకుండా ఉన్నత చదువులు చదువుకుని సామాజిక సేవపైపు దృష్టిపెట్టింది మంజుల.
2007లో ఎల్‌ఎస్‌ఎన్ ఫౌండేషన్‌ను స్థాపించింది. ఈ సంస్థ ద్వారా ఇళ్లులేనివారి కోసం నైట్ షెల్టర్ కల్పించింది. హైదరాబాద్‌లో మొట్టమొదటి నైట్ షెల్టర్ ఈ ఫౌండేషన్ మొదలుపెట్టిందే. వారికి అక్కడ బట్టలు, నిత్యావసర వస్తువులు, ఉచితంగా వైద్యసేవలు అందించడంలో కృషి చేసింది. ఆ తర్వాత పుట్టిన ఆలోచనలే గుడ్‌విల్ స్టోర్. షాపింగ్ అనేది ధనికులకు మాత్రమే కాదు పేదలకు కూడా అంటూ... గుడ్‌విల్ పేరుతో స్టోర్‌ను ప్రారంభించింది.



**స్టోర్‌కు సోర్స్ ఏమంటే..**
గుడ్‌విల్‌స్టోర్ పేరుతో ఫేస్‌బుక్ అకౌంట్ ప్రారంభించి నెటిజన్లకు అవగాహన కల్పిస్తోంది మంజుల. మంచి మనసుతో విరాళాలు అందించేవారు ఎక్కువయ్యారు. అపార్ట్‌మెంట్ కాంప్లెక్సులు, కార్పొరేట్ కంపెనీలు, వీరితో పాటు ఇండివిడ్యుల్స్ వచ్చి వారి దగ్గరున్నటువంటివి, వారికి అక్కర్లేనివి, వాడుతున్నవి డొనేట్ చేస్తున్నారు.

**నచ్చింది తీసుకోవడమే...**
గుడ్‌విల్‌స్టోర్‌లో షాపింగ్‌కు వచ్చేవారికి కావల్సిన వస్తువుల్ని ఎవ్వరూ అందివ్వరు..వారికి నచ్చింది వారు తీసుకోవాలంతే. అదే మనం ఇచ్చామనుకోండి వారికి నచ్చకుంటే తీసుకుని వెనక్కెళ్లి పడేసే అవకాశం ఉంది. అందుకనే వారికి నచ్చింది వారు తీసుకుంటే గనక వాళ్లంతట వాళ్లు వాడుకోవడానికి ఉంటుంది. ఎవరో దానం చేయడం కాదు నేనే వెళ్లి తెచ్చుకున్నాననే ఫీలింగ్ ఉంటుంది. షాపింగ్ చేసేవారికి స్వతంత్రం ఇచ్చినపుడే అభివృద్ధి జరుగుతుందని నమ్ముతాను అంటుంది మంజుల. నెలనెలా వచ్చి ఇక్కడ కావల్సినవి తీసుకెళ్లేవారు చాలామంది ఉన్నారు. దాతలు సహకరిస్తే మరి కొన్ని ప్రాంతాల్లో స్టోర్‌లు ప్రారంభిస్తానంటోంది. మనం సంతోషంగా ఉండటం కాదు మన చుట్టూ ఉన్నవాళ్లు కూడా సంతోషంగా ఉండాలనేది తన కాన్సెప్ట్ అంటోంది.

**మల్లీశ్వరి వారణాసి**

## లైఫ్‌స్టైల్@



## ఫోన్ మర్యాదలు పాటించండి



స్మార్ట్ ఫోన్ల రాకతో మొబైల్ ఫోన్లు జీవితంలో ఓ భాగమైపోయాయి. ఫోనే ప్రపంచంగా మారింది. పక్కవారితో సంభాషించడానికి కూడా ఇష్టపడనంతగా..ఈ ప్రవాహంలో కొట్టుకుపోతూ కొన్ని ఫోన్ మర్యాదలను కూడా పాటించడం లేదంటున్నారు నిపుణులు..ముఖ్యంగా కార్పొరేట్ కార్యాలయాల్లో కొన్ని ఫోన్ నియమాలను పాటిస్తూ హుందాగా ఎలా ఉండాలో తెలియజేస్తున్నారు.
ఫోన్ పెద్దగా మోగడం వల్ల ఇతరుల పనుల్లో ఇబ్బంది కలిగించినట్లు అవుతుంది. కార్పొరేట్‌లాంటి ఆఫీసుల్లో ఎవరి పనుల్లో వారుంటారు. కంప్యూటరు కీబోర్డు టకటకలు తప్ప ఇంకేం విన్పించనంతగా నిశ్శబ్దాన్ని పాటిస్తుంటారు. అలాంటప్పుడు మీ సెల్‌ఫోన్ పెద్దగా మోగడం మర్యాద అనిపించుకోదు. అందువల్ల ఫోన్ రింగ్‌టోన్‌ను తక్కువ శబ్దంలోగానీ సైలెంట్ మోడ్‌లోగానీ పెట్టుకోవాలి.
ఇక రింగ్‌టోన్ విషయానికొస్తే..సినిమా పాటలు, సినిమా సంభాషణలు ఇలాంటివి అస్సలు బాగోవు. మీ అభిరుచి కొంతమందికి నచ్చవచ్చు. నచ్చకపోవచ్చు.రింగ్‌టోన్‌లను బట్టి మీ వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తుంటారు. అలాంటప్పుడు ఫోన్ రింగ్‌టోన్ మీకు ప్రతికూలంగా మారుతుంది.
ముఖ్యమైన మీటింగ్‌లు జరుగుతున్నప్పుడు ఫోన్ వస్తే తీయకపోవడమే మంచిది. అత్యవసరమైతే పక్కకు వెళ్లి మాట్లాడాలి. అంతేకానీ అక్కడే ఉండి ఎస్సెమ్మెస్‌లు పంపడం, వంగివంగి మాట్లాడటం మర్యాద కాదు.
మీ పైఆఫీసర్, సహోద్యోగి ఇలాంటివాళ్లు మీతో మాట్లాడుతున్నప్పుడు వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్లలో మునిగి సమాధానాలిస్తూ కూర్చోవడం చేయొద్దు. అవతలివారిని అవమానించినట్లు భావిస్తారు.
వ్యక్తిగత ఫోన్‌లను వీలైనంత తక్కువగా మాట్లాడటం మంచిది.

## ఇంగ్లీషు వైరస్

ఒక్కళ్ల మీద ఒకళ్లు పడుతూ..తోసుకుంటూ ఎక్కడా సీటు ఖాళీగా లేకపోతే ఒకావిడ మా దగ్గరకు వచ్చి జర జరుగురాదు బిడ్డా కాళ్లు నొస్తున్నయి అంది నొప్పి బాధ కళ్లల్లో ప్రదర్శిస్తూ....
ఆ అమ్మాయి మొహం చీదరగా పెట్టుకుని “ ఎలా కూర్చుంటావేంటి? చోటేది ”అంది గోదావరి జిల్లా యాసలో...

ఇక్కడి నుంచి బేగంపేటకి డైరెక్ట్ బస్సుందా? చుడీదార్ వేసుకున్న అమ్మాయి ఇంగ్లీషులో అడుగుతుంటే, సికింద్రాబాదు వెళ్లే బస్ కోసం పబ్లిక్ గార్డెన్ దగ్గర బస్‌స్టాప్‌లో ఎదురుచూస్తున్న నేను తల తిప్పి చూశాను. నల్లటి లెగ్గిన్స్ మీద స్కిన్ గులాబీ టాప్, విరబోసుకున్న జుట్టు, ఎర్రటి లిప్‌స్టిక్, బొట్టులేని నుదురు, ఆధునికతకి కొత్త కొత్త అర్థాలు తెలియచేస్తోంది ఆమె వేషధారణ. ఏమాత్రం నప్పలేదు. చూడాలని అనిపించలేదు.
మొహం తిప్పేసుకుని ఫార్టీనైన్ అన్నాను. థ్యాంక్యూ..నా పక్కనే నిలబడి మొబైల్ తీసుకుని చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుంది. రకరకాల హావభావాలతో అనంతంగా మాట్లాడుతున్న ఆ అమ్మాయి ఫార్టీనైన్ వచ్చిన విషయం గమనించలేదు. నేను బస్ వైపు నడుస్తూ హెచ్చరించాను. అదే ఫార్టీనైన్...
ఫోన్ మాట్లాడుతూనే ఒక్కసారి తలెత్తి బస్‌వైపు చూసి పరుగులాంటి నడకతో వచ్చి బస్ ఎక్కింది. అప్పటికే రద్దీగా ఉన్న బస్ కదిలింది. సీటు దొరక్క వేళ్లాడుతున్నాం నాతోపాటు ఆమె, మరికొందరు.
టిక్కెట్, టిక్కెట్ అంటూ జనాన్ని తోసుకుంటూ వచ్చాడు కండక్టర్.
నేను టిక్కెట్ తీసుకున్నాను. నాతోపాటు మరో నలుగురు తీసుకునే దాకా ఆ అమ్మాయి టిక్కెట్ తీసుకోవాలన్న ధ్యాస లేనట్టు ఫోన్‌లో మాట్లాడుతోంది, నవ్వుతోంది. కండెక్టర్ విసుగ్గా అడిగాడు. మేడమ్ టిక్కెట్..
ఓ సారీ..గభాల్న పర్స్ తెరిచి డబ్బులిచ్చింది.
“ ఈ ఫోన్‌లల్ల మాట్లాడుకుంట కూసుంటరు...లోకంతో సంబంధం లేకుంట” నసుగుతూ ముందుకు వెళ్లిపోయాడు కండక్టర్..
నాకు ఖైరతాబాద్‌లో సీటు దొరికింది.
ఓకె బై..టాక్ టు యు ఇన్ ద నైట్ బై..అంటూ ఫోన్ బ్యాగులో వేసుకుని నా పక్కన ఖాళీ అయిన సీటులో కూర్చుంది.
“ మేడమ్! మీరెక్కడికి వెళ్లాలి?” అడిగింది ఇంగ్లీషులోనే..ఈ పిల్లకు తెలుగురాదు కాబోలు, అనుకుని తప్పనిసరిగా నా బట్లర్ ఇంగ్లీషులోనే జవాబిచ్చాను.
“ మీరు జాబ్ చేస్తున్నారా మేడమ్” మళ్లీ అడిగింది.
“ లేదు హౌస్‌వైఫ్”చెప్పాను.
వెరీనైస్ మేడమ్ అన్నది ఎందుకో అర్థం కాలేదు.
“ఈ ప్లేస్ నాకు కొత్త మేడమ్. మేముండేది సఫిల్‌గూడాలో..నాకు కొంచెం కొంచెం సికింద్రాబాద్ తెలుసుకానీ, హైదరాబాదు తెలియదు..నేను ఇప్పుడే ఓ ఇంటర్వ్యూకి వెళ్లి వస్తున్నాను. మళ్లీ ఇంకో ఇంటర్వ్యూకి వెళ్లాలి బేగంపేటలో...”



నేను హౌస్ వైఫ్‌ని అని చెప్పినా ఇంగ్లీషులోనే మాట్లాడుతోంది. నాకు ఇంగ్లీషు వచ్చని ఆమెకున్న నమ్మకాన్ని వమ్ముచేయడం నాకిష్టం లేకపోయింది. బెస్ట్‌ఆఫ్‌లక్ అన్నాను. సందర్భాన్ని బట్టి నాకొచ్చిన ఇంగ్లీషు పదాలు ఉపయోగిస్తూ..థ్యాంక్యూ వెరీ నైస్ ఆఫ్ యూ అంది.
బస్ రాజ్‌భవన్ దాటింది.
ఆ అమ్మాయి నాకు అర్థం అవుతోందా లేదా అని ఆలోచించకుండా ఇదీ అదీ అని లేకుండా గలగలా మాట్లాడేస్తూ నా వ్యక్తిగత విషయాలన్నీ కూపీలాగసాగింది. నాకు ఒక్కటి మాత్రం అర్థం అయింది. ఆ అమ్మాయి ఇంగ్లీషులో చాలా తప్పులు దొర్లుతున్నాయని..
అయినా ఆమె ప్రశ్నలు కొన్నిటికి మాటలతో, కొన్నిటికి చిరునవ్వుతో సమాధానం చెప్పాను.
సోమాజిగూడలో ఇద్దరు, ముగ్గురు గంపలవాళ్లు ఎక్కారు.
అప్పటిదాకా ఇంగ్లీషులో మాట్లాడేస్తున్న ఆమె ఒక్కసారిగా తెలుగులోకి షిఫ్ట్ అవడంతో ఆ మాటల్లోని యాసకి తెల్లబోయి చూశాను..
ఆమె వేషం, భాష పూర్తిగా ఆధునికంగా, తెలుగుదనం ఎక్కడా కనిపించకుండా ఉందేమో ఆమె నోటి నుంచి తెలుగు పదాలు రావడం నాకు జీర్ణం కావడంలేదు. .మీదే ఊరు? అడిగాను తెలుగులో..
“యూనో రాజమండ్రి...” అడిగింది ఒక రకమైన స్టైల్‌గా
“ఆ..ఆ రాజమండ్రి...”
“నియర్ రాజమండ్రి కొవ్వూరు..మై పేరెంట్స్ ఆర్ దేర్..”
యూ ఆర్ హియర్ అనుకుంటూ బస్ ఆగడంతో గభాల్న దిగాను..

**అత్తలూరి విజయలక్ష్మి**
**99512 50144**

## ప్రణాళిక లేని పట్టణీకరణ ప్రమాదం



**మన తెలంగాణ**/హైదరాబాద్: విశ్వనగరం నిర్మించే సమయంలో ప్రజల ఆర్థిక, సమానత్వ హోదాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు మౌళిక వసతులు నిర్మాణం అవసరమైనప్పటికీ, పర్యావరణ పాత్ర మరవలేమన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నాడు 'స్టేట్ ఆఫ్ హైదరాబాద్ సిటీ' పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఫ్యూచర్ సిటీస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కరుణా గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్, మాజీ ఎంఎల్‌ఏ మర్రి శశిధర్ రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్ధన్ రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ కార్యదర్శి జి. రామేశ్వరరావు, పర్యావరణవేత్తలు పురుషోత్తంరెడ్డి, దొంతి నరసింహారెడ్డి, కేశవరెడ్డి, ఫోరం ఫర్ బెటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. వేదకుమార్, అయేషా రుబీనా, వైద్యులు ప్రవీణ్ సక్సేనా, సి.రామచంద్రయ్య, బివి సుబ్బారావు తదితరులు పాల్గొని విశ్వనగర నిర్మాణంపై తమ ఆలోచనలు పంచుకున్నారు. తొలుత కరుణా గోపాల్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నగరంలో వాయు కాలుష్యంపై దృష్టిపెట్టాలని, మైదాన ప్రాంతం తగ్గి, కాంక్రీట్ జంగిల్‌గా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అభివృద్ధికి రూ.66.5 లక్షలు

**మన తెలంగాణ** / హైదరాబాద్: రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద కొడంగల్, వనపర్తి, అంథోల్ నియోజకవర్గాల అభివృద్ధికి 66.5లక్షల రూపాయలను విడుదల చేస్తూ బుధవారం ఆర్థికశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. అభివృద్ధి, ససంక్షేమం కోసం జిల్లాలకు కేటాయించిన 5 కోట్ల రూపాయల నిధి నుంచి ఈ నిధులు విడుదలయ్యాయి. ఆయా జిల్లా మంత్రుల ఆదేశాలకనుగుణంగా పాలనాపరమైన అనుమతులు లభించడంతో నిధులను విడుదల చేసినట్లు ఆర్థికశాఖ స్పష్టం చేసింది. సంగారెడ్డి జిల్లాలోని అంథోల్ నియోజవర్గానికి రూ.2 లక్షలు, కొడంగల్, వనపర్తి నియోజవర్గాలకు కలిపి రూ.64.5లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఒక ప్రకటనను విడుదల చేశారు.

### ఎంఎల్‌సిల ప్రతిపాదనలతో నిధుల విడుదల

రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల అభివృద్ధికి ఎల్‌ఎంసిలు పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఆర్థికశాఖ నిధులను విడుదల చేసింది. సంగారెడ్డి, వి కారాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో అభివృద్ధికి ఆయా జిల్లాలకు చెందిన ఎంఎల్‌సిలు పంపిన ప్రతిపాదనలకు పాలనాపరమైన అనుమతులు మంజూరుకావడంతో ఆర్థికశాఖ బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. సంగారెడ్డి జిల్లాకు రూ. 2.48 కోట్ల ప్రతిపాదనలకుగాను ప్రస్తుతం రూ. 2.17 కోట్లను విడుదల చేసింది. ఇందులో రూ. 1.64 కోట్లు జనరల్ నిధి నుంచి, రూ.34.7లక్షలు ఎస్సీ అభివృద్ధి నిధి నుంచి, రూ. 18 లక్షలు ఎస్టీ అభివృద్ధి ని ధి నుంచి విడుదలయ్యాయి. వికారాబాద్ జిల్లాలో 66 రకాల అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 2.86 కోట్ల ప్రతిపాదనలకుగాను రూ. 28.66 లక్షలు విడుదల చేస్తున్నట్లు ఆర్థిక శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొనింది. మిగిలిన నిధులను గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద విడుదల చేసేందుకు పాలనపరమైన అనుమతులకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. కామారెడ్డి జిల్లాలో బిక్నూర్ మండలం ఇసుకపల్లి గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థానిక ఎంఎల్‌సి మహమూద్‌అలీ చేసిన ఐదు లక్షల రూపాయల ప్రతిపాదనలకుగాను మూడు లక్షల రూపాయలను విడుదల చేసింది.

## రైల్వేను స్తంభింపజేస్తాం




**మన తెలంగాణ** / హైదరాబాద్ : కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం రైల్వే ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడులకు అనుమతి చర్యలను, కార్మికుల పట్ల మొండి వైఖరిని విడనాడి తగిన న్యాయం చేయనట్లయితే రైల్వేను స్థంభింపజేస్తామని అఖిల భారత రైల్వేమెన్ ఫెడరేషన్ (ఎఐఆర్‌ఎఫ్) ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా అన్నారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేసూA దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సిఆర్ ఎంయు) బుధవారం రైల్ నిలయం వద్ద సామూహిక ధర్నా నిర్వహించింది. రైల్వే ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాను ఉద్దేశించి శివగోపాల్ మిశ్రాతో పాటు ఎస్‌సిఆర్‌ఎంయు అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.శంకరరావు, సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షులు కె.యాదవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్ తదితరులు ప్రసంగించారు. శివగోపాల్ మిశ్రా మాట్లాడుతూ తమ సమ్మెను వాయిదా వేసుకోవడానికి ప్రభుత్వం అంగీకరించిన మేరకు కొత్త పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర కార్మిక సంఘాలతో రైల్వే బోర్డు, రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. శంకర్‌రావు మాట్లాడుతూ ఎస్‌సిఆర్‌లో ఇంజనీరింగ్ గ్రేడ్ 3 ఉద్యోగులను, గ్రేడ్ 2గా పరిగణించాలని డిమాండ్ చేశారు.

## శ్రీనివాస్‌కు షరతుల బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ఆమె అరెస్టు నుంచి తప్పించుకున్నట్లైంది. 'సేవ్ టెంపుల్స్' అనే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై శ్రీనివాస్‌ను ఈ నెల 2న పోలీసులు అదుపులోకి తీసుకున్నది తెలిసిందే.

## 21 మంది రాష్ట్ర పోలీసులకు పతకాలు

### అదనపు డిజి జితేందర్‌కు రాష్ట్రపతి పోలీసు పతకం



**మన తెలంగాణ**/హైదరాబాద్: విధినిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 795 మంది పోలీసులకు పతకాలను కేంద్ర హోంశాఖ బుధవారం ప్రకటించింది. వీరిలో 107 మందికి శౌర్య సేవా పతకం, 75 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం, 613 మందికి ఉత్తమ పోలీసు సేవా పతకం దక్కింది. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 21 మంది పతకాలు దక్కించుకున్నారు. ఆరుగురికి శౌర్య సేవా పతకం, ఇద్దరికి రాష్ట్రపతి సేవా పతకం, 13 మందికి ఉత్తమ పోలీసు పతకంకు ఎంపికయ్యారు. పతకలకు ఎంపికైన పోలీసు అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.

### రాష్ట్రపతి పోలీసు పతకం (పిపిఎం)...

| | |
|---|---|
| జితేందర్ | అదనపు డిజి, రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్ |
| చుంగి నరేందర్ నారాయణరావు | డిఎస్‌పి హైదరాబాద్ |
| సత్యవీర్‌సింగ్ | నేషనల్ పోలీసు అకాడమీ ఎస్‌ఐ |

### కఠిన సేవా పతకం (పిఎంజి)...

| | |
|---|---|
| జి.సురేష్ | గ్రేహ్యాండ్స్ జూనియర్ కమాండో |
| ఎం.మురళి | గ్రేహ్యాండ్స్ జూనియర్ కమాండో |
| బి.శ్రీరాములు | గ్రేహ్యాండ్స్ అసిస్టెంట్ కమాండెంట్ |
| వెంకట శ్రీనివాసరెడ్డి | గ్రేహ్యాండ్స్‌అసిస్టెంట్ కమాండెంట్ |
| పి.లక్షాణుడు | గ్రేహ్యాండ్స్ జూనియర్ కమాండో |
| హరీష్ | గ్రేహ్యాండ్స్ జూనియర్ కమాండో |

### పోలీసు ఉత్తమ సేవా పతకం (పిఎంఎంఎస్)...

| | |
|---|---|
| మస్తిపురం రమేష్ | గ్రేహ్యాండ్స్ కమాండర్ |
| డి.శివప్రసాద్ రెడ్డి | టిఎస్‌ఎస్‌పి రంగారెడ్డి |
| పి.వీరస్వామి | టిఎస్‌ఎస్‌పి హైదరాబాద్ |
| తుల్జారామ్ నరేందర్‌సింగ్ | డిఎస్‌పి |
| చెట్లూరి శ్రీనివాస శాంతి | ఇన్‌స్పెక్టర్ |
| గెడ్డిపల్లి రణవీర్‌రెడ్డి | ఇన్‌స్పెక్టర్ |
| పల్లె శంకర్‌రెడ్డి | సబ్‌ఇన్‌స్పెక్టర్ |
| ఎండి ఫయాజ్ | ఎఆర్ ఎస్‌ఐ |
| వేమూరి శివానందరావు | హెడ్‌కానిస్టేబుల్ |
| రాథోడ్ రోహిదాస్ నాయక్ | ఎఎస్‌ఎస్‌టి కమాండర్ |
| పి.శ్రీనివాస్ | గ్రేహ్యాండ్స్‌జూనియర్ కమాండో పిసి |
| ఎం.సిద్దయ్య | హెడ్‌కానిస్టేబుల్ |

## నకిలీ జనన సర్టిఫికెట్ల తయారీ
# ముఠా అరెస్టు



● మూడేళ్ళలో 2122 పత్రాలు విడుదల ● గత మూడేళ్ళుగా కొనసాగుతోన్న తంతు

**మనతెలంగాణ**, సిటీబ్యూరో : జిహెచ్‌ఎంసికి చెందిన నకిలీ జనన, మరణ ధృవీకరణ పత్రాలను తయారుచేస్తూ లక్షల రూపాయాల్లో దండుకుంటున్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టుచేశారు. జిహెచ్‌ఎంసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మీసేవా నిర్వాహకులు, దళారీలు, ఏజెంట్లతో కూడిని 13 మంది నిందితులను మల్కాజిగిరి ఎస్‌ఓటి, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడిలో పట్టుబడ్డారు. బుధవారం ఎల్‌బినగర్ రాచకొండ సిపి క్యాంపు కార్యాలయంలో పోలీసు కమిషనర్ మహేశ్‌భగవత్ వెల్లడించారు. వెస్టు మారెడుపల్లి, చింతల్, జీడిమెట్లలో మీ సేవాకేంద్రాలు నిర్వహిస్తున్న మేకల వెంకటాద్రి, వరకంటి రంజిత్‌కుమార్, గుండాల కృష్ణ, ఎం. నారాయణరావులు అతి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బును సంపాదించాలనే దురాశతో నకిలీ ధృవీకరణ పత్రాల జారీకి సిద్దమయ్యారు. తమతమ కేంద్రాలకు వచ్చే మధ్యదళారీలు నేరెడ్‌మెట్ సఫిల్‌గూడ వాసి సనీల్‌కుమార్, ఎన్‌టిఆర్ నగర్‌కు చెందిన చంద్రమౌళి, మీర్‌పేట అల్మాస్‌గూడ రవికుమార్‌లకు అత్యవసరంగా జనన ధృవీకరణ పత్రాలు కావాలనుకున్నవారికి ఇప్పిస్తామని అందుకు ఒక్కోక్క సర్టిఫికెట్‌కు రూ. 5 వేలు వరకు తీసుకుంటున్నామని తెలిపారు. ఆధార్, బోనఫైడ్, ఎస్‌ఎస్‌సి మెమో లేకున్నా తండ్రి, తల్లి పేర్లు, శిశువు పేరు జనన తేదీ ఉంటే ఇప్పిస్తామని ఆశ చూపడంతో బ్రోకర్లు ఎక్కువ డబ్బులకు మాట్లాడుకొని వీరికి వివరాలు పంపేవారు. అప్పటికే తాము కుమ్మక్కు అయిన కుత్బుల్లాపూర్ జిహెచ్‌ఎంసి, సర్కిల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసే వనస్థలిపురంకు చెందిన భానుప్రకాశ్, సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో పనిచేసే సార కిరణ్‌కుమార్‌లకు కొంత నగదును చెల్లించి జనన, మరణ వివరాలతో రిజిస్ట్రేషన్ నంబర్‌ను సబ్‌రిజిస్ట్రార్‌కు పంపేవారు. అక్కడి నుండి క్లియర్ అయి మరల జిహెచ్‌ఎంసి డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు వచ్చేవి. అప్పుడు వీరు సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో హెల్త్ సహాయకుడిగా పనిచేస్తున్న రామకృష్ణ, బాబునాయుడు, సర్కిల్ 15లె పనిచేసే నాని బాబులు కుమ్మక్కై వారు ధృవీకరణ పత్రాలను తీసుకునేవారు. ఆ తర్వాత అస్పత్రి పేరు జనన తేదీలతో జిహెచ్‌ఎంసి ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో డాటా ఎంట్రీ ఆపరేటర్‌లు నిక్షిప్తంచేశారు. ఇలా గత మూడేళ్ళుగా 2122 పత్రాలను అందజేశారు. ఆసుపత్రిల్లో ఏవిధమైన రికార్డులు లేకుండా నిబంధనలకు విరుద్దంగా ఆర్‌డిఓ, తహాశీల్దారుల ప్రమేయం లేకుండా డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాయాజాలంతో నకిలీ సర్టిఫికేట్లు తయారుచేసి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దీనిపై దర్యాప్తు చేసి నకిలీ జనన, మరణ పత్రాలను తయారు చేస్తున్న ముఠాను పోలసులు అరెస్టు చేశారు. అయితే, నకిలీ బర్త్ సర్టిఫికెట్లు తయారుచేస్తున్న ఏజెంట్లు యాదగిరి, అబ్దుల్, తిరుపతి, వినయ్, దినేష్, కనకయ్య, కుమార్ మాథ్యూస్, నగేష్, రాజుకుమార్, శ్రీను, సాగర్, తిరుమల్‌గౌడ్, సబ్‌రిజిస్ట్రార్‌లు అయిన ఆనంద్‌లు పరారీలో ఉన్నారని కమిషనర్ మహేశ్‌భగవత్ తెలిపారు.

## ప్రభుత్వ చర్యలు, పౌరుల హక్కుల మధ్య
# సమతుల్యత : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** దేశం ఉగ్రవాదం, అక్రమ నగదు చలామణి వంటి ముప్పులు ఎదుర్కొంటున్న తరుణంలో గోప్యత హక్కు, ప్రభుత్వ బాధ్యతల మధ్య ఓ సమతుల్యత అవసరం, సంక్షేమ వ్యయంపై నిఘా అవసరమని సుప్రీంకోర్టు బుధవారం అభిప్రాయపడింది. ప్రభుత్వ ప్రధాన ప్రాజెక్టు అయిన ఆధార్ కార్యక్రమం, దానికి సంబంధించి 2016లో చేసిన చట్టంను ఓ సీనియర్ న్యాయవాది సవాలు చేయడంతో సుప్రీంకోర్టు ఈ అభిప్రాయాన్ని వెల్లడించింది. ప్రభుత్వం నిఘా పెట్టడాన్ని రాజ్యాంగం అనుమతించదు. కానీ సాంకేతికంగా ప్రతి లావాదేవీ, వ్యక్తుల పూర్తి వివరాలు(ప్రొఫైల్), రాజ్యాంగ విధుల్లో రాజీ వంటివి ఇప్పుడు సాధ్యమవుతున్నాయని ఆ న్యాయవాది పేర్కొన్నారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలో ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఆధార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ చేపట్టింది. అయితే రాజ్యాంగ ధర్మాసనం ప్రపంచంలో ఏ విధానం కూడా సురక్షితం కాదని, డేటాను ఎలా సేకరిస్తున్నదని సమస్య కాదనీ, కానీ దానిని ఎలా దుర్వినియోగం చేస్తున్నారనేదే సమస్యగా మారుతుందని రాజ్యాంగ ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. 'మనం ఉగ్రవాదం, అక్రమ నగదు చలామణి, సంక్షేమ వ్యయం వంటివి ఉన్న కాలంలో బతుకుతున్నాం. అయితే వ్యక్తుల హక్కుల, ప్రభుత్వ చర్యల మధ్య సమతుల్యతను సాధించాల్సి అవసరం ఉంది' అని న్యాయమూర్తులు ఎ.కె.సిక్రీ, ఎం.ఎం. ఖాన్‌విల్కర్, డి.వై. చంద్రచూడ్, అశోక్ భూషణ్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషనర్లయిన కర్ణాటక హైకోర్టు మాజీ జడ్జి కె.ఎస్.పుట్టస్వామి, అరుణా రాయ్ వంటి మానవ హక్కుల కార్యకర్తలు అనేక మంది, శాంత సిన్హా, సిపిఐ(ఎం) ప్రముఖ నాయకుడు వి.ఎస్. అచ్యుతానందన్ తరపున సీనియర్ నాయకుడు శ్యామ్ దివాన్ వాదించారు. రోజంతా జరిగిన వాదనలో ఆయన ' ఏది సురక్షితం కాదు. అనేక మార్గాలు ఉంటాయి. అయితే బయోమెట్రిక్స్ అనేదే సమస్య. ఎందుకంటే అవి దొంగిలింపబడితే లేక హ్యాక్ అయితే వాటిని మీరు మార్చలేరు' అని అన్నారు. 'ప్రభుత్వ నిర్ణయాన్ని పరిశీలించాలా? ముఖ్యంగా ప్రపంచంలో ఏ విధానం సురక్షితం కాదన్న నేపథ్యంలో... గూగుల్ మ్యాప్స్ మనల్ని ట్రాకింగ్ చేయడాన్ని, ఇతర ప్రయివేట్ కార్పొరేషన్స్ మన గురించి తెలుసుకోవడాన్ని ఆమోదించడంలేదా?' అని ధర్మాసనం దివాన్‌ను నిలదీసింది.

# నయీం బాధితులతో ముఖాముఖి

### 12న వామపక్ష, టిజెఎసి, పౌరహక్కుల సంఘాల భేటీ



**మన తెలంగాణ** / హైదరాబాద్ : నయీం బాధితులతో ఫిబ్రవరి 12వ తేదీన హైదరాబాద్ ముఖాముఖి నిర్వహించాలని వామపక్ష, టిజెఎసి, పౌరహక్కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది. నయీం ఆస్తులను, నయీంతో లబ్ది పొందిన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల ఆస్తులను జప్తు చేసి బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. నయీం భౌతికంగా లేకపోయినా బాధితులు బయటకు వచ్చి వారి బాధలు చెప్పుకోడానికి నయీం నేర సామ్రాజ్యానికి, పోలీసులకు ఇంకా భయపడుతున్నారని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. 'నయీం ఆగడాలు, దోషులకు శిక్షలు, బాధితులకు న్యాయం' తదితర అంశాలపై సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం మఖ్దుంభవన్‌లో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డి.జి.నరసింహారావు సిపిఐ(ఎం), కె.గోవర్ధన్ (సిపిఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ), ఎన్.రవిచంద్ర (తెలంగాణ ప్రజా ఫ్రంట్), ఆర్.జీవన్‌కుమార్ (మానవ హక్కుల వేదిక), ఎన్.నారాయణరావు (పౌర హక్కుల సంఘం), గాదె ఇన్నయ్య (ప్రజా తెలంగాణ), అన్వేష (సిపిఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ), డి.రాజేశ్ (సిపిఐ(ఎంఎల్ లిబరేషన్), భూతం వీరన్న (సిపిఐ ఎంఎల్), రామగిరి ప్రకాశ్( టిజెఎసి), సామాజిక కార్యకర్త సజయ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నయీం కేసులో దొరికిన డైరీని బహిర్గతం చేసి అందుకు బాధ్యులైన దోషులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని,నయీం కేసు వివరాలన్నింటితో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని, కేసును సిబిఐతో విచారణ జరిపించాలని సమావేశం కోరింది.

నయీం కేసులో ఎంత పెద్దవారు ఉన్నా వదిలేది లేదని సిఎం కెసిఆర్ చేసిన ప్రకటనలకు, ఆచరణలో కేసు విచారణ జరుగుతున్న తీరుకు పొంతన లేదని, సిట్ విచారణ అటకెక్కిందని సమావేశంలో వక్తలు విమర్శించారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నయీం చనిపోయినా అతని పేరుతో ఇంకా భూ దందాలు, ఇతర సెటిల్‌మెంట్లు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నయీం కేసు అంశాన్ని అసెంబ్లీలో చర్చించే విధంగా వత్తిడి తీసుకువచ్చి బాధితులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని జీవన్‌కుమార్ అన్నారు. నయీం లాంటి అక్రమ సామ్రాజ్యం భవిష్యత్‌లో ఎదగకుండా ప్రజా సంఘాలంతా ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరముందని నారాయణరావు అన్నారు. నయీం పోలీసుల వ్యూహాలకు సహకరించినందునే అతని అనుచరులకు పోలీసులు ఇంకా సహకరిస్తున్నారని, బాధితులను భయపెడుతున్నారని డి.జి.నరసింహారావు అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుండా మల్లేష్, మల్లెపల్లి ఆదిరెడ్డి, పశ్య పద్మ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు రూ.15వేల పెన్షన్
### ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

**మన తెలంగాణ** / హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని, స్వాతంత్ర్య సమర యోధుల మాదిరిగా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి నెలకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ వలిఉల్లా ఖాద్రీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. ఈ మేరకు ఆయన సిఎం కెసిఆర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లలో 10 శాతం రిజర్వేషన్లను ఉద్యమకారుAలకు కల్పించాలని, ఉద్యమకారులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ అమరవీరులు, ఉద్యమకారుల చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చాలన్నారు. కేంద్రంతో చర్చించి ఉద్యమకారులపై ఉన్న రైల్వే కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు.

## ఖమ్మం జడ్‌పి సమావేశంలో వాగ్వాదం



**మన తెలంగాణ**/ ఖమ్మం : ఖమ్మం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికార, ప్రతిపక్షాల మధ్య ఉమ్మడి జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, నిధులు తదితర అంశాలపై తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. బుధవారం జిల్లాప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్పి చైర్‌పర్సన్ గడిపల్లి కవిత అధ్యక్షతన జరిగింది. రానున్న పంచాయతీ ఎన్నికల్లో గ్రామ పంచాయతీ ప్రత్యక్ష ఎన్నికలు జరిపేందుకు జెడ్పి సమావేశం తీర్మానించాలని ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి పట్టుబట్టారు. ఈ అంశంపై జెడ్పి చైర్‌పర్సన్ గడిపల్లి కవిత తీవ్ర స్థాయిలో వ్యతిరేకించి తీర్మానాన్ని తాను నిరాకరిస్తున్నానని తేల్చిచెప్పడంతో పొంగులేటితో పాటు రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, సిపిఎం, సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీలకు చెందిన జెడ్పిటిసి సభ్యులు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. గత సమావేశంలో గౌరవ సభ్యులు పొందుపర్చిన పలు అంశాలను ఎజెండాలో చేర్చి అంశాల వారీగా చర్చిస్తుంటే పలువురు సమావేశానికి అడ్డుతగులుతూ ఇబ్బందులకు గురి చేయడం తగదని చైర్‌పర్సన్ కవిత అన్నారు.

## డ్రైవర్‌కు 'ఉత్తమ్ జీవన్ రక్షా'

**న్యూఢిల్లీ:** అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు గానూ పౌరులకిచ్చే రెండో అత్యున్నత సాహస అవార్డు 'ఉత్తమ్ జీవన్ రక్షా పదక్'కు గుజరాత్‌కు చెందిన బస్సు డ్రైవర్ షేక్ సలీం గఫర్ ఎంపికయ్యారు. ఉగ్రవాదుల బుల్లెట్ల దాడి నుంచి 52 మంది అమర్‌నాథ్ యాత్రికులను రక్షించినందుకు ఆయన ఈ బహుమతికి ఎంపికయ్యారని బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. జులై 10, 2017న జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా బాటెన్‌గ్యూలో అమర్‌నాథ్‌యాత్రికుల బస్సుపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో ఏడుగురు మృతి చెందగా, 14 మంది గాయపడ్డారు. ఈ ఘటలో బస్సు డ్రైవర్ అసమాన ధైర్య సహసాలు ప్రదర్శించి 52 మంది ప్రయాణికులను రక్షించినట్లు హోంశాఖ పేర్కొంది.

ఆయనకు సాహస బహుమతి ప్రదానం చేయడంతోపాటు తర్వాత జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రూ.లక్షతో సత్కరించనున్నారు. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన పౌరులకిచ్చే మొదటి అత్యున్నత అవార్డు 'సర్వోన్నత జీవన్ రక్షా పదక్' కాగా రెండో బహుమతి 'ఉత్తమ్ జీవన్ రక్షా పదక్' కావడం గమనార్హం. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవంలో మొత్తం107 మందికి పోలీస్ గ్యాలంటరీ మెడల్ అందించనున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసులు(38 పతకాలు), సిఆర్‌పిఫ్(35), ఛత్తీస్‌గఢ్ (10), మహారాష్ట్ర (7), తెలంగాణ (6). బహుమతులకు ఎంపికైనవారిలో ఐదుగురు ఐపిఎస్ అధికారులు కూడా ఉన్నారు.

# ఇళ్లపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, కాంట్రాక్టర్లు ఈ భారాన్ని భరించలేని స్థాయికి చేరాయని, ప్రభుత్వం తక్షణం స్పందించి ధరల పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వమే కనీస ప్రాథమిక ధరను నిర్ణయించాలని ఈ సమావేశం కోరింది. నిర్మాణాల్లో ఇనుము, ఉక్కు, సిమెంట్ అతిముఖ్యమైనవని, ఆరు నెలల కిందట ఇనుము, ఉక్కు ధరలు టన్నుకు రూ. 30 వేల ఉంటే ఇప్పుడు రూ. 50 వేలకు చేరిందని, ఈ పెరుగుదలతో నిర్మాణాలను కొనసాగించలేమని బిల్డర్లు తేల్చిచెప్పారు. అంతర్జాతీయంగా ఇనుము, ఉక్కుకు డిమాండ్ పెరగడం, చైనా ప్రభుత్వం వాయు కాలుష్య కారణంగా పలు స్టీల్ ప్లాంట్లను మూసివేయడం, ఎగుమతులు క్షీణించడం, మన దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇనుము చైనాకు ఎగుమతి అవుతుండడం.. ఇలా అనేక అంశాలు ప్రభావితం చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. స్టీల్ తయారీ దారుల ఒంటెత్తు పోకడలు, సిండికేట్‌గా రింగ్ అయి ఐరన్, స్టీల్ ధరలను ఒక్క సారిగా 60 శాతానికి పెంచి లాభాలను చూసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిజానికి ఇనుము, ఉక్కు ధరల పెంపు భవన, ఇతర నిర్మాణ రంగ పరిశ్రమపై పెను విఘాతం కలిగిస్తుందని వారు పేర్కొన్నారు. ఇనుము, ఉక్కు ధరల పెంపుదల ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులను ఆపేలా చేసిందని బిఏఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.ఎన్ . రెడ్డి అన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని స్టీల్ ధరలను స్థిరీకరించాలని, లేదంటే సాగు నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టుల పనుల్ని కొనసాగించడం సాధ్యం కాదన్నారు. ధరలను తగ్గించే వరకు ప్రాజెక్టుల పనులను ఆపడం తప్ప తమకు మరో గత్యంతరం లేదని స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రాజెక్టును చదరపు అడుగుకు రూ.800 ధరలోనే తాము చేస్తున్నామని, పెరిగిన ధరల ప్రకారం చ.అడుగుకు దీని ఖర్చు రూ.1100 కానుందన్నారు. అందరికీ ఇళ్లు అనే ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ధరలను తగ్గించక తప్పదన్నారు.

### ధరల నియంత్రణకు కమిటిని వేయాలి

స్టీల్ ధరల నియంత్రణ, క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కచ్చితంగా ఒక కమిటిని నియమించాల్సిందిగా పరిశ్రమ డిమాండ్ చేస్తోందని బిఏఐ తెలంగాణ ఛైర్మన్ బి. సుగుణాకర్ రావు అన్నారు. లేదంటే మొత్తం పరిశ్రమే మూత పడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది రాష్ట్రం ఆ తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాలను చూపనుందని అభిప్రాయపడ్డారు.

# మున్సిపల్ హోదా

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీలతో పాటు నగరపంచాయతీలు మున్సిపాల్టీలుగా మారనున్నాయి. అవసరాన్ని బట్టి అయిదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రెండు, మూడు గ్రామాలను కలిపి మున్సిపాల్టీలుగా మార్చాలని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం పంచాయతిరాజ్ చట్టంలో తగిన మార్పులను తీసుకురావాలని భావిస్తోంది. ఇప్పటికే 500 జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా మార్చాలని నిర్ణయించిన ప్రభుత్వం 5000 జనాభా ఉన్న పంచాయతీలను మేజర్ గ్రామపంచాయతీలుగా, ఆపైబడిన జనాభా ఉన్న మేజర్ గ్రామపంచాయతీలను నగరపంచాయతీలుగా మార్చాలని భావిస్తోంది. గురువారంకల్లా ఈ వివరాలను సమర్పించాలని పంచాయతీరాజ్ రాజ్ అధికారులు గడువు విధించారు. పంచాయతిరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు చైర్మన్‌గా ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ వారం రోజుల క్రితమే ఓ జాబితాను ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అందచేసింది. అయిదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న రెండు, మూడు గ్రామాలను కలపడం ద్వారా మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చే అవకాశమున్నట్లయితే ఆమేరకు ఆయా గ్రామాలను కలిపే విషయంలోను నిర్ణయం తీసుకునే అధికారాలను జిల్లా అధికారులకు ఇచ్చారు. ఒకవేళ ఆయా గ్రామాల వారు విలీనం కావడానికి నిరాకరించిన పక్షంలో ఆ వ్యవహారాన్ని ప్రభుత్వమే చూసుకుని ఆయా మేజర్ గ్రామ పంచాయతీలు, నగరపంచాయతీలను మున్సిపాల్టీలుగా మార్చే ప్రక్రియను చేపడుతుంది.

**5040 ప్రతిపాదనలు :** 500 జనాభా అంత కంటే ఎక్కువ ఉన్న తండాలను, తండాల సమూహాలు, ఇతర ఆవాసాలను పంచాయతీలుగా మారుస్తామని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇప్పటికే ప్రకటించడంతో ప్రజాప్రతినిధుల నుంచి ఇప్పటికే 5040 ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందినట్లు తెలిసింది. వీటిపై గ్రామపంచాయతి పాలక మండలి సమావేశాల్లో తీర్మానాలు చేయాలని నిర్ణయం జరిగింది.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం 200జనాభా కంటే తక్కువ జనాభా ఉన్న ఆవాసాలు 346, 200 నుంచి 499 జనాభా ఉన్న ఆవాసాలు 370 చొప్పున ఉన్నాయి. 500 నుంచి 999 జనాభా ఉన్నవి 1733, 1000 నుంచి 1999 జనాభా ఉన్న ఆవాసాలు 3029 ఉన్నాయి. 600 ఆవాసాల్లో ఎలాంటి జనావాసం లేదని, ఇందుకు కారణం శాశ్వత వలసలు, ప్రాజెక్టులతో ముంపు పేరుతో ఖాళీ కావడమేనని తెలిసింది.

## లాలూకు ఐదేళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

జరిమాన కూడా విధించింది. 1990 దశకం తొలి భాగంలో చాయిబాసా కోశగారం నుంచి మోసపూరితంగా డబ్బును విత్‌డ్రా చేసిన దాణా కుంభకోణం కేసు విచారణను సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం ఉదయం చేపట్టి వారిద్దరినీ దోషులుగా తేల్చింది. నాడు కేవలం రూ. 7.1 లక్ష కేటాయించగా వారు రూ. 33.7 కోట్లు డ్రా చేశారన్నది అభియోగం. లాలూ ప్రసాద్ యాదవ్ ప్రస్తుతం బిర్సా ముండా జైలులో శిక్షను అనుభవిస్తున్నారు. 2013 సెప్టెంబర్‌లో దాణా కుంభకోణం మొదటి కేసులో న్యాయస్థానం లాలూను, ఆయనకు ముందున్న ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాను దోషులుగా తేల్చి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. నాడు అవినీతి వ్యతిరేక చట్టం కొత్త మార్పుల కింద పదవి నుంచి తొలగించబడిన తొలి ఎన్నికైన నేతగా లాలూ నిలిచారు. ఇక డిసెంబర్ 23న దాణా కుంభకోణం రెండో కేసులో న్యాయస్థానం లాలూను దోషిగా తేల్చింది. ఆయనకు జనవరి 6న మూడున్నరేళ్ల జైలు శిక్ష, రూ. 5 లక్షల జరిమాన విధించింది. లాలూను న్యాయస్థానం దోషిగా నిర్ధారించి జైలు శిక్ష విధించడంపై ఆమయన కుమారుడు , బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ ప్రతిస్పందిస్తూ ' లాలూజీ హీరో అని బీహార్ ప్రజలు నమ్ముతున్నారు. దాణా కుంభకోణం కేసులో లాలూను ఇరికించడంలో బీహార ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పాత్ర ఉంది. లాలూజీకి వ్యతిరేకంగా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్, నితీశ్ కుమార్ కుట్రపన్నారన్నది ప్రజలకూ తెలుసు. ఈ తీర్పుపై పై కోర్టుకు వెళతాం' అన్నారు.

## ఉప నిధులు ఉఫ్

(మొదటిపేజీ తరువాయి)

చివరి నాలుగేళ్ళలో ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ.12,733.84 కోట్లు కేటాయిస్తే రూ.6,792.95 కోట్లు మాత్రమే ఖర్చయింది. తెలంగాణ రాష్ట్రంలో కేటాయింపులు పెరిగినా నిధుల వినియోగంలో పెద్దగా మార్పు లేదు. 2014–15 సంవత్సరంలో ఎస్‌సిల ప్రత్యేక అభివృద్ధి నిధికి తెలంగాణ ప్రభుత్వం రూ.7,579.45 కోట్లు కేటాయించగా అందులో రూ.2,936.26 కోట్లు మాత్రమే ఖర్చయింది. 2015–16 లో రూ.8,089 కోట్లకుగాను రూ.4,682.48 కోట్లు ఖర్చయింది. 2016–17లో 10,483 కోట్లకుగాను రూ.5,257.61 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ 14,375.13 కోట్లు కేటాయిస్తే సగం కూడా ఖర్చు చేయలేదు. ఎస్‌సి సబ్సిడీ రుణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు నత్తనడకన నడుస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.



## గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వం విఫలం: ఉత్తమ్

**మన తెలంగాణ**/చింతలపాలెం: రైతులకు గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ జిల్లా చింతలపాలెం మండల కేంద్రంలోని దొండపాడు గ్రామంలో రూ. 6 కోట్ల వ్యయంతో నిర్మించిన పెద్దమ్మతల్లి కోల్డ్ స్టోరేజ్‌ను ఉత్తమ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయడం మిర్చి, పసుపు, చింతపండు పండించే రైతులకు ఉపయోగకరం అన్నారు. అనంతరం టిఆర్‌ఎస్ పార్టీ పాలన తీరుపై ప్రజలు విసుగు చెందారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వరికి రూ. 2వేలు, జొన్న, మొక్కజొన్న రైతులకు రూ.5 వేలు, మిర్చి, పసుపు రైతులకు రూ. 10 వేలు తగ్గకుండా మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్యమ పార్టీ పేరుతో గెలుపొంది నిరుద్యోగులను పావులుగా వాడుకొని టిఆర్‌ఎస్ నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. వారికి మూడున్నరేళ్లయినా ఉపాధి కల్పించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, పెద్దలు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కలిసికట్టుగా కృషి

- చరిత్రను చూసే వరంగల్‌కు ప్రాధాన్యత
- ప్రజలకు అందుబాటులో ఉండేందుకే కలెక్టరేట్ల సముదాయం
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



**మన తెలంగాణ**/ఎన్‌జిఒస్ కాలనీ: చరిత్రను చూసే వరంగల్ నగరానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగానే ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని నిర్మిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం అర్బన్ కలెక్టరేట్ ప్రాంగణంలో రూ.35.38 కోట్లతో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ కలెక్టర్ భవన సముదాయానికి కడియంతో పాటు స్పీకర్ మధుసూదనాచారి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఆలోచనల మేరకు జిల్లా అభివృద్ధికి అంతా కలిసికట్టుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం వరంగల్ నగరానికి రూ.300 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుందని, ఇవికాకుండా స్మార్ట్ సిటీ, హృదయ్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలతో వరంగల్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి శ్రమిస్తున్నారన్నారు. స్పీకర్ మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు సిఎం కంకణబద్ధుడై ఉన్నారన్నారు. కాకతీయ రాజుల పరిపాలనను ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్, కలెక్టరేట్ భవన సముదాయాన్ని ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. మరో మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన మూడున్నరేళ్లలోనే రాష్ట్రం దేశంలో మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి వినోద్‌కుమార్, లక్ష్మీ కాంతారావు, ఎంఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు దాస్యం వినయభాస్కర్, రమేశ్, కొండా సురేఖ, రాజయ్య, ధర్మారెడ్డి జడ్‌పి చైర్‌పర్సన్లు గద్దల పద్మ, తుల ఉమ, కార్పొరేషన్ల చైర్మన్లు, కలెక్టర్ అమ్రపాలి, పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శృతిఓజా తదితరులున్నారు.

# జైల్లశాఖపై అనినీతి నిరూపిస్తే 10వేల నజరానా

- జైళ్ల శాఖ డిజి వికె సింగ్

**మన తెలంగాణ**/హైదరాబాద్/మాదన్నపేట్: దేశంలోనే అవినీతి రహిత శాఖగా తెలంగాణ జైళ్ల శాఖ పేరు గడించిందని తెలంగాణ జైళ్లశాఖ డిజి వినయ్‌కుమార్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. జైళ్ల శాఖ అవినీతిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే రూ. 10వేల నజరానా ఇస్తామన్నారు. గతంలో ఈ నజరానా రూ.5వేలు ఉండేదని, దీనిని రూ.10వేలకు పెంచామన్నారు. నేరరహిత సమాజం కోసం జైళ్ల శాఖ అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. అందులో జైళ్లశాఖను అవినీతి రహిత శాఖగా తీర్చిదిద్దడానికి చేసిన కృషి ఫలించిందన్నారు. అవినీతి రహిత శాఖ కోసం ఓ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విభాగానికి 2015లో 90 ఫిర్యాదులు రాగా, 2016లో 20, 2017లో12 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదులను స్వీకరించి ముగ్గురిపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన ముగ్గురికీ రూ.5వేల నజరానా అందించినట్లు ఆయన వివరించారు.



# సామాజిక మార్పు కోసమే జనసేన ఆవిర్భావం



**మన తెలంగాణ**/ఖమ్మం: సామాజిక మార్పు కోసమే జనసేన ఆవిర్భవించిందని పవన్ కల్యాణ్ తెలిపారు. తమ సమస్యలపై ప్రజలే ప్రభుత్వాలను ప్రశ్నించే విధంగా చేయడమే జనసేన లక్ష్యమన్నారు. ఖమ్మం జిల్లాలో బుధవారం జరిగిన జనసేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మాట్లాడారు. భద్రాద్రి రాముని ఆశీస్సులతో ఖమ్మం జిల్లాకు వచ్చానని మానవత్వంతో కూడిన రాజకీయాలు చేస్తానని ఎవరు విమర్శించినా, దాడులు చేసినా ప్రజల కోసం సహిస్తానన్నారు. కొద్ది రోజుల్లోనే జనసేన రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభావం చూపనుందని మొత్తం రాజకీయాలను ప్రభావితం చేస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. సమర్థులైన యువత రాజకీయంగా ఎదిగేందుకు సహకరిస్తానన్నారు. ఖమ్మం జిల్లాలో ఉపాధి కల్పన, నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యపై పోరాడుతానన్నారు. అంతకుముందు మండల కేంద్రమైన తల్లాడలో పవన్ ప్రసంగిస్తుండగా అభిమానులు పూల వర్షం కురిపించారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి పవన్‌పైకి చెప్పు విసిరాడు. అది కారుపై పడడంతో ఎవరూ పట్టించుకోలేదు. అనంతరం ఎంబి గార్డెన్‌లో జరిగిన నల్లగొండ, వరంగల్లు, ఖమ్మం జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పవన్ మాట్లాడుతూ ఏం జరిగినా ప్రజల సమస్యల పరిష్కారం కోసం జనసేన కృషి చేస్తుందన్నారు. దీనికి ముందు జనసేన ర్యాలీ కొత్తగూడెం నుంచి బయల్దేరి జూలూరుపాడు, ఏన్కూరు, తల్లాడ, వైరా మీదుగా ఖమ్మం చేరుకుంది.

## ఎంపి, ఎంఎల్‌ఎల పేరు చెప్పి నిరుద్యోగులకు టోకరా

**మన తెలంగాణ**/మిర్యాలగూడ: తాము ప్రజాప్రతినిధుల పిఎలమంటూ నమ్మబలికి నిరుద్యోగులను నమ్మించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ హనుమాన్‌పేటకు చెందిన భూక్యా హరి, రమావత్ శంకర్ తాము ఎంపి, ఎంఎల్‌ఎల వద్ద పనిచేస్తున్నామని, ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి నిరుద్యోగులైన సతీష్, కిశోర్, నెహ్రూ, ఖాదర్‌ల వద్ద రూ.5.80 లక్షలు వసూలు చేశారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు లేకపోవడంతో అనుమానించి వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా అధికార పార్టీ ఎంఎల్‌సి వద్ద పనిచేస్తున్న డ్రైవర్ సహాయంతో ఉద్యోగాల పైరవీ చేసినట్టు వివరించినట్లు తెలిసింది. అదే విధంగా మరో 10మంది వద్ద సుమారు రూ.10 లక్షలు వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా హరి గతంలో ఎంఎల్‌ఎ భాస్కర్ వద్ద పిఎగా పని చేశారు. విచారణ నిమిత్తం వీరిని హైదరాబాద్‌కు పోలీసులు తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**మన తెలంగాణ**/వెంకటాపూర్: వరంగల్ జిల్లా ములుగు మండలంలోని మల్లంపెల్లి గ్రామ పరిధిలో భవానిస్కూల్ వద్ద బుధవారం ఆటో కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోల ఉన్న ముగ్గురిలో ఇద్దరు మృతి చెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా మేడారం జాతర వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై ములుగు పోలీస్‌లు విచారణ చేస్తున్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**మన తెలంగాణ**/సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఎగుర్ల ఎల్లయ్య (55) అనే రైతు బుధవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్లయ్య వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా నష్టపోవడంతో పాటు అప్పులు పెరిగాయి. వాటిని తీర్చే మార్గంలేక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సామాజిక తెలంగాణే ధ్యేయంగా నూతన పార్టీ : చంద్రకుమార్

**మన తెలంగాణ**/సూర్యాపేట: సామాజిక తెలంగాణే ధ్యేయంగా అన్ని వర్గాలతో కలిసి పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రజల జీవితాలలో ఎలాంటి మార్పులు లేకపోవడంతో రాష్ట్రంలో మరో ప్రత్యామ్నాయ పార్టీకి పూనుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ కార్యాచరణలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రణాళికలకు ఎటువంటి వ్యత్యాసం లేదని, దొందూ దొందే అని ఎద్దేవా చేశారు. ప్రొ. కోదండరామ్ ఏర్పాటు చేసే పార్టీకి కూడా కాంగ్రెస్‌లో భాగమేనని ఆరోపించారు. సామాజిక తెలంగాణే ధ్యేయంగా ఏర్పాటు చేయబోయే తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యవసాయేతర రంగాలకు ప్రాధాన్యతనివ్వడంతో పాటు అవినీతి రహిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఫిబ్రవరి రెండో వారంలో పార్టీ జెండా, ఎజెండాతో అన్ని జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

Dwaraka



## దెయ్యాలనే పారద్రోలే మాంత్రికుడిగా...



టాలీవుడ్‌లో విలన్‌గా కబీర్‌దుహాన్ సింగ్ మంచి పేరుతెచ్చుకున్నాడు. 'జిల్ మూవీలో విలన్‌గా అదరగొట్టేసిన అతనికి ఆతర్వాత మంచి ఆఫర్లు వస్తున్నాయి. అయితే వరుసగా విలన్ పాత్రలు, నెగటివ్ క్యారెక్టర్ చేస్తుండడంతో బోర్ కొట్టేసిందని ఇటీవల కబీర్‌దుహాన్ సింగ్ చెప్పాడు. ఇతర భాషల నుండి వస్తున్న సినిమా ఆఫర్లు కూడా ఇదేవిధంగా ఉంటున్నాయట. తనకు ఓ పాజిటివ్ క్యారెక్టర్‌లో నటించాలని ఉందని ఆయన అన్నాడు. అయితే ఇప్పుడు రాబోతున్న '9' మూవీ మాత్రం అతని కోరికను తీర్చనుందట. తొలిసారిగా నెగటివ్ పాత్ర కాకుండా పాజిటివ్‌గా ఉండే ఓ భూతాల మాంత్రికుడి పాత్రలో కబీర్‌దుహాన్ సింగ్ కనిపించబోతున్నాడట. హార్రర్, థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న '9' చిత్రాన్ని కొత్త దర్శకుడు అశ్వనికుమార్ తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా గురించి కబీర్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో నా క్యారెక్టర్ వినగానే వెంటనే నచ్చేసింది. ఓ ఇంట్లో ఉండే దెయ్యాలను బయటకు పారద్రోలే మాంత్రికుడి పాత్రను పోషిస్తున్నాను. ఈ చిత్రం నటుడిగా నాకు మంచి పేరు తెస్తుంది. ఈ సినిమా తర్వాత ఇటువంటి మరిన్ని పాత్రలు రావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా కథ ఆసక్తికరంగా ఉంటుంది. ప్రేక్షకులకు థ్రిల్‌ను కలిగించే చిత్రమిది"అని చెప్పారు.

# బన్నీ పాట సైనికులకు అంకితం

అల్లు అర్జున్, అను ఇమాన్యుయల్ హీరోహీరోయిన్లుగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బన్నీవాసు సహ నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడ రామానాయుడు స్టూడియోలో ఫైట్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ "గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సైనికులపై వచ్చే హీరో పరిచయ పాటను శుక్రవారం విడుదల చేయబోతున్నాం. సైనికులకు ఈ పాటను అంకితమిస్తున్నాం. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాట విన్నాకు నాకు రోమాలు నిక్కబొడుచుకున్నాయి. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ మంచి ట్యూన్స్ అందించారు. బన్నీ కోసం ఈ సినిమా చేశామన్నారు. అంతే ఎనర్జిటిక్‌గా ఈ మ్యూజిక్ అందించారు. ఇందులో ఐదు పాటలున్నాయి. బన్నీ అభిమానులు, ప్రేక్షకులకు పాటలు బాగా నచ్చుతాయి. ఇక పీటర్ హెయిన్స్ ఆధ్వర్యంలో బన్నీపై ఫైట్‌ని చిత్రీకరిస్తున్నాం. గురువారం వరకు ఈ ఫైట్‌ను షూట్ చేస్తాం. కథ, కథనం, పాటలలాగే ఫైట్స్ కూడా సినిమాలో హైలైట్ అవుతాయి. పాటలలాగే ఫైట్స్‌ను కూడా ఒక్కొక్కటి విడుదల చేయాలని భావిస్తున్నాం. అలాగే సినిమాలోని మరో పాటను ఫిబ్రవరి 14న విడుదల చేస్తాం. ఓ సైనికుడికి తన కుటుంబంతో, ప్రియురాలితో, సమాజంతో, కెరీర్‌తో సాగే సంఘర్షణే ఈ చిత్ర కథ. ఇలాంటి కథ ఇంతవరకు తెలుగులో రాలేదు. భారీ బడ్జెట్‌తో ఏవిధంగానూ రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ప్రేక్షకుల అంచనాలను మంచి సినిమా ఉంటుంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 27న సినిమాను విడుదల చేస్తాం"అని అన్నారు. గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ "సినిమా టైటిల్ వినగానే నా రోమాలు నిక్కబొడిచాయి. ఎన్నో బ్లాక్‌బస్టర్స్ చిత్రాలకు కథ అందించిన వక్కంతం వంశీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రచయితగా ఆయన అందించిన చిత్రాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఇందులో నేను నాలుగు పాటలు రాశాను. పాటలన్నీ సందర్భానుసారంగా ఉంటాయి. గత ఏడాది 'జనతాగ్యారేజ్' చిత్రంలోని ప్రణామం... పాటకు ఎన్ని అవార్డులు వచ్చాయో ఇందులో సైనికులపై వచ్చే పాటకు అన్ని అవార్డులు వస్తాయని ఆశిస్తున్నాను"అని చెప్పారు.



అల్లు అర్జున్



లావణ్య త్రిపాఠి, సాయిధరమ్‌తేజ్, వి.వి.వినాయక్, సి.కళ్యాణ్

# ఇంటిలిజెంట్‌గా హిట్ కొడతాం

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి. పతాకంపై వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సి.కళ్యాణ్ మాట్లాడుతూ "మాస్ ఎంటర్‌టైనర్‌గా 'ఇంటిలిజెంట్' చిత్రం ఉంటుంది. ఫ్యామిలీలకు కూడా నచ్చుతుంది. నేను గర్వంగా చెప్పుకునే సినిమా ఇదవుతుంది. సినిమాలో తేజ్ డ్యాన్స్‌లు, ఫైట్స్ బాగా చేశాడు. వినాయక్ ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ ఎలిమెంట్స్‌తో ఎనర్జిటిక్‌గా సినిమా ఉంటుంది. ఇంటిలిజెంట్‌గా వస్తున్నాం. ఇంటిలిజెంట్‌గా హిట్ కొడతాం"అని అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ "సి.కళ్యాణ్ బ్యానర్‌లో ఈ సినిమా చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన నిర్మాతగా అనిపించలేదు. మా అన్నయ్యలాగా అనిపించారు. 'కృష్ణ' సినిమాలాగా ఇందులోనూ అన్ని అంశాలు ఉంటాయి. తేజ్ చాలా బాగా చేశాడు. 'కొండవీటి దొంగ'లోని చమక్కు చమక్కు... పాటను ఇందులో రీమిక్స్ చేశాం. తేజ్ వేసిన స్టెప్పులు చూస్తే చాలా ఆశ్చర్యంగా అనిపించింది. శివ ఆకుల మంచి కథ ఇచ్చారు. చిత్రంలో లావణ్య గ్లామరస్‌గా కనిపిస్తుంది. తమన్ సంగీతం సినిమాకు హైలైట్‌గా ఉంటుంది" అని తెలిపారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడుతూ "సినిమా ఎప్పుడు మొదలుపెట్టామో... ఎప్పుడు అయిపోయిందో తెలియదు. 'ఖైదీ నంబర్ 150' తర్వాత వినాయక్ నాతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. డబ్బింగ్‌లో కొన్ని సీన్లు చూసి షాక్ అయ్యాను. నేనేనా చేసింది అని అనిపించింది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో లావణ్య త్రిపాఠి, శివ ఆకుల, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.



అశోక్

# అవి అనుష్కలో మాత్రమే కనిపించాయి

*యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌లో అనుష్క టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'భాగమతి'. అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్‌లు ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శకుడు అశోక్‌తో ఇంటర్వ్యూ...*

### అందరికీ నచ్చడంతో...

ఈ సినిమా కథను 2012లో యువి క్రియేషన్స్ వారికి చెప్పాను. ఆతర్వాత ప్రభాస్‌కు వినిపించాను. వారి సహాయంతో అనుష్కకు కూడా చెప్పాను. అందరికీ నచ్చడంతో ఈ సినిమా చేద్దామనుకున్నాం.

### 'బాహుబలి'కి ముందే...

'బాహుబలి' మొదటి పార్టు ప్రారంభానికి ముందే ఈ కథను అనుష్కకు చెప్పడం జరిగింది. ఆ సినిమా షూటింగ్‌కు వెళ్లకముందే ఆమె ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నారు. అయితే అప్పటికే బాహుబలి చిత్రానికి ఆమె కమిట్‌మెంట్ ఇచ్చి ఉండటం వలన కొంతకాలం ఆగాల్సి వచ్చింది. మధ్యలో రెండుసార్లు మొదలుపెడదామని చూసినా వీలుకాలేదు.

### ఎక్కడైనా హిట్ అవుతుంది...

ఓ యూనివర్సల్ సబ్జెక్ట్‌తో 'భాగమతి'ని తెరకెక్కించాం. ఈ సినిమా ఏ చిత్ర పరిశ్రమలోనైనా హిట్ అవుతుంది. ఇందులోని కథ ప్రతి చోటా జరిగేదే, అందరికీ పరిచయమైందే.

### అందుకే కొంతకాలం ఆగాము...

ఈ చిత్రం చేయడానికి ఓ మంచి నటి కావాలనుకున్నాం. ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ ఉన్న తారను తీసుకోవాలనుకున్నాం. అవి అనుష్కలో మాత్రమే కనిపించాయి. అందుకే ఆమె తప్ప ఈ కథకు ఎవరూ న్యాయం చేయలేరనిపించి కొంతకాలం ఆగి ఈ సినిమాను రూపొందించాం.

### ఎంతగానో కష్టపడ్డారు...

అనుష్క లేకపోతే ఈ ప్రాజెక్ట్ లేదు. సినిమా సన్నివేశాల కోసం ఆమె ఎంతగానో కష్టపడ్డారు. ఎడమ చేతి భుజం గాయం బాధపెడుతున్నా, డస్ట్ ఎలర్జీ ఉన్నా వేటినీ లెక్కచేయకుండా ఆమె షూటింగ్‌లో పాల్గొన్నారు.

### భారీ బంగ్లా సెట్...

సినిమా కోసం ఓ భారీ బంగ్లా సెట్ వేశాం. అది ఒక సెట్ మాత్రమే కాదు... కథలో ఓ క్యారెక్టర్ కూడా. దాని చుట్టూనే కథ తిరుగుతుంది. కథకు అనుగుణంగా భారీ బంగ్లా సెట్‌ను నిర్మించడం జరిగింది. 75 శాతం సినిమా అందులోనే జరుగుతుంది.

### స్క్రీన్‌ప్లే బెస్ట్ మూవీ...

ఇది లేడీ ఓరియెంటెడ్ మూవీ కాదు. స్క్రీన్‌ప్లే బెస్ట్ మూవీ. ఈ సినిమాకు అదే బలం. అనుష్క కెరీర్‌లో ఇది ఓ మరపురాని చిత్రంగా నిలుస్తుంది.

# టచ్ చేసి చూడు

రవితేజ హీరోగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహ ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్, వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రాశీఖన్నా, సీరత్‌కపూర్ కథానాయికలు. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకొని యు/ఎ సర్టిఫికెట్‌ను పొందింది. ఫిబ్రవరి 2 ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు నల్లమలుపు శ్రీనివాస్, వల్లభనేని వంశీ మాట్లాడుతూ "సినిమా సెన్సార్ పూర్తిచేసుకొని యు/ఎ సర్టిఫికెట్ పొందింది. ఈ వారంలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహిస్తాం. ఇటీవల సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన పాటలు, టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. రవితేజ చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారని అందరూ ప్రశంసిస్తున్నారు. అతని ఇమేజ్‌కు తగ్గట్టుగా రచయిత వక్కంతం వంశీ అద్భుతమైన కథను తయారుచేశారు. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలకానుంది"అని అన్నారు.



రాశీ ఖన్నా



# ఇట్లు...అంజలి

కార్తికేయ, హిమాన్సీ, శభాంగి పంత్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్లు... అంజలి'. వొూమా ప్రొడక్షన్స్ పతాకంపై నవీన్ మన్నెల స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను హైదరాబాద్ సారథి స్టూడియోలో సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సినిమా టైటిల్ ఎంతో బాగుంది. హీరో కార్తికేయ చాలా కాలం నుంచి తెలుసు. అతను ఈ చిత్రంతో హీరోగా పరిచయం కావడం సంతోషంగా ఉంది"అని అన్నారు. చిత్ర దర్శక నిర్మాత నవీన్ మన్నెల మాట్లాడుతూ "లవ్ లెటర్ బ్యాక్‌డ్రాప్‌లో కథ సాగుతుంది. పాటలకు మంచి సాహిత్యం, చక్కని ట్యూన్స్ కుదిరాయి"అని పేర్కొన్నారు. హీరో కార్తికేయ మాట్లాడుతూ "ఓ అమ్మాయి ప్రేమ లేఖ చుట్టూ సాగే సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. కథనం ఆసక్తికరంగా సాగుతుంది. మాటలు, పాటలు హైలైట్‌గా ఉంటాయి. తెలుగు ప్రేక్షకులకు నచ్చే సినిమా ఇదవుతుంది"అని చెప్పారు. హీరోయిన్ హిమాన్సీ మాట్లాడుతూ "వైవిధ్యమైన ప్రేమకథా చిత్రమిది. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇది"అని తెలిపారు.

# అలనాటి మేటి తార కృష్ణకుమారి కన్నుమూత

అలనాటి అందాల తార కృష్ణకుమారి కన్నుమూశారు. ఆమె వయసు 83 సంవత్సరాలు. గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆమె బెంగుళూర్‌లోని తన నివాసగృహంలో తుది శ్వాస విడిచారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషా చిత్రాల్లో కృష్ణకుమారి కథానాయికగా విభిన్న పాత్రలు పోషించారు. ప్రముఖ నటి షావుకారు జానకి చెల్లెలు అయిన ఆమె 110కి పైగా చిత్రాల్లో నటించారు. నాటి స్టార్ హీరోలు ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, కాంతారావు సహా పాతతరం అగ్రహీరోలు అందరితోనూ కలిసి నటించి అగ్ర కథానాయికగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో మహా నటి సావిత్రి తర్వాత అంతటి క్రేజ్‌ను సంపాదించుకున్న ప్రముఖ నటిగా కృష్ణకుమారి గుర్తింపు తెచ్చుకున్నారు. తన అందంతో పాటు నటనా ప్రతిభతో ఆకట్టుకొని ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ప్రముఖ నటి కృష్ణకుమారి. 60వ దశకంలో వచ్చిన ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన ఆమె ప్రముఖ తారగా ఓ వెలుగు వెలి గారు. పశ్చిమ బెంగాల్‌లోని నౌహతిలో 1933 సంవత్సరం మార్చి 6న బ్రాహ్మణ కుటుంబం లో కృష్ణకుమారి జన్మించారు. ఆమె తండ్రి ఆకాలంలో పశ్చిమ బెంగాల్‌లో ఉద్యోగం చేస్తుండేవారు. ఆతర్వాత ఆయనకు ఎప్పుడూ బదిలీలు అవుతుండటంతో కృష్ణకుమారి విద్యాభ్యాసం రాజమండ్రి, చెన్నై, అస్సాం, కోల్‌కతాలో జరిగింది.

### అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా...

1951లో 'నవ్వితే నవరత్నాలు' చిత్రం ద్వారా కృష్ణకుమారి కథానాయికగా తెరంగేట్రం చేశారు. 16 సంవత్సరాల వయసులోనే సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె తొలి చిత్రంలో చేస్తుండగానే మరో 14 సినిమాల్లో అవకాశాలు రావడం విశేషం. ఎన్టీఆర్, ఏఎన్నార్, జగ్గయ్య, ఎస్వీఆర్, కాంతారావులాంటి దిగ్గజాలతో మరపురాని ఎన్నో సినిమాల్లో ఆమె నటించారు. అనతికాలంలోనే స్టార్ హీరోయిన్‌గా రాణించారు. పిచ్చి పుల్లయ్య, కులగోత్రాలు, చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి, ఆప్తమిత్రులు, బందిపోటు, చిక్కడు దొరకడు, అంతస్తులు, కుల గోత్రాలు, గుడి గంటలు వంటి మరపురాని ఆణిముత్యాలు ఆమె కీర్తి కిరీటంలో ఉన్నాయి. ఇవేగాకుండా భార్యభర్తలు, పునర్జన్మ, ఇరుగు పొరుగు, కలవారి కోడలు, అగ్గి పిడుగు, లక్షాధికారి, ఉమ్మడి కుటుంబం, వరకట్నం, కానిస్టేబుల్ కూతురు, జ్వాలాద్వీప రహస్యం, భువన సుందరి కథ, చిక్కడు దొరకడు, స్త్రీ జన్మ, పెద్దక్కయ్య, మా వదిన, చిలక గోరింక, ఉయ్యాల జంపాల, ఆడపడుచు వంటి చిత్రాలు కృష్ణకుమారిని ఎప్పటికీ గుర్తుండేలా చేశాయి. ఇక కన్నడంలో కూడా ఆమె 15 సినిమాల్లో నటించారు. తమిళంలో కొన్ని చిత్రాలు చేసిన అక్కడ ఆమె ఇమడలేక ఎక్కువ సినిమాలు చేయలేదు.



కృష్ణకుమారి

### వివాహానంతరం సినిమాలకు దూరం...

1969లో బెంగుళూర్‌కు చెందిన వ్యాపారవేత్త అజయ్‌మోహన్‌ని వివాహం చేసుకున్నారు. వారిది ప్రేమ వివాహం. వీరికి దీపిక అనే కుమార్తె ఉన్నారు. పెళ్లయిన తర్వాత సినిమాలు తగ్గించుకున్న కృష్ణకుమారి పూర్తిగా కుటుంబ జీవితానికే అంకితమయ్యారు. సినిమాలు మానేసిన ఆమె ఆతర్వాత అడపాదడపా కొన్ని సినిమాల్లో అతిథి పాత్రలు పోషించినప్పటికీ నటించేందుకు ఎక్కువ ఆసక్తి చూపించలేదు. కాంచన తరహాలో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రీ ఎంట్రీ ఇవ్వాలనే ఆలోచన చేశారు కానీ ఆరోగ్యం సహకరించక ఆ ఆలోచన మానుకున్నారు.

### దక్కిన అవార్డులెన్నో...

ప్రముఖ నటి భానుమతికి కృష్ణకుమారి అభిమాని. ఆమెతో కలిసి కుల గోత్రాలు, పుణ్యవతి చిత్రాల్లో నటించారు. ఇక సావిత్రి అయితే కృష్ణకుమారిని చెల్లెలిగా చూసుకునేవారట.



ఎన్‌టిఆర్‌తో...



ఏఎన్ఆర్‌తో...



కాంతారావుతో...

ఆ మహానటితో మంచి అనుబంధం ఉండేది. అగ్ర కథానాయికగా ఎంతో పేరుతెచ్చుకున్న కృష్ణకుమారి మూడు సార్లు జాతీయ అవార్డులను అందుకున్నారు. అదేవిధంగా నంది అవార్డులతో పాటు కాంచనమాల, సావిత్రి, ఎన్టీఆర్ అవార్డులు ఆమెకు దక్కాయి.

### ప్రముఖుల సంతాపం...

ప్రముఖ నటి కృష్ణకుమారి మృతిపట్ల తెలుగు సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఆమె మరణం పట్ల నందమూరి బాలకృష్ణ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ "మా నాన్నగారు ఎన్.ఏ.టి. సంస్థలో తొలిసారి స్వయంగా నిర్మించిన 'పిచ్చి పుల్లయ్య' (1953) చిత్రంలో కృష్ణకుమారి హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమాతో సహా దాదాపు పాతిక సినిమాల్లో ఆమె నాన్నగారి సరసన కథానాయికగా చేశారు. దేవాంతకుడు, బందిపోటు, ఉమ్మడి కుటుంబం, వరకట్నం వంటి విజయవంతమైన చిత్రాల్లో నాన్నగారితో జంటగా ఆమె నటించారు. అటువంటి మేటి నటీమణి నేడు మన మధ్య లేకపోవడం బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని కోరుకుంటున్నాను"అని అన్నారు. కృష్ణకుమారి మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని డా.మంచు మోహన్‌బాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ "నేను కృష్ణకుమారితో కలిసి నటించకపోయినా ఆమెతో పాటు ఆమె కుటుంబంతోనూ మంచి అనుబంధం ఉంది. మా అన్నగారు ఎన్టీఆర్‌తో కలిసి ఆమె ఎక్కువ సినిమా చేయడం పట్ల ఆవిడతో నాకు మంచి పరిచయం ఏర్పడింది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను"అని తెలిపారు. ఇక కృష్ణకుమారి మృతికి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ మంచి నటిగా ఆమె ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని 'మా' అధ్యక్షుడు శివాజీరాజా, ప్రధాన కార్యదర్శి వి.కె.నరేష్ తెలిపారు.



వివిధ క్యారెక్టర్లలో...

మన తెలంగాణ
9
హైదరాబాద్
గురువారం
25, జనవరి 2018
www.manatelangana.news



## తొలి వాహనంగా 'ఎలక్ట్రిక్'ను కోరుకుంటున్నాం

**దావోస్ :** భారత్‌లో 80 శాతం మంది ప్రజలకు ఇప్పటివరకు సొంత వాహనం లేదని, వారు తొలి వాహనం 'ఎలక్ట్రిక్'ది అయి ఉండాలని కోరుకుంటున్నామని కేంద్రమంత్రి పియూష్ గోయల్ పేర్కొన్నారు. ఆయన ఇక్కడ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో నిర్వహించిన 'డిజైనింగ్ ఫర్ స్మార్ట్ మొబిలిటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల్లో ప్రతి ఒక్కరికీ సొంత వాహనం ఉంటుందని, భారత్ వంటి దేశాల్లో ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితిలో వృద్ధి కనిపిస్తోందన్నారు. భారత జనాభాలో ఇప్పటికీ 80 శాతం మందికి సొంత వాహనాలు లేవని, అలాంటివారి తొలి వాహనం ఎలక్ట్రిక్ వాహనం కావాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు. దేశంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగం శరవేగంగా వృద్ధి చెందుతోందని చెప్పారు. సౌరవిద్యుత్ వినియోగంలో గత 3.5 ఐదేళ్లలో 6 రెట్ల వృద్ధిని సాధించామని, 2022 నాటికి 10 గిగావాట్ల ఉత్పత్తిని అందుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో ఎల్‌ఇడి బల్బులను వినియోగంలోకి తెచ్చేందుకు 2015లో పెద్దఎత్తున ప్రచారం చేపట్టామని, 800 మిలియన్ బల్బులను వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు. ప్రతి కుటుంబానికి ఎల్పీజీ ఉండాలన్న ఉద్దేశంతో గత మూడేళ్లలో 3.5 లక్షల కనెక్షన్లను అందజేశామని తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వం భారత్ ప్రత్యేకత అని ఆయన అన్నారు.

# ప్రభుత్వరంగ బ్యాంకులకు 88,139 కోట్ల మూలధనం



### ప్రణాళికను ప్రకటించిన ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** ముందు నుంచి చెప్పినట్టుగానే ప్రభుత్వరంగ బ్యాంకులకు మూలధన నిధిని ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 20 ప్రభుత్వరంగ బ్యాంకులకు(పిఎస్‌బి) రూ.88,139 కోట్ల మూలధన నిధిని అందిస్తున్నట్టు కేంద్ర వెల్లడించింది. దీనిలో రిక్యాపిటైజేషన్ బాండ్ల ద్వారా రూ.80 వేల కోట్లు, బడ్జెటరీ కేటాయింపుల ద్వారా రూ.8,139 కోట్లు అందివ్వనుంది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులకు కేంద్ర బిగ్ బూస్ట్ అందించింది. ఈ రీక్యాపిటలైజేషన్‌ను బ్యాంకుల పనితీరు ఆధారంగా చేసుకుని అందించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆరోగ్యకరంగా ఉంచడమే తమ ముఖ్యమైన బాధ్యత అని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. బ్యాంకులకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డిఐ) పరిమితిని పెంచే ప్రతిపాదనేమీ లేదన్నారు. వచ్చే రెండేళ్లలో మొండిబకాయిలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.2.11 లక్షల కోట్లు ఇవ్వనున్నట్టు జైట్లీ గతేడాదే ప్రకటించిన సంగతి తెలిసిందే. 2017 అక్టోబర్‌లో ప్రకటించిన అతిపెద్ద బ్యాంకు రీక్యాపిటలైజేషన్ ప్రణాళిక వివరాలను బుధవారం వెల్లడించింది. మొండిబకాయిలను సమస్యపై పోరాటమే లక్ష్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆరోగ్యకరంగా ఉంచేందుకు కేంద్రం ఈ ప్రణాళికను ఆవిష్కరించింది.




ఈ ప్లాన్‌లో భాగంగా తొలుత రూ.88,139 కోట్ల మూలధనాన్ని పిఎస్‌బిల్లో జొప్పించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వాటిలో భాగంగా ఎస్‌బిఐకి రూ.8,800 కోట్లు, ఐడిబిఐకి రూ.10,610 కోట్లు, పిఎన్‌బికి రూ.5,740 కోట్లు, బిఒబికి రూ.5,375 కోట్లు, కెనరా బ్యాంకుకు రూ.4,865 కోట్లు ఉన్నాయి. ఇంకా యూనియన్ బ్యాంకుకు రూ.4524 కోట్లు, సిండికేట్ బ్యాంకు రూ.2,839 కోట్లు, ఆంధ్రాబ్యాంకుకు రూ.1,890 కోట్లు, విజయ్ బ్యాంకుకు రూ.1,277 కోట్లు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకుకు రూ.785 కోట్లు, బ్యాంకు ఆఫ్ ఇండియాకు రూ.9,232 కోట్లు, యుసిఒకు రూ.6,507 కోట్లు, ఐఒబికి రూ.4,694 కోట్లు, ఒబిసికి రూ.3,571 కోట్లు, దేనా బ్యాంకుకు రూ.3,045 కోట్లు, బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రకి రూ.3,173 కోట్లు, యునిటెడ్ బ్యాంకుకు రూ.2,634 కోట్లు, కార్పొరేషన్ బ్యాంకుకు రూ.2,187 కోట్లు, అలహాబాద్ బ్యాంకుకు రూ.1,500 కోట్లు లభించనున్నాయి. మార్చి నాటికి భారతీయ బ్యాంకుల్లో స్థూల ఎన్‌పిఎ రూ.9.5 లక్షల కోట్లకు పెరగనున్నాయని ఇటీవల అసోచామ్–క్రిసిల్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం తెలిపింది. 2016 మార్చి నాటికి బ్యాంకుల మొండి బకాయిలు రూ.8 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే మార్చినాటికి రూ.1.5 లక్షల కోట్లు పెరిగి రూ.9.5 కోట్లకు చేరనుందని నివేదిక వివరించింది. రుణాలు ఎగవేసిన సదరు కంపెనీ యాజమాన్య హక్కులను బదాలయించుకునే అవకాశం బ్యాంకులకు లభిస్తోంది. అయితే రుణాల్లో చాలా వరకు ఎన్‌పిఎ రూపంలో ఉంటే బ్యాంకుల మూలధనంపై ఒత్తిడి పెరుగుతోంది. మార్చి 2018 నాటికి మొత్తం రుణాల్లో 10.5 శాతం ఎన్‌పిఎలు ఉన్నాయి. వీటికి ఎన్‌పిఎలుగా మారడానికి సిద్ధంగా ఉన్న ఆస్తులను కూడా కలిపితే రూ.11.5 లక్షల కోట్లకు చేరతాయని సర్వే తెలిపింది.

### 2018లో మొండిబకాయిలు తగ్గుతాయి



బ్యాంకింగ్ రంగానికి గుదిబండగా మారిన మొండి బకాయిలు 2018లో గణనీయంగా తగ్గుముఖం పట్టనున్నాయని ఎస్‌బిఐ(స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా) చైర్మన్ రజనీష్ కుమార్ పేర్కొన్నారు. దివాలా చట్టం అమలులోనికి రావడం వల్ల నిరర్థక ఆస్తులు(ఎన్‌పిఎ) భారం తగ్గిపోయేందుకు అవకాశముందని స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో మీడియా ఇంటర్వ్యూలో ఆయన ఈవిధంగా తెలిపారు. లిక్విడేషన్, రెసెల్యూషన్ మార్గాల ద్వారా రుణదాతలు తాము ఇచ్చిన మొత్తాన్ని రుణగ్రహీతల నుంచి వసూలు చేసుకోవడానికి దివాలా చట్టం పూర్తి వెసులుబాటును ఇస్తున్న నేపథ్యంలో డిసెంబరు త్రైమాసికం నాటికి ఈ సమస్య తగ్గుతుందని తెలిపారు. మొండి బకాయిల ఖాతాలోనికి చేరి, ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారనున్న పలు కంపెనీలను రిజర్వ్ బ్యాంక్ గతేడాదే గుర్తించి వీటి నుంచి వీలైనంత త్వరగా బ్యాంకులు ఇచ్చిన మొత్తాలను వసూలు చేసుకోవాలని సూచించడం లాంటి పరిణామాలు ఎన్‌పిఎల సమస్యను తగ్గించనున్నాయని అన్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2.11 లక్షల కోట్ల రీకాపిటలైజేషన్ కూడా నిరర్థక ఆస్తుల సమస్య నుంచి బ్యాంకింగ్ రంగాన్ని బయటపడేస్తుందని అన్నారు.

| బ్యాంకు పేరు | మూలధనం (రూ.కోట్లు) | బ్యాంకు పేరు | మూలధనం (రూ.కోట్లు) |
|---|---|---|---|
| ఎస్‌బిఐ | 8,800 | ఐడిబిఐ బ్యాంకు | 10,610 |
| పిఎన్‌బి | 5,473 | బ్యాంకు ఆఫ్ ఇండియా | 9,232 |
| బిఒబి | 5,375 | యూకో బ్యాంకు | 6,507 |
| కెనరా బ్యాంకు | 4865 | సెంట్రల్ బ్యాంకు | 5,158 |
| యూనియన్ | 4524 | ఐఒబి | 4,694 |
| సిండికేట్ బ్యాంకు | 2,839 | ఒబిసి | 3,571 |
| ఆంధ్రాబ్యాంకు | 1,890 | దేనా బ్యాంకు | 3,045 |
| విజయ బ్యాంకు | 1,277 | బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర | 3,173 |
| పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు | 785 | యునైటెడ్ బ్యాంకు | 2,634 |
| | | కార్పొరేషన్ బ్యాంకు | 2,187 |
| | | అలహాబాద్ బ్యాంకు | 15,00 |

మొత్తం రూ.88,139కోట్లు

## రూ.4000లకే షియోమీ రెడ్‌మి 5ఎ





**న్యూఢిల్లీ:** చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ షియోమీ ఫోన్లకు భారత్‌లో ఎంతో క్రేజ్ ఉంది. తాజాగా ఈ సంస్థ రెడ్‌మి 5ఎ ఫోన్‌ను ఆన్‌లైన్ ద్వారా తక్కువ ధరకే అందిస్తోంది. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ ఫోన్‌ను రూ.4 వేలకే అందిస్తున్నట్టు ప్రకటించింది. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని రీటెయిల్ స్టోర్స్ సంస్థ బిగ్ బజార్.. రెడ్‌మీ 5ఎ ఫోన్‌ను రూ.4వేలకే వినియోగదారులకు అందిస్తోంది. తగ్గింపు ధర పొందాలంటే వినియోగదారులు ఫ్యూచర్ పే వాలెట్‌లో నగదు జమ చేసి దాంతో ఈ ఫోన్‌ను కొనాల్సి ఉంటుంది. దీని ద్వారా కొనుగోలు చేస్తే రూ.1000 క్యాష్ బ్యాక్ వస్తుంది. యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను కూడా ఉపయోగించి ఫోన్‌ను కొంటే 10 శాతం అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. ఈ నెల 28వ తేదీ వరకు లేదా స్టాక్ ఉన్నంత వరకు ఈ ఆఫర్ ఉంటుంది. అయితే ఆన్‌లైన్ ద్వారా 2జిబి ర్యామ్ వేరియెంట్ రూ.4,999 ఉండగా ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో రూ.5,499కు విక్రయిస్తున్నారు. ఇక ఇదే ఫోన్‌కు చెందిన 3జిబి ర్యామ్ వేరియెంట్ ఆన్‌లైన్‌లో రూ.6,999కు ధరకు లభిస్తుండగా, ఆఫ్‌లైన్‌లో దీన్ని రూ.7,499 ధరకు విక్రయిస్తున్నారు. అయితే బిగ్ బజార్ నిర్వహిస్తున్న 'రిపబ్లిక్ డే సేల్'లో భాగంగా ఈ ఫోన్‌ను రూ.4వేలకే వినియోగదారులు పొందవచ్చు.

## స్టాక్ మార్కెట్

| ఈరోజు మార్కెట్ | ముగింపు | మార్పు | % |
|---|---|---|---|
| సెన్సెక్స్ | 36161.64 | 21.66 | 0.06% |
| నిఫ్టీ | 11086.00 | 2.30 | 0.02% |

CLOSING SENSEX REPORT




## కరెన్సీ మారక రేట్లు

| | |
|---|---|
| అమెరికన్ డాలర్ | 63.28 |
| యూరో | 76.12 |
| బ్రిటిష్ పౌండ్ | 85.87 |
| ఆస్ట్రేలియన్ డాలర్ | 49.75 |
| కెనెడియన్ డాలర్ | 50.98 |
| ఎమిరైట్ దిర్హామ్ | 17.23 |
| స్విస్ ఫ్రాంక్ | 64.89 |
| చైనీస్ యువాన్ | 9.75 |
| మలేషియన్ రింగిట్ | 15.83 |
| న్యూజిలాండ్ డాలర్ | 45.36 |
| హాంగ్‌కాంగ్ డాలర్ | 8.09 |
| జపనీస్ యెన్ | 0.56 |
| కువైట్ దినార్ | 209.96 |
| సౌతాఫ్రికన్ రాండ్ | 5.14 |

## బులియన్




### బంగారం ధర

| నగరం | ధర (రూ / 10 గ్రాములు) | | |
|---|---|---|---|
| | 22క్యారట్ | 24క్యారట్ | మార్పు(%) |
| చెన్నై | 28870 | 30877.01 | 0.17% |
| ముంబై | 29590 | 31647.06 | 0.31% |
| ఢిల్లీ | 29200 | 31229.95 | 0.34% |
| కోల్‌కతా | 29490 | 31540.11 | 0% |
| కేరళ | 27950 | 29893.05 | 0.36% |
| బెంగళూరు | 28290 | 30256.68 | 0.32% |
| హైదరాబాద్ | 29590 | 31647.06 | 2.53% |
| గల్ఫ్ | 1418.86 | 1517.50 | 0.17% |

### వెండి ధర (రూ./ కిలో)

| నగరం | బుధవారం | మంగళవారం | మార్పు (%) |
|---|---|---|---|
| చెన్నై | 42000.00 | 42000.00 | 0.00 |
| ముంబై | 42000.00 | 42000.00 | 0.00 |
| ఢిల్లీ | 42000.00 | 42000.00 | 0.00 |
| కోల్‌కతా | 42000.00 | 42000.00 | 0.00 |
| హైదరాబాద్ | 42000.00 | 42000.00 | 0.00 |



### కోడిగుడ్లు (100కు) నెక్ రేటు


| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 402 | విశాఖపట్నం | 412 |
| వరంగల్ | 404 | చిత్తూరు | 403 |
| విజయవాడ | 412 | చెన్నై | 410 |
| గోదావరి | 412 | బెంగళూరు | 408 |

## రూ.6 లక్షల కోట్ల మార్క్‌ను దాటిన టిసిఎస్




**న్యూఢిల్లీ :** దేశీయ అతిపెద్ద ఐటీ దిగ్గజం టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) కీలక మైలురాయిని చేరుకుంది. సంస్థ మార్కెట్ విలువ రూ.6 లక్షల కోట్ల మార్క్‌ను క్రాస్ చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న సంస్థ టిసిఎస్ కావడం విశేషం.. బుధవారం మధ్యాహ్నం సమయంలో టిసిఎస్ మార్కెట్ విలువ రూ. 6,12,696.46 కోట్లుగా ఉంది. ఇటీవల రిలయన్స్ కూడా రూ.6లక్షల కోట్ల మైలురాయిని చేరుకుంది. అయితే మార్కెట్ విలువ పరంగా రిలయన్స్‌తో పోలిస్తే టిసిఎస్ దేశంలోనే అత్యంగా విలువ గల సంస్థగా నిలిచింది. రిలయన్స్ మార్కెట్ విలువ రూ.6,11,096.56 కోట్లుగా ఉండగా, టిసిఎస్ విలువ కొంత ఎక్కువగా ఉండడంతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. టిసిఎస్, రిలయన్స్ తర్వాత మూడో స్థానంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ విలువ రూ.5,08,576.16 కోట్లుగా ఉంది. అత్యంత విలువ గలిగిన కంపెనీల జాబితాలో నాలుగు, ఐదు స్థానాల్లో.. ఐటిసి విలువ రూ.3,41,332.79 కోట్లు, హెచ్‌డిఎఫ్‌సి మార్కెట్ విలువ రూ.3,03,382.63 కోట్లు ఉన్నాయి. ప్రస్తుతం బిఎస్‌ఇ, ఎన్‌ఎస్‌ఇలో టిసిఎస్ షేరు విలువ 2.35 శాతం లాభపడిన రూ. 3,175 వద్ద స్థిరపడింది.

## రూ.999లకే స్మార్ట్‌ఫోన్




**న్యూఢిల్లీ:** ఇ–కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌తో ఒప్పందం చేసుకున్న వొడాఫోన్ తాజాగా రూ.999లకే 4జి స్మార్ట్‌ఫోన్‌ను అందిస్తోంది. ఈ ఆఫర్ ఫ్లిప్‌కార్ట్‌లో మాత్రం లభిస్తోంది. మైక్రోమాక్స్, చైనా సంస్థ ఐటెల్ ఈ ఫోన్‌లను తయారు చేశాయి. ప్రస్తుత వొడాఫోన్ ప్రిపెయిడ్ వినియోగదారులకు ఈ ఆఫర్ లభ్యం కానుంది. ఈ ఆఫర్ ఫ్లిప్‌కార్ట్ 'మైఫస్ట్4జి స్మార్ట్‌ఫోన్' క్యాంపెయిన్ కింద ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా క్యాష్‌బ్యాక్ పొందుతారు. ఇందుకు గాను ముందుగా వినియోగదారులు రూ.2999 చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం అందులో 36 నెలల పాటు నెలకు రూ.150 చొప్పున వొడాఫోన్ ప్లాన్‌ను వాడాల్సి ఉంటుంది. దీంతో 18 నెలల అనంతరం వినియోగదారులకు రూ.900 క్యాష్ బ్యాక్ వస్తుంది. అలాగే మరో 18 నెలల అనంతరం రూ.1100 క్యాష్ బ్యాక్ వస్తుంది. దీంతో మొత్తం క్యాష్ బ్యాక్ కలిపి రూ.2వేలు అవుతుంది. ఈ క్రమంలో ఫోన్ ధర రూ.999 అవుతుంది.

## ఇండిగో ఫలితాలు అదుర్స్

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు చెందిన ఇండిగో అద్భుతంగా రాణించింది. సంస్థ నికర లాభం 50 శాతానికి పైగా పెరిగింది. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో ఇండిగో నికర లాభం 56 శాతం పెరిగి రూ. 762 కోట్లకు చేరింది. సంస్థ మొత్తం ఆదాయం 24 శాతం ఎగసి రూ. 6178 కోట్లకు చేరింది. ఇబిటా 59 శాతం పుంజుకుని రూ. 991 కోట్లు అయింది. ఇబిటా మార్జిన్లు 12.5 శాతం నుంచి 16 శాతానికి బలపడ్డాయి. ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్లు వెల్లువెత్తడంతో ఈ షేరు విలువ ఎన్ఎస్ఇలో 5.70 శాతం పెరిగి రూ. 1260 వద్ద స్థిరపడింది. క్యూ3లో రూ.7.6 బిలియన్ల పన్ను తర్వాత లాభం తనను ఎంతో ఆనందానికి గురిచేసిందని ఇండిగో ప్రెసిడెంట్, హోల్ టైమ్ డైరెక్టర్ ఆదిత్య ఘోష్ అన్నారు. ఎటిఆర్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో రీజినల్ సేవలు ప్రారంభిస్తామని, దీంతో దేశవ్యాప్తంగా మరిన్ని పట్టణాలకు సేవలను విస్తరించే అవకాశం ఏర్పడుతుందని ఆయన అన్నారు.




## ఐడియాకు పెరిగిన నష్టాలు

### క్యూ3లో నికర నష్టం రూ.1,284 కోట్లు




**న్యూఢిల్లీ:** టెలికామ్ సంస్థ ఐడియా సెల్యులార్ మూడో త్రైమాసిక ఫలితాల్లో భారీగా నష్టాలను మూటగట్టుకుంది. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన ఐడియా క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో రూ.1,284 కోట్ల నికర నష్టాన్ని నమోదుచేసింది. ఈ నష్టం అంచనాలను మించిపోయింది. దీంతో వరుసగా ఐదు త్రైమాసికాల్లో కంపెనీ నష్టాలను ప్రకటించడం విశేషం. గత ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)లో రూ. 1,107 కోట్ల నష్టాలను ప్రకటించింది. ఆదాయం రూ. 6510 కోట్లకు పరిమితమైంది. నిర్వహణ వ్యయం 18.5 శాతం క్షీణించి రూ.1,223 కోట్లను నమోదు చేసింది. గతేడాది డిసెంబర్‌నాటికి సంస్థ 20.3 కోట్లమంది వినియోగదారులను కలిగి ఉన్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం టెలికాం రంగంలో నెలకొన్న తీవ్ర పోటీ నేపథ్యంలో ఇంటర్ కనెక్షన్, వాయిస్ రేట్ల వాడకంపై ఛార్జీలను భారీగా తగ్గించడం కంపెనీ ఫలితాలపై ప్రభావం చూపాయి. వీటితో పాటు ఇటీవల ట్రాయ్ అంతర్జాతీయ ఇన్‌కమింగ్ కాల్స్ రేట్లను తగ్గించటం కూడా కంపెనీ రెవెన్యూను దెబ్బతీసిందని సంస్థ అధికారులు తెలిపారు. నిరాశజనకమైన ఫలితాలతో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఐడియా షేరు 5.69 శాతం పడిపోయి రూ.93.70 వద్ద ముగిసింది. రిలయన్స్ జియో వచ్చినప్పటి నుంచి సంస్థపై పోటీ ప్రభావం తీవ్రంగా ఉంది. తాజాగా జియో రిపబ్లిక్ డే స్పెషల్ ఆఫర్‌తో ఐడియా షేరు కుదేలైంది. షేరు ఏడాది కనిష్ట, గరిష్ట ధరలు వరుసగా రూ.71.50లు, 123.75లుగా ఉన్నాయి. ఇటీవల భారతీ ఎయిర్‌టెల్ కూడా మూడో త్రైమాసికంలో భారీ నష్టాలను ప్రకటించింది. నికర లాభం 39 శాతం పడిపోయింది. డిసెంబర్ ముగింపు నాటి క్యూ3లో నికర లాభం రూ. 306 కోట్లుగా నమోదైంది.

## టాప్ గెయినర్స్ (+)


| కంపెనీ పేరు | గరిష్టం | కనిష్టం | ముగింపు ధర | క్రితం ముగింపు | మార్పు | లాభం % |
|---|---|---|---|---|---|---|
| ఎస్‌బిఐ | 331.60 | 316.20 | 329.90 | 318.10 | 11.80 | 3.71 |
| గెయిల్ | 494.35 | 471.00 | 484.95 | 470.80 | 14.15 | 3.01 |
| టెక్ మహీంద్ర | 612.45 | 584.15 | 603.15 | 588.25 | 14.90 | 2.53 |
| అదానీ పోర్ట్స్ | 452.35 | 429.10 | 448.75 | 438.40 | 10.35 | 2.36 |
| టిసిఎస్ | 3,259.05 | 3,082.65 | 3,174.60 | 3,102.00 | 72.60 | 2.34 |
| హెచ్‌సిఎల్ టెక్ | 1,040.70 | 992.00 | 1,018.45 | 995.35 | 23.10 | 2.32 |
| లుపిన్ | 962.00 | 933.35 | 959.05 | 937.35 | 21.70 | 2.32 |
| యుపిఎల్ | 828.50 | 803.10 | 824.25 | 807.25 | 17.00 | 2.11 |
| బజాజ్ ఫైనాన్స్ | 1,746.85 | 1,697.05 | 1,739.15 | 1,708.70 | 30.45 | 1.78 |
| ఐటిసి | 282.00 | 276.05 | 281.45 | 276.60 | 4.85 | 1.75 |

## టాప్ లూజర్స్ (-)

| కంపెనీ పేరు | గరిష్టం | కనిష్టం | ముగింపు ధర | క్రితం ముగింపు | మార్పు | నష్టం % |
|---|---|---|---|---|---|---|
| భారతి ఎయిర్‌టెల్ | 487.00 | 455.15 | 459.50 | 492.10 | 32.60 | 6.62 |
| టాటామోటార్స్ | 416.25 | 402.65 | 403.60 | 418.00 | 14.40 | 3.44 |
| ఐసిఐసిఐ బ్యాంకు | 359.20 | 351.80 | 352.75 | 362.30 | 9.55 | 2.64 |
| ఐచర్ మోటార్స్ | 27,050.00 | 26,302.15 | 26,404.05 | 27,071.25 | 667.20 | 2.46 |
| హిందాల్కో | 264.40 | 256.80 | 258.70 | 264.95 | 6.25 | 2.36 |
| టాటాస్టీల్ | 780.60 | 757.15 | 762.10 | 779.75 | 17.65 | 2.26 |
| అల్ట్రాటెక్ సిమెంట్ | 4,368.954,275.104,283.00 | | 4,374.70 | 91.70 | 2.10 | |
| యాక్సిస్ బ్యాంకు | 621.90 | 606.30 | 607.95 | 620.10 | 12.15 | 1.96 |
| ఎంఅండ్ఎం | 771.00 | 752.40 | 755.40 | 769.05 | 13.65 | 1.77 |
| రిలయన్స్ | 981.75 | 962.65 | 966.35 | 983.25 | 16.90 | 1.72 |

మన తెలంగాణ
10
హైదరాబాద్
గురువారం
25, జనవరి 2018
www.manatelangana.news

## లాల్ బహదూర్ శాస్త్రికి గోల్వాల్కర్‌తో అనుబంధం : అద్వానీ



**న్యూఢిల్లీ:** లాల్ బహదూర్ శాస్త్రి సిద్ధాంత పరంగా జవహర్ లాల్ నెహ్రూ మాదిరిగా ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రతికూలవాది కాదని, ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు గురు గోల్‌వాల్కర్‌ను తరుచుగా సంప్రదించేవారని బిజెపి సీనియర్ నేత ఎల్‌కె అద్వానీ తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ వార పత్రిక 'ఆర్గనైజర్' 70వ వార్షికోత్సవం సందర్భంగా తన వ్యాసంలో 'అకింతమైన కాంగ్రెస్‌వాది'గా శాస్త్రిని అభివర్ణించారు. ఆయన ఉన్నత వ్యక్తిత గుణాల వల్లనే దేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నారని పేర్కొన్నారు. నెహ్రూ మాదిరిగా సిద్ధాంత పరంగా ఆయన జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ పట్ల ఎప్పుడూ వ్యతిరేకత కనబరచలేదన్నారు. అద్వానీ తన ఆటోబయోగ్రఫీ 'మై కంట్రీ మై లైఫ్' నుంచి ముఖ్యమైన అంశాలను వ్యాసంలో ప్రస్తావించారు. 1960లో ఆర్గనైజర్ వారపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరిన అద్వానీ, వారపత్రిక ప్రతినిధిగా అనేకసార్లు శాస్త్రిని కలిసినట్లు తెలిపారు. శాస్త్రిని కలిసిన ప్రతిసారి సానుకూల స్పందన వచ్చేదని, 'మనిషి పొడువు తక్కువగా ఉన్నా విశాల హృదయంగల ప్రధానమంత్రి' అని ఆయన పేర్కొన్నారు. 1964 నుంచి 1966 వరకు ప్రధానిగా పని చేసిన శాస్త్రిని గత ఏడాది ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగత్‌ను ప్రశంసించారు. అలహాబాద్‌లో శాస్త్రి దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయనను 'లోక్‌నేత'గా అభివర్ణించారు.







## ప్రత్యేక విమానాలు

### ప్రధాని, రాష్ట్రపతికి సకల హంగులతో 'ఎయిర్ ఇండియా వన్'





**న్యూఢిల్లీ:** ప్రధాని, రాష్ట్రపతి కోసం రెండు బోయింగ్ 777 –300 ఇఆర్ 'లాంగ్ హాల్' విమానాలను ఎయిర్ ఇండియా కొంటుంది. తన వివిఐపి విమా నాలను అత్యంత తాజా టెక్నాలజీతో ప్రమాద రహితంగా ఎయిర్ ఇండియా తీర్చిదిద్దబోతోంది. ప్రధాని, రాష్ట్రపతికి ప్రత్యేకించే తరహాలోనే దేశంలో వివి ఐపిలకు ప్రత్యేక విమానాలను ఎయిర్ ఇండియా తీర్చిదిదుతోంది. వీటిని భారత వైమానిక దళం నిర్వహణలో ఉంచుతారు. చాలా కాలం నుంచి వివి ఐపిలకు ప్రత్యేకంగా విమానాలను ఆధునీకరించడం గురించి చర్చలు సాగు తున్నాయి. అయితే చివరకు 25 ఏళ్లుగా సర్వీసులో ఉన్న ఆ విమానాలకు టాటా చెప్పాలని నిర్ణయించారు. బోయింగ్ 777–300 ఇఆర్‌లకు వివిఐపి విధులను అప్పగిస్తారు. ఇంతకు ముందుగల 747–400 విమానాలను సర్వీసు నుంచి తప్పిస్తారు. ఇఆర్ అంటే 'ఎక్స్‌టెండెడ్ రేంజ్' ఆ విమానంలో 396 మంది ప్రయాణికులు కూర్చోవచ్చు. 777–300 ఇఆర్ బాగా అమ్ము డుపోతున్న 777 వేరియంట్‌కు సంకేతం. దీని గరిష్ఠ టేకాఫ్ బరువు 747 –400 విమానం కంటే చాలా అధికం. దీనికి అత్యంత శక్తిమంతమైన జెట్ ఇంజిన్‌ను అమర్చుతారు. ఇది 13,650 కి.మీ. ఎత్తున ఎగరగలదు. ప్రపంచ వ్యాప్తంగా ఇటువంటి విమానాలు మొత్తం 739 సర్వీసులో ఉన్నాయి. గరి ష్ఠ టేకాఫ్ బరు వు 351.5 టన్ను లు. క్యాబిన్ వెడల్పు 19.1 అడు గులు. విమానం మొత్తం పొడవు 242.3 అడుగు లు. ఎత్తు 61.5 అడుగులు. ఇది జన రల్ ఎల క్ట్రిక్ కంపెనీలో తయారయిన రెండు ఇంజిన్లు కలిగి ఉంటుంది. అవి జిఇ 90 –115 బిఎల్ ఇంజిన్లు. ఎయిర్ ఇండియా వన్ అని ఈ విమానాలను పిలుస్తారు. దీనిలో అన్ని రకాల కమ్యూ నికేషన్ సౌకర్యాలు ఉంటాయి. విమానంలోనే వైద్య సౌకర్యాలు కూడా ఉంటాయి. ఇది అత్యంత భద్రతా బందోబస్తుతో 'ఫ్లయింగ్ ఫోర్ట్రెస్ ' అని పిలుస్తారు.




## నేడు పద్మ అవార్డుల ప్రకటన

**న్యూఢిల్లీ :** వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి పద్మ అవార్డులను గురువారంనాడు కేంద్రం ప్రకటించనుంది. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలను రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ప్రతి ఏటా ప్రకటన చేయడం ఆనవాయితీ. కళలు, సాహిత్యం, విద్య, వైద్యం, క్రీడలు, సామాజిక సేవ, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు, వాణిజ్యం, పరిశ్రమ తదితర రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారిని ఈ అవార్డులను ఎంపిక చేసి గౌరవిస్తారు. పురస్కారాల కోసం 15, 700మంది దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, వివిధ మంత్రిత్వ శాఖలు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఎంపిల నుంచి ప్రతిపాదనలు కూడా పెద్ద సంఖ్యలో అందినట్లు కేంద్ర ప్రభుత్వ వెల్లడించింది. వీటన్నింటిని ప్రధానమంత్రి నాయకత్వంలోని పద్మ అవార్డుల కమిటీ ముందుంచారు. గత ఏడాది 89మందికి పద్మ అవార్డులను ప్రకటించారు.

## త్రిపుర ఎన్నికలకు నోటిఫికేషన్

**అగర్తలా :** త్రిపుర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ బుధవారం జారీ చేసింది. ఫిబ్రవరి 18న రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 3న ఫలితాలు వెలువడనున్నాయి. అయితే ఎన్నికల ప్రక్రియ మొత్తం మార్చి 5తో పూర్తి కానుంది. 60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీ గడువు మార్చి 14తో ముగియనుంది. 60 సీట్లల్లో పది ఎస్‌సిలకు, 20 ఎసిటిలకు రిజర్వ్ అయ్యాయి. కాగా, రాష్ట్రంలో మొత్తం 3,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 2013లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకంటే ఈసారి 5.6 శాతం పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. పోలింగ్ జరగడానికి వారం రోజుల ముందే ఓటర్లకు ఫోటోతో కూడిన ఓటర్లను పంపిణీ చేయనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 25,69,216 మంది ఓటు వేయనున్నారు.

## హిందుత్వపై మాట్లాడొద్దు : రాహుల్

**బెంగళూరు:** బీఫ్, హిందూత్వ ఉగ్రవాదం గురించి ఎక్కడా ఎటువంటి వ్యాఖ్యలు చేయొద్దని, ఆ అంశాల గురించి అసలు ప్రస్తావించొద్దని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కర్ణాటక కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. అలా చేయడం వల్ల ప్రజల్లో బలహీనపడే అవకాశం ఉందని, దాన్ని భాజపా వాళ్లకు అనుకూలంగా మార్చుకుంటుందని ఆయన నేతలకు చెప్పినట్లు కాంగ్రెస్ నేత ఒకరు వెల్లడించారు. త్వరలో కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే బీఫ్ గురించి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బిజెపి నేత యడ్యూరప్ప మధ్య మాటల యద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే.

## మరుగుదొడ్లు లేనందునే రేప్‌లు

**న్యూఢిల్లీ:** మరుగుదొడ్లు లేనందువల్ల బహిర్భూమికి వెళుతున్న మహిళలపై , బాలికలపై అత్యాచారాలు జరగడంపై కేంద్ర మంచినీరు, పారిశుద్ధ్యం మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి రూపుమాపేందుకు కృషి చేస్తున్నామని మంచినీరు, పారిశుద్ధ్యం మంత్రిత్వ శాఖ కార్యదర్శి పరమేశ్వరన్ అయ్యర్ విలేకరులకు తెలిపారు. ప్రకృతి అవసరాలు తీర్చుకునేందుకు బహిర్భూమికి వెళ్లిన గ్రామీణ మహిళలపై ఇటీవల అత్యాచారం జరిగిన ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలో ట్విన్ పిట్ టాయిలెట్ల ప్రచారాన్ని పెద్ద ఎత్తున తమ మంత్రిత్వ శాఖ చేపట్టనున్నదని ఆయన వెల్లడించారు. ట్విన్ టాయిలెట్లు ధర తక్కువ, సురక్షితం, శుభ్రం చేయడానికి అనువుగా, పర్యావరణ అనుకూలంగా ఉంటాయని ఆయన తెలిపారు. చాలా రాష్ట్రాలు ఆరుబయట బహిర్భూమికి వెల్లడాన్ని నిరోధించే ప్రయత్నాలు చేస్తుంటే బీహార్, జార్ఖండ్, ఒడిశా వంటి రాష్ట్రాలు ఇంకా ఈ విషయంలో వెనుకబడి ఉన్నాయన్నారు.

## ఢిల్లీలో హై అలర్ట్

**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవం రోజున ఉగ్రదాడి జరగవచ్చంటూ నిఘా సంస్థలు ఉన్నతస్థాయి హెచ్చరికలు జారీ చేశాయి. ఈనెల 26న భారత 69వ గణతంత్ర వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా పది ఆసియా దేశాల నుంచి నాయకులను విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిపై ఉగ్రదాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు వెల్లడించాయి. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎప్పుడూ లేని విధంగా మొదటిసారిగా ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొనేందుకు దాదాపు పది దేశాలను నాయకులు విచ్చేస్తున్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో, వియత్నాం ప్రధానమంత్రి గుయెన్, మయన్మార్ స్టేట్ కౌన్సిలర్ ఆంగ్‌సాన్ సూకి, లావోస్ ప్రధాని తంగ్లౌన్, మ లేషియా పిఎం నజీబ్ రజాక్, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో ద్యుటెర్టే, సింగపూర్ ప్రధాని లీ సెన్ లూంగ్, కంబోడియా పిఎం హన్ సన్, థాయిలాండ్ పిఎం చాన్ ఓచా, బ్రూనై సుల్తాన్ హస్సనల్ బోల్కియలు వేడుకలకు రానున్నారు. ఇదిలా ఉండగా, విదేశీయులపై దాడులు చేసేందుకు ఉగ్ర సంస్థలు అసాధారణ మార్గాలను కూడా అనుసరించే అవకాశం ఉన్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. దాడులు చేసేందుకు ఉగ్రవాదులు సిద్ధంగా ఉన్నట్లు లేదా, సరిహద్దు ప్రాంతాల నుంచి ఇప్పటికే దేశంలోకి ప్రవేశించినట్లు అనుమానిస్తున్నామని పేర్కొన్నాయి.



# పద్మావత్‌పై కర్ణిసేన ఫైర్

### థియేటర్లు, వాహనాలకు నిప్పు
### గుజరాత్‌లో సినిమా విడుదల నిలిపివేత



**న్యూఢిల్లీ/జైపూర్ :** వివాదాస్పద చిత్రం పద్మావత్ విడుదలను నిరసిస్తూ పలు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న ఆందోళనలు హింసారూపం దాల్చుతున్నాయి. కర్ణిసేన కార్యకర్తలు రెచ్చిపోయి వందలాది వాహనాలకు నిప్పుపెట్టారు. వివిధ రాష్ట్రాల్లో థియేటర్లపై దాడులకు దిగుతున్నారు. షాపులను ధ్వంసం చేస్తున్నారు. దీంతో గుజరాత్‌లో సినిమా విడుదల నిలిపివేయాలని థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. గురువారంనాడు దేశవ్యాప్తంగా పద్మావత్ చిత్రం విడుదలకు సిద్ధమైంది. మంగళవారంనాడు రాత్రే కర్ణిసేన కార్యకర్తలు 150 వాహనాలను దగ్ధం చేశారు. అహ్మదాబాద్‌లో అల్లరిమూక కొందరు సినిమా విడుదలకు సిద్ధంగా ఉన్న మూడు మల్టిప్లెక్స్‌లకు నిప్పు పెట్టారు. రాజస్థాన్‌లో కూడా ఆందోళనలు ఉధృతం చేశారు. ధర్నాలు, రాస్తారోకోలతో కర్ణిసేన, రాజ్‌పుత్ మహిళలు రోడ్డెక్కారు. సికార్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళుతున్న బస్సుకు నిప్పుపెట్టారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు అదనపు బలగాలను మోహరించి శాంతి భద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తున్నారు. మరోవైపు హర్యానాలోనూ పద్మావత్ విడుదలకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. గుర్గావ్‌లో ఆర్‌టిసి బస్సును ఆందోళనకారులు తగులబెట్టారు. యుపిలో కర్ణిసేప పలు రైళ్ల రాకపోకలను అడ్డుకుంది. రవాణాకు తీవ్ర ఆటంకం కలిగించింది. పద్మావత్ సినిమా విడుదల చేస్తే కఠిన చర్యలకు దిగుతామని కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వి హెచ్చరించారు. ప్రజా ఆందోళనలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు. కర్ణిసేన కార్యకర్తలు కొందరు సినిమాను ఇప్పటికే చూశారన్న వార్తలు అవాస్తవాలని ఆయన కొట్టిపారేశారు. దేశవ్యాప్తంగా 100మంది కర్ణిసేన కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.

### చిత్తోడ్‌గఢ్ కోట మరోసారి మూసివేత

పద్మావత్ సినిమాకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనల కారణంగా రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్‌కోట బుధవారంనాడు మూతపడింది. ఇలా జరగడం చరిత్రలో ఇది రెండోసారి. రాజ్‌పుత్ రాణి పద్మిణి జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన ఈ సినిమాపై రాజ్‌పుత్‌లు ఆందోళన చేస్తున్నారు. సుప్రీంకోర్టు సినిమా విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ రాజస్థాన్‌లో సినిమా విడుదల అనిశ్చితిలో పడింది. డిస్ట్రిబ్యూటర్లు కూడా ముందుకు రావడం లేదు. రాణి పద్మిణికి చెందిన చిత్తోడ్‌గఢ్‌కోట ఏడో దశాబ్దం నాటిది. ఈ కోటను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కోట మూతపడడం ఇది రెండోసారి. మొదటిసారి కూడా పద్మావత్ సినిమా కారణంగానే దీన్ని మూసేశారు. నవంబరులో సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు కర్ణిసేన ఆందోళన చేపట్టింది. దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీపై దాడి చేయడంతో పాటు సెట్‌ను ధ్వంసం చేశారు. స్వాతంత్ర్యం వచ్చాక మొదటిసారి అప్పుడు కోటను మూసేశారు.







## అసదుద్దీన్‌పై బూటు

**ముంబయి :** ఎఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసిపై ఓ వ్యక్తి బూటు విసిరాడు. దక్షిణ ముంబయిలోని నాగ్‌పడాలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించిన ర్యాలీలో ఓవైసి మాట్లాడుతుం డగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని గుర్తించామని, అయితే అతన్ని అరెస్టు చేయలేదన్నారు. ర్యాలీలో ట్రిపు ల్ తలాక్ అంశానికి వ్యతిరేకంగా ఓవైసి ప్రసంగిస్తుండగా నిందితుడు ఎంపిపై బూటు విసిరినట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. సిసిటివి ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించామని జోన్ 3 డిప్యూటీ కమిషనర్ వీరేంద్ర మిశ్రా పేర్కొన్నారు. ఎఐఎంఐఎం ఎంఎల్‌ఎ ఇంతి యాజ్ మాట్లాడుతూ ఓవైసికి ఎలాంటి గాయం కాలేదని, బుటు విసిరిన తరువాత కూడా ఆయన ప్రసంగాన్ని కొనసాగించారన్నారు.

## రాజీవ్ కేసులో శ్రీలంక సహకరించడం లేదు

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసు విచారణలో శ్రీలంక సహకరించలేదని సిబిఐ ఆరోపించింది. రాజీవ్ హత్య కేసులో 25 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్న పెరారివాళన్ అనే దోషి కేసును పునర్విచారించాల్సిందిగా 2017లో సుప్రీం కోర్టులో పిటిషన్ వేశాడు. ఈ నేపథ్యంలో కేసులో మరోసారి దర్యాప్తు చేపట్టాలని సుప్రీం కోర్టు సిబిఐకు నోటీసులు పంపింది. 1991లో రాజీవ్ హత్య కేసులో పెరారివళన్, మురుగన్, సంతానం, నళిని అనే నలుగురు వ్యక్తులను దోషులుగా తేల్చిన సుప్రీంకోర్టు వారికి ఉరిశిక్ష విధించింది. ఆ తర్వాత శిక్షను జీవితఖైదుగా మార్చింది. అయితే ఈ కేసును మరోసారి పరిశీలించాల్సిందిగా పెరారివళన్ సుప్రీంకోర్టును కోరాడు. రాజీవ్‌ను హత్య చేయడానికి వాడిన బెల్ట్ బాంబ్‌ను తయారుచేసేందుకు పెరరివళన్ రెండు 9 వోల్ట్‌ల బ్యాటరీలు సరఫరా చేసినందుకుగానూ సుప్రీం అతనికి శిక్ష విధించింది.

## అమిత్ షాపై పిల్‌ను వ్యతిరేకిస్తున్న సిబిఐ



**ముంబయి:** సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ భావిస్తున్న కేసు నుంచి బిజెపి అధ్యక్షుడు అమిత్ షాను విముక్తుడిని చేస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ బాంబే హైకోర్టులో దాఖలైన పిల్‌ను వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నట్లు సిబిఐ బుధవారం తెలిపింది. బాంబే లాయర్స్ అసోసియేషన్ గత వారం దాఖలు చేసిన ప్రజా ప్రమోజన వ్యాజ్యం(పిల్)లో సిబిఐ చర్యను 'అక్రమం, ఏకపక్షం, అనుచితం' అని వ్యాఖ్యానించింది. కేసు నుంచి అమిత్ షాను విముక్తిడిని చేస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు 2014 డిసెంబర్ 30 ఇచ్చిన తీర్పును సవాలు చేయకూడదని సిబిఐ నిర్ణయించుకోడాన్ని ఆ న్యాయవాదుల సంఘం తప్పుపట్టింది. అయితే 'మేము వారి పిటిషన్‌ను వ్యతిరేకిస్తున్నాం. ఆ పిటిషన్ నిర్వహణ అంశంలో కూడా మాకు సమస్య ఉంది. అమిత్ షాను విముక్తిడిని చేసిన తీర్పు 2014 డిసెంబర్ నాటిది. పరిమితులపై కూడా సమస్యలున్నాయి' అని సిబిఐ తరపు న్యాయవాది అనిల్ సింగ్ చెప్పారు. సిబిఐ న్యాయవాది సమయాన్ని కోరడంతో పిటిషన్‌పై వాదనలను ఫిబ్రవరి 13కు న్యాయమూర్తులు ఎస్. సి. ధర్మాధికారి, భారతీ దాంగ్రేతో కూడిన డివిజన్ బెంచ్ వాయిదా వేసింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దావే హాజరయ్యారు. కేసు విచారణను మొదట అప్పగించిన సిబిఐ జడ్జిని ఎందుకు బదిలీ చేశారన్నది తెలిపే రికార్డులను హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ కమిటీ నుంచి కూడా పిల్ కోరుతున్నామని ఆయన వాదించారు. కేసు విచారణను గుజరాత్ నుంచి ముంబయికి సుప్రీం కోర్టు మార్చిందని, వీలయినంత త్వరగా కేసును పరిష్కరించాలని కూడా హైకోర్టుకు దావే చెప్పారు. కేసు విచారణను మొదటి నుంచి తుది వరకు ఒకే న్యాయాధికారి జరిపేలా అడ్మినిస్ట్రేటివ్ కమిటీ చూడాలని నాడు సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని కూడా ఆయన ఉటంకించారు. అమిత్ షాను విముక్తుడిని చేస్తూ సెషన్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ పునర్విమర్శ అర్జీ (రివిజన్ పిటిషన్)ని సిబిఐ దాఖలు చేసేలా ఆదేశించాలని కూడా దావే హైకోర్టును కోరారు. దీనికి ముందు సొహ్రాబుద్దీన్ కేసులో కాల క్రమేణా ముగ్గురు ఐపిఎస్ అధికారులు సహా అనేక మంది నిందితులను న్యాయస్థానం విముక్తులను చేసిందన్నది ఇక్కడ గమనార్హం.

### అనర్హతపై స్టేకు హైకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ:** లాభదాయక పదవులను చేపట్టారన్న కారణంగా 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎంఎల్‌ఎలను అనర్హులుగా ప్రకటిస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు బుధవారం నిరాకరించింది. ఇదే సమయంలో జనవరి 29 కన్నా ముందే ఉప ఎన్నికలు ప్రకటించడం వంటి ఆత్రపడే చర్యలేవి చేపట్టరాదని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. లాభదాయక పదవులు చేపట్టారన్న కారణంగా అనర్హులను చేయడాన్ని సవాలు చేస్తూ ఆప్ ఎంఎల్‌ఎలు పెట్టుకున్న వినతిపై స్పందించాల్సిందిగా ఎన్నికల సంఘం, కేంద్రాన్ని న్యాయమూర్తి విభు బఖ్రు ఆదేశించారు. 20మంది ఆప్ ఎంఎల్‌ఎల అనర్హత సిఫార్సులు, జనవరి 20న వాటిని రాష్ట్ర పతి ఆమోదించిన వివరాలన్నీ ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు కోరింది. ఢిల్లీ చట్టం కింద ఆప్ ఎంఎల్‌ఎలను అనర్హులుగా రాష్ట్రపతి ఆమోదించడాన్ని ఆధారం చేసుకుని న్యాయ మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటన జారీ చేసింది. అయితే ఆప్ ప్రధాన ప్రతినిధి సౌరభ్ భర ద్వాజ్ తాజా వినతిని దాఖలు చేయగలదని ఇటీవల అన్నారు. ఆప్ ఎంఎల్‌ఎల అనర్హత అంశంపై ప్రజల మద్దతును కోరుతూ ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా బహిరంగ లేఖ(ఓపెన్ లెటర్) రాశారు.

## ఎన్‌కౌంటర్లో నలుగురు పోలీసులు మృతి



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నారాయణపూర్ జిల్లాలో బుధవారం నక్సలైట్లకు, పోలీసులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు సహా నలుగురు పోలీసులు చనిపోయారు. అభుజ్‌మద్ ప్రాంతంలోని ఇర్పనర్ గ్రామ అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసు బృందం నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ చేపడుతుండగా ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని ప్రత్యేక డిజిపి డి.ఎం. అవస్థీ చెప్పారు. ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, మరి ఇద్దరు కానిస్టేబుళ్లు ఇందులో ప్రాణాలు కోల్పోయారని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్ సమాచారం అందగానే మరిన్ని బలగాలను ఘటన స్థలికి తరలించినట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో గా యపడినవారిని విమానం ద్వారా చికిత్స కోసం రాయ్‌పూర్‌కు చేర్చినట్లు కూడా తెలిపారు. ఎన్‌కౌంటర్ ఉదయం 11 గంటలకు మొదలై రెండు గంటల తర్వాత ముగిసిందని ఐజిపి(బస్తర్ రేంజ్) వివేకానంద సిన్హా చెప్పారు.


## రాజీనామాకు పూనుకున్నది నిజమే



**న్యూఢిల్లీ:** ఇటీవల జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో తాను రాజీనామాకు పూనుకున్నది నిజమేనని, కానీ మిగతావన్నీ అవాకులుచవాకులేనని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బుధవారం స్పష్టం చేశారు. తాను కోల్‌కతాలో జరిగిన పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశంలోనే కాక అంతకు మందు ఢిల్లీలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలో కూడా రాజీనామా ఇవ్వడానికి పూనుకున్నానని, అయితే ఆ రెండు సమావేశాల్లో కూడా తనను సిపిఐ(ఎం) నాయకుడిగా కొనసాగమని కోరారని తెలిపారు. కోల్‌కతాలో జరిగిన సమావేశంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలని ఆయన సమర్పించిన ముసాయిదాను పార్టీ సెంట్రల్ కమిటీ తిరస్కరించినందునే ఆయన పార్టీ చీఫ్‌గా రాజీనామాకు పూనుకున్నారని ప్రకాశ్ కారత్ తెలిపారన్న వార్తల గురించి అడిగినప్పుడు ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. కారత్ మంగళవారం ఓ న్యూస్ వెబ్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ వ్యాఖ్యలు చేశారు. అయితే దానిపై ఏచూరి బుధవారం స్పష్టీకరణ ఇచ్చారు. 'నేను సెంట్రల్ కమిటీ సమావేశానంతరం పత్రికా సమావేశంలో... నా కొనసాగింపు సరికాదు(అన్‌టెనేబుల్) అని స్పష్టంగా చెప్పాను. కానీ పొలిట్ బ్యూరో నాతో అలా చేస్తే పార్టీలో చీలిక వచ్చిందన్న అపోహ ఏర్పడుతుందని, ముఖ్యంగా త్రిపుర ఎన్నికల్లోనని, కనుక నేను కొనసాగాల్సిందేనని చెప్పింది. వారంతా ఏకగ్రీవంగానే ఆ విషయాన్ని చెప్పారు' అని ఏచూరి అన్నారు. 'నేను నా రాజీనామా గురించి సెంట్రల్ కమిటీలో కూడా మళ్లీ చెప్పాను. కానీ ప్రతిస్పందన అదే మాదిరిగా వచ్చింది.' అన్నారు. 'తాను చెబుతున్నదంతా నిజమేనని, ప్రస్తుతం సమావేశంలో ఉన్న ఏ నాయకుడినైనా అడిగి సరిచూసుకోవచ్చని' అన్నారు.

## అంతరిక్షంలో స్పేస్ వాక్

**వాషింగ్టన్:** అంతరిక్షంలో ఈ ఏడాది ఇద్దరు వ్యోమగాములు తొలి స్పేస్‌వాక్ చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)లోని ఇద్దరు వ్యోమగాములు స్కాట్ టింగిల్, మార్క్ వాండే హై మంగళవారం స్పేస్ స్టేషన్ బయట ఆరున్నర గంటల పాటు నడిచారు. ఈ స్పేస్‌వాక్ జీవితాంతం గుర్తుంటుందని టింగిల్ అన్నారు. వీరు కెనెడియన్ రోబోటిక్ ఆర్మ్ కెనాడర్మ్‌పై పనిచేస్తున్నారు. దీని రెండు చేతుల్లాంటి విభాగాల్లో ఒకటి పునరుద్ధరించే పనిలో ఉన్నారు. ఈ రోబోటిక్ ఆరమ్స్(ఎల్ఈఈ) కార్గో స్పేస్‌క్రాఫ్ట్ నుంచి వస్తువులు, వ్యోమగాములను స్పేస్‌స్టేషన్‌లోకి తీసుకొచ్చేందుకు సహకరిస్తాయి. కెనాడర్మ్2 రెండు వైపులా ఉన్న ఈ ఆరమ్స్ ఒక్కోటి200కేజీల బరువుతో 3అడుగుల పొడవుతో ఉంటాయి. ఎల్ఈఈబిని వ్యోమగాములు పునరుద్ధరించారు. అంతరిక్ష కేంద్ర వ్యోమగాములు చేపట్టిన 206వ స్పేస్‌వాక్ ఇది.



# భారత సంతతి వ్యక్తి ధార్ అంతర్జాతీయ ఉగ్రవాది : అమెరికా

**వాషింగ్టన్:** భారత సంతతికి చెందని బ్రిటన్ టెర్రరిస్టు సిద్ధార్థ ధార్‌ను ప్రపంచ టెర్రరిస్టుగా అమెరికా ప్రకటించింది. భీకరంగా సామూహిక మారణకాండలు సృష్టించే 'జీహాదీ జాన్' గా పేరు మోసిన మొహమ్మద్ ఎంజావీ స్థానే ధార్ ఉగ్ర వాదిగా మారాడు. ధార్ బ్రిటీష్ హిందూ సంతతివాడు. అయితే ఇస్లామ్‌లోకి మారి ఇప్పుడు అబు రుమేసాగా చలామణి అవుతున్నాడు. బ్రిటన్‌లో పోలీసుల కన్నుగప్పి బెయిల్‌లో ఉండగా పరారయ్యాడు. 2014లో భార్య, బిడ్డలతో కలిసి సిరియా పారిపోయినట్లు తెలుస్తోంది. 2016 నాటి ఐసిసి విడియోలో కనిపించాడు. ఇతడు ఎప్పుడు ముసుగుతో ఉంటాడు. బ్రిటన్ తరఫున గూఢచర్యం జరుపుతున్న ఆరోపణపై అనేక మంది ఖైదీలను కాల్చి చంపడాన్ని రికార్డు చేసిన విడియో అది. అతడితోపాటు మొరాకో పౌరుడు, ప్రస్తుతం బెల్జియంలో ఉన్న అబ్దెలతీఫ్ జియినీను కూడా ప్రపంచ టెర్రరిస్టుగా అమెరికా ప్రకటించింది. నిహాద్ బరాకత్ అనే యాజిదీ టీనేజర్‌ను ఐసిస్ సెక్స్ స్లేవ్‌గా ధార్ అక్రమ రవాణా చేశాడని అభియోగం.

మన తెలంగాణ
11
హైదరాబాద్
గురువారం
25, జనవరి 2018
www.manatelangana.news

# అట్టడుగు నుంచి ఐదో ర్యాంక్

## పర్యావరణ పరిరక్షణలో పడిపోయిన భారత్ ర్యాంక్

**దావోస్:** పర్యావరణ పరిరక్షణ దేశాల్లో భారత్ అట్టడుగు 5 దేశాల ర్యాంకుకు చేరుకుంది. మొత్తం 180 దేశాల్లో 2016లో 141వ స్థానంలో ఉన్న భారత్ ఈ ఏడాది 177వ స్థానానికి పడిపోయింది. ప్రపంచ ఆర్థిక వేదిక సహకారంతో యేల్ యూనివర్సిటీ, కొలంబియా యూనివర్సిటీ మంగళవారం తాజా పర్యావరణ నిర్వహణ సూచీ(ఇపిఐ) విడుల చేశాయి.10 వర్గాల్లో 24 సూచికల ఆధారంగా ఆయా దేశాల పర్యావరణ పరిరక్షణ నిర్వహణ ర్యాంకులను నిర్ధారించారు. వాయు నాణ్యత సహా పర్యావరణ ఆరోగ్యం విషయం లో భారత్ ర్యాంకు అట్టడుగులో ఉంది. గాలి నాణ్యతలోనే భారత్ ర్యాంకు 178వ స్థానంలో ఉంది. భారత్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యం ప్రమాదకరంగా ఉందని ఈ తాజా సూచిక తెలిపింది.పర్యావరణ ఆరోగ్యం విషయంలో మరి రెండు అంశాలు నీరు, పారిశుద్ధ్యం...భారీ లోహాలకు గురికావడం(ఎక్స్‌పోజర్ టు హెవీ మెటల్స్) ఉన్నా యి. ఒకవేళ భారత్ వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టకపోయినట్లయితే వాయు కాలుష్యం కారణంగా మరణాల సంఖ్య మూడు రెట్లు పెరగనున్నట్లు ఇపిఐ పేర్కొంది. ప్రస్తుతం మన దేశంలో వాయు కాలుష్యం కారణంగా మరణాల సంఖ్య 10 లక్షల 10 వేలు ఉంది. పర్యావరణ ఆరోగ్య నిర్వహణ సూచిలో అట్టడు ఐదు దేశాల్లో మూడు దక్షిణాసియా దేశాలు... భారత్, నేపాల్, బంగ్లాదేశ్ ఉన్నాయి. మిగతా రెండు దేశాలు బురిండి, కాంగో. ఈ సూచికలో చైనా 120వ స్థానంలో ఉంది. కాగా అగ్రస్థానంలోని 5దేశాలు: స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, డెన్మార్క్, మాల్టా, స్వీడెన్. అట్టడుగు స్థానంలోని 5 దేశాలు: నేపాల్, భారత్, కాంగో, బంగ్లాదేశ్, బురుండి.



# లిబియాలో జంట పేలుళ్లు

## 34 మంది మృతి



**బెంఘాజి :** లిబియాలోని ఈ నగరంలో రెండు కారు బాంబులు ఒక మసీదు వద్ద పేలిన ఘటనలో కనీసం 34 మంది మరణించారు. మరి87 మంది గాయపడ్డారు. ఇది ఆ దేశంలో రెండో పెద్ద నగరం. ఈ మసీదును జీహాదిస్టుల వ్యతిరేకులు తరచూ సందర్శిస్తుంటారు. జూలైలో జీహాదిస్టుల నుంచి ఖలియా హఫ్తార్ అనే మిలిటరీ స్ట్రాంగ్ మ్యాన్ విముక్తి ప్రకటించుకున్నాక జరిగిన భారీ ఘటన ఇదే. ఆ పేలుళ్లు జీహాదిస్టుల పనేనని భావిస్తున్నారు.మంగళవారం సాయంత్రం ప్రార్థనల తర్వాత ఈ ఘటనసంభవించింది. **జలాలాబాద్‌లో ఉగ్ర దాడి, ఇద్దరు మృతి :** ఆఫ్గానిస్థాన్‌లో కల్లోల ప్రాం తంలో బుధవారం నాడు 'సేవ్ ది చిల్డ్రన్' ఆఫీసు లోకి తుపాకులు ధరించిన ఉగ్రవాదులు జొరబడి కనీసం ఇద్దరిని చంపారు. ఈ ఘటనలో14 మంది గాయపడ్డారు. యుద్ధంతో చిన్నాభిన్నమైన ఆ దేశం లో ఇటీవల వరుసగా జరుగుతున్న ఉగ్ర దాడుల్లో ఇది తాజాది. జలాలాబాద్ నగరంలో బ్రిటీష్ ఛారిటీ కార్యాలయం వెలుపల కారు పేలిపోయిన తర్వాత ఈ చొరబాటు హత్యలు చోటు చేసుకున్నాయి.


# పాక్‌లో హకానీ కమాండర్ హతం

## అఫ్గాన్ సరిహద్దుల వద్ద అమెరికా డ్రోన్‌దాడి

**పెషావర్:** ఆఫ్ఘానిస్థాన్ సరిహద్దుల వద్ద పాక్ భూభాగంలోని గిరిజన ప్రాంతం కున్నం ఏజెన్సీపై అమెరికా డ్రోన్ల దాడిలో బుధవారం నాడు అగ్రశ్రేణి హకానీ కమాండర్, మరి ఇద్దరు మరణించారు.డ్రోన్ నుంచి రెండు క్షిపణులను ప్రయోగించారు. స్పీన్ తల్లా ప్రాంతం లో ఈ దాడి జరిగింది. అది హంగు జిల్లా, ఫైబర్ ఫక్తూనఖ్వా సరిహద్దులు కలుసుకొనే చోట ఉంది. హకానీ నెట్‌వర్క్ కమాండర్ ఇషాన్ అలియాస్ ఖ్వారీ దాడిలో మరణించినట్లు తెలుస్తోంది. అమెరికా గూఢచారి విమానాలు అఫ్గాన్ శరణార్థుల ఇల్లును లక్ష్యం చేసుకొని ఈ దాడి సాగించాయి.

# వేములఘాట్ దీక్షలు @ 600

## న్యాయం జరిగే వరకు కొనసాగిస్తామంటున్న నిర్వాసితులు




**మన తెలంగాణ**/తొగుట : మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తొగుట మండలం వేములఘాట్ గ్రామంలో సాగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 600 రోజులకు చేరనున్నాయి. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తొగుట మండలం వేములఘాట్‌లో దాదాపు మూడు వేల ఎకరాలు ముంపునకు గురవుతోంది. ప్రభుత్వం భూనిర్వాసితులకు జిఓ 123 ప్రకారం పరిహారం చెల్లిస్తామని గతంలో తెలుపగా నిర్వాసితులు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. యావత్ దేశం దృష్టిని ఆకర్షించిన ఈ దీక్షలను వేములఘాట్ వాసులు కొనసాగిస్తూనే వున్నారు. ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు దీక్షల్లో గ్రామానికి చెందిన రైతులు పాల్గొంటు తమ నిరసనలు వ్యక్తం చేస్తూనే వున్నారు. వీరికి టిడిపి, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నేతలతో పాటు ప్రజా సంఘాలు, టిజెఎసి చైర్మన్ కోదండరాంలు మద్దతు తెలిపి దీక్షల్లో పాల్గొన్నారు. ఒకవైపు దీక్షలతో తమ నిరసనను వ్యక్తం చేస్తూనే నిర్వాసితులు న్యాయపోరాటం చేస్తున్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో వేములఘాట్ ప్రజలు చేస్తున్న పోరాటం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టిందని చెప్పవచ్చు.ఇటీవల గ్రామంలో అభ్యంతరాలపై విచారణ కోసం గ్రామసభను అధికారులు నిర్వహించినా వేములఘాట్ గ్రామస్తులు ఎవ్వరూ హాజరుకాకుండ తమ నిరసన తెలిపారు. రెండు రోజులు అధికారులు గ్రామ సచివాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూసి వెళ్లిపోయారు. న్యాయమైన తమ డిమాండ్లను సాధించుకునేంత వరకు దీక్ష లు ఆపమని అదేవిధంగా ప్రభుత్వంపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేస్తున్నారు. ఏదిఏమైనా వేములఘాట్ దీక్షలు ఇంకా కొనసాగుతుండటంతో ప్రభుత్వానికి ఏంచేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.







# భూనిర్వాసితుల కండ్లలో ఆనందం చూడాలి : హరీశ్‌రావు

**మన తెలంగాణ**/సిద్దిపేట ప్రతినిధి : రిజర్వాయర్ ఆయకట్టు రైతులు ఎంత ఆనందంగా వుంటారో అంతకంటే ఎక్కువ ఆనందం భూనిర్వాసితుల కండల్లో చూసే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో కాళేశ్వరం ప్రాజక్టులో ముంపునకు గురవుతున్న కొచ్చాగుట్టపల్లి నిర్వాసితుల పునరావాస కేంద్రానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఒక్కో నిర్వాసిత కుటుంబానికి సుమారు పది లక్షల విలువ చేసే 250 గజాలప్లాటు ఇవ్వడంతో పాటు అన్ని వసతులతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు.ఈ కాలనీలో అన్ని వసతులు కల్పిస్తామని,వచ్చే ఐదారు నెలల్లో ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.భూనిర్వాసితులందరికీ రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే హక్కును కల్పిస్తామని, ప్రత్యేక ఫిష్టింగ్ సొసైటీ ఏర్పాటుచేసి ప్రతి నిర్వాసిత వ్యక్తిని సభ్యుడిగా చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్‌వెంకటరామిరెడ్డితోపాటుఅధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారులకు ఎన్నికల అవార్డులు

## నేడు రవీంద్రభారతిలో ప్రదానం

**మన తెలంగాణ**/హైదరాబాద్ : ఎన్నికల సంబంధ వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించిన 24 మంది రాష్ట్ర అధికారులకు కేంద్ర ఎన్నికల కమిషన్ అవార్డులకు ఎంపికచేసింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్ధనరెడ్డి సహా వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులు, బూత్ స్థాయి సిబ్బందిని ఈ అవార్డులకు ఎంపికచేసినట్లు ఎన్నికల ప్రధానాధికారి (ఇన్‌ఛార్జి) అనూప్‌సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల నమోదుతో పాటు ఇతర ఎన్నికల విధులకు సంబంధించిన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్న అనూప్‌సింగ్ గురువారం ఉదయం గవర్నర్ చేతుల మీదుగా రవీంద్రభారతిలో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ అవార్డుకు ఎంపికైన జిల్లా ఎన్నికల అధికారులలో కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, ఖమ్మం కలెక్టర్ డిఎస్.లోకేష్‌కుమార్, ఆసిఫాబాద్ కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, నల్గొండ కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.జనార్ధన్‌రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ ఎంవి.రెడ్డిలు ఉన్నారు. వీరితో పాటు ఖమ్మం ఆర్డీఓ టి.పూర్ణచంద్ర, నల్గొండ ఆర్డీఓ వెంకటాచారి, మల్కాజిగిరి మున్సిపల్ డిప్యూటి కమిషనర్ వేణుగోపాల్, కరీంనగర్ ఆర్డీఓ బి.రాజుగౌడ్, ఘణ్‌పూర్ స్టేషన్ ఏఇఆర్‌ఓ జి.సదానందం, కూకట్‌పల్లి తహసిల్దార్ ఇబి.నాగరాజ్, కామారెడ్డి తహసిల్దార్ రవీందర్, మహబూబ్‌నగర్ తహసిల్దార్ ఎంవి.ప్రభాకర్‌రావులు ఎంపికయ్యారు. అలాగే జనగాం బిఎల్‌ఓ గౌడుగు అనిల్, వరంగల్ అర్బన్ బిఎల్‌ఓ శంకర్, సూర్యాపేట బిఎల్‌ఓ పి.వీరయ్య, నిర్మల్ బిఎల్‌ఓ నరసమ్మ, జయశంకర్ భూపాల్‌పల్లి బిఎల్‌ఓ పి.శోభారాణి, వికారాబాద్ బిఎల్‌ఓ విజయలక్ష్మి ,మేడ్చల్ బిఎల్‌ఓ జి.ఆంజనేయులు, జుక్కల్ బిఎల్‌ఓ బి.వెంకటరావు,మహబూబ్‌నగర్ బిఎల్‌ఓ ప్రశాంతిలకు ఈ అవార్డులు దక్కాయి. వీరితో పాటు డిప్యూటి సిఇఓ ఎం.సత్యవాణి, సెక్షన్ అధికారి కె.వెంకటేశ్వరరావ్, పిఎస్ పి.హేమాభవాని, డిప్యూటి పిఎం కె.రవిలు ఎంపికయ్యారు. జాతీయస్థాయిలో నిర్వహించిన క్విజ్‌పోటీలలో ఖమ్మం జిల్లాకు చెందిన సిహెచ్.గోపినాథ్, పి.స్వాతిలు ప్రథమస్థానంలో నిలిచారు. జాతీయ ఓటర్ దినోత్సవం సంధర్భంగా రవీంద్రభారతిలో గురువారం ఉదయం 9గంటలకు వీరికి అవార్డులు ప్రధానం చేస్తున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి అనూప్‌సింగ్ తెలిపారు. ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు విజేతలను ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలని తెలిపారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
గురువారం
25, జనవరి 2018
www.manatelangana.news

## అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్లో పాకిస్థాన్



క్రిస్ట్‌చర్చ్: పాకిస్థాన్ జట్టు అండర్–19 ప్రపంచకప్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బుధవారం ఉత్కంఠభరితంగా సాగిన క్వార్టర్ ఫైనల్లో పాక్ మూడు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించిన ఈ మ్యాచ్‌లో 190 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించేందుకు పాక్ తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. వికెట్ కీపర్ వ్యాండిల్ (65) ఒక్కడే పాక్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగతావారిలో జాసన్ (36), డుప్లెసిస్ (21) పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో మహ్మద్ మూసా మూడు, షాహిన్ అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్థాన్ 47.5 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 190 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. అలీ జర్యబ్ అద్భుత బ్యాటింగ్‌తో పాకిస్థాన్‌ను సెమీస్‌కు చేర్చాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అలీ పోరాటం కొనసాగించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన అలీ ఐదు ఫోర్లతో 74 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో పాక్ మూడు వికెట్ల తేడాతో విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. అలీకి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

### ఎదురులేని ఫెదరర్..

ఇక, పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ ఫెదరర్ హవా కొనసాగించాడు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ పోరులో ఫెదరర్ 7–6, 6–3, 6–4 తేడాతో 19వ సీడ్ టొమస్ బెర్డిచ్ (చెక్)ను ఓడించి సెమీస్‌కు చేరుకున్నాడు. ప్రారంభ సెట్‌లో పోరు ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ సెట్‌లో బెర్డిచ్ నుంచి ఫెదరర్‌కు కాస్త ప్రతిఘటన ఎదురైంది. ఇద్దరు కూడా ప్రతి పాయింట్ కోసం తీవ్రంగా శ్రమించారు. ఎవరి సర్వీస్‌ను వారు కాపాడుకుంటూ ముందుకు వెళ్లారు. దీంతో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లక తప్పలేదు. కానీ, కీలక సమయంలో బెర్డిచ్ ఒత్తిడికి గురయ్యాడు. ఈ క్రమంలో వరుస తప్పిదాలకు పాల్పడ్డాడు. దీన్ని ఫెదరర్ తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. చూడచక్కని షాట్లతో చెలరేగి పోయాడు. అంతేగాక, సెట్‌ను గెలిచి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఇక, రెండో సెట్ ప్రారంభంలో ఫెదరర్‌కు ఎదురే లేకుండా పోయింది. తన మార్క్ షాట్లతో చెలరేగి పోయాడు. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ పట్టు బిగించాడు. చివరి వరకు దీన్ని నిలబెట్టుకుంటూ రెండో సెట్‌ను కూడా సొంతం చేసుకున్నాడు. మూడో సెట్‌లో కూడా ఫెదరర్ హవా నడిపించాడు. ప్రత్యర్థిని ముప్పతిప్పలు పెడుతూ ముందుకు సాగాడు. ఇదే క్రమంలో సెట్‌ను గెలిచి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు.



# సెమీస్‌లో ఫెదరర్, హాలెప్




**• చుంగ్, కెర్బర్ ముందుకు • బోపన్న జంట విజయం • ఆస్ట్రేలియా ఓపెన్**

మెల్‌బోర్న్: స్విట్జర్లాండ్ యోధుడు, డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్, ఆసియా సంచలనం హియాన్ చుంగ్ (దక్షిణ కొరియా) ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ సిమోనా హాలెప్ (రుమేనియా), 21వ సీడ్ అంజెలిక్ కెర్బర్ (జర్మనీ) క్వార్టర్ ఫైనల్ పోరులో విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్ రోహన్ బోపన్న (భారత్), టిమియా బాబోస్ (హంగేరి) జంట సెమీ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. కాగా, మాడిసన్ కీస్ (అమెరికా), ఆరో సీడ్ కరొలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ల పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది.

### హాలెప్ అలవోకగా..

ఇక, మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ హాలెప్ సునాయాస విజయంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో హాలెప్ 6–3, 6–2తో ఆరో సీడ్ కరొలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేసింది. ప్రారంభం నుంచే హాలెప్ తనదైన రీతిలో చెలరేగి పోయింది. చూడచక్కని షాట్లతో ముందుకు సాగింది. హాలెప్ దూకుడు ముందు ప్లిస్కోవా ఎదురు నిలువలేక పోయింది. కనీస ప్రతిఘటన ఇవ్వకుండానే తొలి సెట్‌ను కోల్పోయింది. రెండో సెట్‌లో కూడా అదే ఫలితం పునరావృతం అయ్యింది. ప్రారంభం నుంచే హాలెప్ చెలరేగి ఆడింది. కళ్లు చెదిరే షాట్లతో ప్లిస్కోవాను ఉక్కిరిబిక్కిరి చేసింది. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుంటూ మ్యాచ్‌ను సొంతం చేసుకుని సెమీస్‌కు చేరుకుంది. మరో పోటీలో 21వ సీడ్ అంజెలిక్ కెర్బర్ (జర్మనీ) విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన క్వార్టర్ ఫైనల్లో కెర్బర్ 6–1, 6–2తో అమెరికా క్రీడాకారిణి మాడిసన్ కీస్‌ను చిత్తు చేసింది. మొదటి నుంచే కెర్బర్ చెలరేగి ఆడింది. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ లక్ష్యం దిశగా సాగింది. ఈ క్రమంగా రెండు సెట్లను గెలిచి సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

### బోపన్న జంట ముందుకు...

మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్), టిమియా బాబోస్ (హంగేరి) జంట క్వార్టర్ ఫైనల్లో విజయం సాధించింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న జంట 6–4, 7–6తో స్పియర్స్ (అమెరికా), సెబాస్టియన్ కొబాల్ (కొలంబియా) జంటను ఓడించింది. ప్రారంభం నుంచే ఐదో సీడ్ బోపన్న జోడీ ఆధిపత్యం చెలాయించింది. చూడచక్కని షాట్లతో ప్రత్యర్థి జంటను హడలెత్తించింది. ఇదే క్రమంలో 6–4తో తొలి సెట్‌ను దక్కించుకుంది. అయితే రెండో సెట్‌లో బోపన్న జంటకు ప్రత్యర్థి జోడీ నుంచి కాస్త ప్రతిఘటన తప్పలేదు. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న బోపన్న జంట సెట్‌ను గెలిచి సెమీస్‌కు చేరుకుంది.

### చుంగ్ సంచలనం...



మరోవైపు ఆసియా ఆశాకిరణం హియాన్ చుంగ్ (దక్షిణ కొరియా) కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో చుంగ్ 6–4, 7–6, 6–3తో అమెరికా ఆటగాడు టి.సాండ్‌గ్రేన్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే ఇద్దరు నువ్వానేనా అన్నట్టు పోరాడారు. ముఖ్యంగా చుంగ్ చూడచక్కని షాట్లతో అలరించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో అగ్రశ్రేణి ఆటగాడు జొకోవిచ్‌ను మట్టి కరిపించి పెను సంచలనం సృష్టించిన చుంగ్ ఈసారి కూడా అదే దూకుడును కొనసాగించాడు. కాగా, సాండ్‌గ్రేన్ కూడా ప్రారంభంలో బాగానే ఆడాడు. అయితే కీలక సమయంలో ఒత్తిడిని తట్టుకోవడంలో విఫలమయ్యాడు. ఇది చుంగ్‌కు కలిసి వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకున్న హియాన్ 6–4తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో పోరు మరింత రసవత్తరంగా సాగింది. ఈసారి టైబ్రేకర్ తప్పలేదు. ఇద్దరు కూడా పోటీ పడి ఆడడంతో ఉత్కంఠ సమరం సాగింది. కాగా, ఈసారీ కీలక సమయంలో చుంగ్ పైచేయి సాధించాడు. ప్రత్యర్థి బలహీనతలను తనకు అనుకూలంగా మార్చుకుంటూ ముందుకు సాగాడు. ఇదే క్రమంలో సెట్‌ను దక్కించుకున్నాడు. మూడో సెట్‌లో మాత్రం చుంగ్‌కు ప్రత్యర్థి ఏమాత్రం ప్రతిఘటన ఎదురు కాలేదు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడుతూ చుంగ్ సెట్‌ను దక్కించుకుని సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు.

## విరాట్‌పై విమర్శలు వద్దు: గంగూలీ




కోల్‌కతా: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లికి మాజీ సారథి సౌరవ్ గంగూలీ మరోసారి అండగా నిలిచాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో జట్టు వరుస పరాజయాల నేపథ్యంలో కోహ్లిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ స్మిత్ కూడా కోహ్లి తీవ్ర విమర్శలు గుప్పించాడు. టీమిండియా కెప్టెన్‌గా కోహ్లికి పనికి రాడని, త్వరలోనే అతనికి ఉద్వాసన తప్పక పోవచ్చని వ్యాఖ్యానించాడు. అంతేగాక, జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించాలనే అతని ధోరణి టీమిండియాకు ప్రతికూలంగా మారిందని అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌కు ఉండాల్సిన లక్షణాలు కోహ్లికి ఏమాత్రం లేవని స్మిత్ పేర్కొన్నాడు. కాగా, స్మిత్ వ్యాఖ్యలను గంగూలీ ఖండించాడు. కోహ్లిలో అద్భుత నాయకత్వ ప్రతిభ దాగివుందన్నాడు. ఇందుకు అతని కెప్టెన్సీలో టీమిండియా సాధించిన విజయాలే నిదర్శనమన్నాడు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తట్టుకొని ముందుకు సాగే తత్వం కోహ్లి సొంతమన్నాడు. అటువంటి ఆటగాడిపై స్మిత్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నాడు. ఏ కెప్టెన్‌కైనా గెలుపు, ఓటములు సహజమేనని, అంత మాత్రాన అతనిపై అదే పనిగా విమర్శలు గుప్పించడం సముచితం కాదని వ్యాఖ్యానించాడు.

## తీరు మార్చుకోవాలి: సెహ్వాగ్



న్యూఢిల్లీ: భారత కెప్టెన్ విరాట్ కోహ్లి తన తీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ సూచించాడు. కెప్టెన్‌గా కోహ్లి అనుసరిస్తున్న అసంబద్ధ నిర్ణయాలే జట్టు ఓటమికి కారణమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. ఆటగాళ్ల నుంచి సలహాలు, సూచనలను తీసుకోవడంలో కోహ్లి ఆసక్తి చూపడం లేదని, తానే ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు పోతున్నాడని విమర్శించాడు. ఇలా వ్యవహరిస్తే జట్టుకు తీరని నష్టం కలుగడం ఖాయమన్నాడు. కోహ్లి మంచి ఆటగాడు అనడంలో సందేహం లేదని, అయితే సహచరులు కూడా తన లాగే ఆడాలని కోరుకుంటాడని, అయితే ఈ వైఖరీ ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని తెలిపాడు. ఆటగాళ్ల వైఫల్యానికి కోహ్లి ఏకపక్ష వైఖరే కారణమని చెప్పడంలో తాను సందేహించనని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు. ఆటగాళ్ల అభిప్రాయాలు తెలుసుకుని ముందుకు సాగితేనే ఏ కెప్టెన్ అయినా విజయవంతం కాగలుగుతాడని అభిప్రాయపడ్డాడు. గతంలో సచిన్ కూడా ఇలాగే వ్యవహరించి కెప్టెన్ ఘోర వైఫల్యం చవిచూసిన విషయాన్ని సెహ్వాగ్ గుర్తు చేశాడు. అంతేగాక డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లతో కోహ్లి వ్యవహారం కూడా అంతగా బాగుండలేదని కూడా పేర్కొన్నాడు. కోహ్లి అంటే సహచరుల్లో ఒక విధమైన భయం నెలకొందని, అందువల్లే ఏ ఒక్కరూ కూడా అతనికి వ్యతిరేకంగా ఎటువంటి వ్యాఖ్యలు చేయలేక పోతున్నారని సెహ్వాగ్ తీవ్ర ఆరోపణలు చేశాడు. ఇది జట్టును ఇబ్బందుల్లోకి నెట్టడం ఖాయమన్నాడు. కోచ్ సలహాలు కూడా కోహ్లి పాటించడం లేదని, ఇది కూడా జట్టు వైఫల్యానికి ఒక కారణమని సెహ్వాగ్ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

## పుజారా డిఫెన్స్‌పై పేలిన జోకులు



జోహెన్నస్‌బర్గ్: భారత స్టార్ బ్యాట్స్‌మన్ చటేశ్వర్ పుజారాపై సోషల్ మీడియా వేదికగా జోకులు పేలుతున్నాయి. దక్షిణాఫ్రికాతో బుధవారం ప్రారంభమైన చివరి టెస్టులో పుజారా బ్యాటింగ్ తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు. తొలి పరుగు చేయడానికే 54 బంతులు ఆడడంపై నెటిజన్లు తమదైన శైలీలో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. పుజారా బ్యాటింగ్‌ను చూసి నత్తా సైతం హడలెత్తి పోవడం ఖాయమని కొందరూ వ్యాఖ్యనించగా, మరి కొందరూ రోజు మొత్తం ఆడిన పది పరుగులు చేయడం కూడా కష్టమని వ్యాఖ్యానిస్తున్నారు. అతని బ్యాటింగ్ చూస్తుంటే తొలి రోజే డ్రాకు సిద్ధమయినట్టు స్పష్టమవుతోంది. ఇక, పుజారా ఇదే వేగంతో ఆడితే ఐదు రోజులు కూడా తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ కాకుండా ఉండడం టీమిండియాకు కష్టమేమి కాదని కొందరు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇక, పుజారా అభిమానులు మాత్రం తమ స్టార్ క్రికెటర్‌పై తమదైన పద్ధతిలో ప్రశంసలు కురిపిస్తున్నారు. అసలైన టెస్టు క్రికెటర్ బ్యాటింగ్ ఎలా ఉంటుందో తమ అభిమాన ఆటగాడు ఆచరణలో నిరూపించాడని అభిప్రాయపడుతున్నారు. ఇక, పుజారా తొలి పరుగు చేయగానే కొందరు నెటిజన్లు మరింత రెచ్చిపోయారు. పుజారా చాలా గ్రేట్..54 బంతుల్లోనే ఖాతా తెరిచి తమ అంచనాలు తారుమారు చేశాడని వ్యాఖ్యానించారు. నిజంగా అన్ని ఓవర్లు ఆడినా అతను ఖాతా తెరుస్తాడనే నమ్మకం లేకుండేదని, అయితే పుజారా అత్యంత వేగంగా ఈ రికార్డును బద్దలు కొట్టడం మాములు విషయం కాదని మరి కొందరూ పేర్కొన్నారు.

# మళ్లీ పాత కథే..

**చెలరేగిన సఫారీ బౌలర్లు, భారత్ 187 ఆలౌట్, చివరి టెస్టు**



జోహెన్నస్‌బర్గ్: మూడో టెస్టులోనూ భారత బ్యాట్స్‌మెన్ తీరు మారలేదు. ఈసారి మొదట బ్యాటింగ్ చేసినా ఫలితం లేకుండా పోయింది. దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులకే కుప్పకూలింది. తర్వాత మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన సౌతాఫ్రికా బుధవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి ఆరు పరుగులు చేసింది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన టీమిండియా కనీసం మూడో టెస్టులోనైనా ప్రత్యర్థికి గట్టి పోటీ ఇస్తుందని భావించిన అభిమానులకు మరోసారి నిరాశే మిగిలింది. ఫాస్ట్ బౌలింగ్ పిచ్‌లపై తమ బలహీనతను మరోసారి చాటుతూ టీమిండియా 76.4 ఓవర్లలో 187 పరుగులకే చాప చుట్టేసింది. సఫారీ బౌలర్లు సమష్టిగా రాణించి భారత ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు.

### మరో సారి..

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ లోకేష్ రాహుల్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఫిలాండర్ వేసిన అద్భుత బంతికి వికెట్ల వెనక దొరికి పోయాడు. ఆ వెంటనే మరో ఓపెనర్ విజయ్ కూడా వెనుదిరిగాడు. 8 పరుగు లు చేసిన విజయ్‌ను రబడా వెనక్కి పంపాడు. దీంతో భారత్ 13 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచే బాధ్యత కెప్టెన్ విరాట్ కోహ్లి, నయా వాల్ పుజారా తమపై వేసుకున్నారు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు.

### నత్తను తలపించాడు...

ఇక, పుజారా మాత్రం మరి ఆత్మరక్షణతో బ్యాటింగ్ చేసి ఇటు ప్రత్యర్థి బౌలర్లను, అటు అభిమానులను విసుగించాడు. ఓవర్లకు ఓవర్లు ఆడిన పుజారా ఖాతా తెరవడంలో విఫలమయ్యాడు. దాదాపు గంటన్నరకు పైగా నిరీక్షణ అనంతరం పుజారా పరుగుల ఖాతా తెరిచాడు. 54 బంతులు ఎదుర్కొన్న తర్వాత పుజారా తన తొలి పరుగును సాధించాడు. దీన్ని బట్టి అతను ఎంత ఆత్మరక్షణతో ఆడాడో అర్థం చేసుకోవచ్చు.

### కోహ్లి కెప్టెన్సీ ఇన్నింగ్స్..

మరోవైపు విరాట్ కోహ్లి మాత్రం కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగాడు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే అడపాదడపా బౌండరీలతో అలరించాడు. మంచి బంతులను డిఫెన్స్ ఆడుతూ చెత్త బంతులను బౌండరీలు దాటించాడు. అయితే రెండో ఎండ్‌లో పుజారా మరి నత్తనడకన ఆడడంతో కోహ్లి తన సహజ శైలీలో ఆడలేక పోయాడు. పుజారా కేవలం డిఫెన్స్‌కే ప్రాధాన్యత ఇవ్వడంతో స్కోరు మరి నెమ్మదిగా సాగింది. భోజన విరామ సమయానికి భారత్ స్కోరు 45 పరుగులకు చేరింది. దీన్ని బట్టి భారత బ్యాటింగ్ ఎంత నత్తనడకన సాగిందో ఊహించవచ్చు. లంచ్ తర్వాత కోహ్లి, పుజారా కాస్త దూకుడును పెంచారు. ముఖ్యంగా కోహ్లి వేగంగా ఆడుతూ ముందుకు సాగాడు. పుజారా కూడా బ్యాట్‌ను ఝులిపించడం ప్రారంభించాడు. కాగా, కోహ్లి 101 బంతుల్లో 9 ఫోర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే కుదురుగా ఆడుతున్న కోహ్లి (54)ను ఎన్‌గిడి వెనక్కి పంపాడు. తర్వాత భారత కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి.

### నిరాశపరిచిన రహానె...

కాగా, రోహిత్ స్థానంలో జట్టులోకి వచ్చిన అజింక్య రహానె తన స్థాయికి తగ్గ ఆటను కనబరచలేదు. ప్రత్యర్థి బౌలర్లపై ప్రభావం చూపడంలో విఫలమయ్యాడు. కేవలం 9 పరుగులు మాత్రమే చేసి మోర్కెల్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.

### స్కోరుబోర్డు:

**భారత్ మొదటి ఇన్నింగ్స్:** మురళీ విజయ్ (సి) డికాక్ (బి) రబడా 8, లోకేష్ రాహుల్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 0, చటేశ్వర్ పుజారా (సి) డికాక్ (బి) పెహ్లుక్‌వాయో 50, విరాట్ కోహ్లి (సి) డివిలియర్స్ (బి) ఎన్‌గిడి 54, అజింక్య రహానె ఎల్బీ (బి) మోర్నీ మోర్కెల్ 9, పార్థివ్ పటేల్ (సి) డికాక్ (బి) మోర్నీ మోర్కెల్ 2, హార్దిక్ పాండ్య (సి) డికాక్ (బి) పెహ్లుక్‌వాయో 0, భువనేశ్వర్ కుమార్ (సి) పెహ్లుక్‌వాయో (బి) రబడా 30, మహ్మద్ షమి (సి) రబడా (బి) ఫిలాండర్ 8, ఇషాంత్ శర్మ (సి) డుప్లెసిస్ (బి) రబడా 0, బుమ్రా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 26, మొత్తం 76.4 ఓవర్లలో 187 ఆలౌట్.
**బౌలింగ్:** మోర్నీ మోర్కెల్ 17–5–47–2, ఫిలాండర్ 19–10–31–2, రబడా 18.4–6–39–3, ఎన్‌గిడి 15–7–27–1, పెహ్లుక్‌వాయో 7–1–25–2.
**దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్:** డీన్ ఎల్గర్ (బ్యాటింగ్) 4, ఐడెన్ మార్క్రామ్ (సి) పార్థివ్ (బి) భువనేశ్వర్ కుమార్ 2, రబడా (బ్యాటింగ్) 0, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం ఆరు ఓవర్లలో 6/1.
**బౌలింగ్:** భువనేశ్వర్ కుమార్ 3–2–3–1, జస్‌ప్రిత్ బుమ్రా 3–2–3–0.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.